అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 01-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 182 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50

బదిలీల్లో ఎస్‌జీటీ ఖాళీలన్నీ చేపట్టాలి

- నేడు టీఆర్‌టీఎఫ్ నిరసన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్జీటీ తత్సమాన ఉపాధ్యాయ ఖాళీ పోస్టులన్నీ ఓపెన్ చేయాలని టీఆర్‌టీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు వినతి పత్రాన్ని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్, అంజిరెడ్డి సమర్పించింది. పదోన్నతుల్లో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. తిరిగి బదిలీల్లో కూడా తీవ్ర నష్టం జగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో డీఎస్సీ ఉన్నందున మిగతా కాలేజీల్లో నూతన ఉపాధ్యాయులు చేరే అవకాశం ఉన్నదనీ, సీనియర్ సర్వీస్ ఉపాధ్యాయులకు అన్ని ఖాళీలు చూపెట్టాలని కోరారు. ప్రతి పాఠశాలలకు ఉపాధ్యాయిన్ని కేటాయిఇస్తానని సీఎం చేసిన వాగ్దానానికి భిన్నంగా పాఠశాల విద్యాశాఖ ఖాళీలను చూపడం లేదని పేర్కొన్నారు. ఎస్‌జీటీలకు జరుగుతున్న నష్టంపై నిరసన తెలియ జేస్తూ సోమవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరౌతామని పేర్కొన్నారు.

విద్యార్థి, యువజన సంఘాల రాజ్‌భవన్ ముట్టడి

- మద్దతు ప్రకటించిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేడు విద్యార్థి యువజన సంఘాలు తలపెట్టిన రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ప్రొఫెసర్ కె చక్రధరరావు, ప్రొఫెసర్ జి. హర గోపాల్, ప్రొఫెసర్ కె లక్ష్మినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టిఏ ఆధ్వర్యంలో జరిగిన నీట్ పరీక్ష పేపర్లు అమ్ముకోవడం, లీక్ చేయడంతో 23 లక్షల మంది విద్యార్థుల శ్రమ, డబ్బులు, వృధా అయిందని వారు విమర్శించారు. ఆ పరీక్ష అవకతవకల వలన విద్యావ్యవస్థకి మూలస్తంభమైన పరీక్షా వ్యవస్థే విశ్వసనీయతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2016 ముందు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమ ప్రాంతాల్లో వైద్య విద్య ప్రవేశాల కోసం పరీక్షలు నిర్వహించుకునేదనీ, విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నదనే విషయాన్ని ఖాతరు చేయకుండా, రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, కేంద్ర ప్రభుత్వం నీట్ పేరు మీద వైద్య విద్యకు పరీక్షలు నిర్వహించడం రాజ్యాంగంలో పొందుపరిచిన సమైక్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఇటువంటి కేంద్రీకృత పరీక్షలకు, విద్యా వ్యతిరేక విధానాలకు జాతీయ విద్యా విధానం ఆమోదముద్ర వేయడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలను దెబ్బతీసే జాతీయ విద్యా విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని తెలియజేయాలని డిమాండ్ చేశారు.

కార్పొరేటీకరణ దిశగా ఉన్నత విద్యారంగం

- జులై 10న నిరసనలు : టీయూఈడబ్ల్యాయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం విశ్వ విద్యాలయాలను వ్యాపార సంస్థలుగా మారుస్తున్నదనీ, దీనిని నిరసిస్తూ ఈ నెల పదో తేదీన నిరసనలు తెలుపుతామని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(టీయూఈడబ్ల్యాయూ- సీఐటీయూ అనుబంధం) ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్షులు మెట్టు రవి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఉన్నత విద్యకు రెండు శాతం నిధులను కూడా కేటాయించకపోవడం వల్ల యూనివర్సిటీల్లోని టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని తెలిపారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం వర్సిటీలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా రెండో పీఆర్సీ, రెగ్యులరైజేషన్, పెండింగ్ వేతనాల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సాహిత్య వారసత్వానికి చేసిన గొప్ప కృషి 'రామచిలుక'

- గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాహిత్య వారసత్వానికి చేసిన అమూల్యమైన కృషి 'రామచిలుక' పుస్తకమని పుదుచ్చేరి తెలంగాణ, లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రామచిలుక తెలుగు అనువాద పుస్తకాన్ని రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. అనంతరం రాధాకృష్ణన్ మాట్లాడుతూ అనువాదకుడు ఎల్ఆర్ స్వామి తెలుగు అనువాదం రచన యొక్క సారాంశాన్ని పూర్తిగా ప్రతిబింబించిందన్నారు. ఈ పుస్తకానికి తగిన గుర్తింపు, విజయం లభిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు, రచయిత అసాధారణ ప్రతిభ, స్ఫూర్తినిచ్చే సామర్థ్యాల్ని కొనియాడారు. "రామచిలుక" ఏడు కథల సంపుటి అని చెప్పారు. రచనలో తన సాహిత్య నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. తెలివైన, ఆలోచింపజేసే కథలతో పాఠకులను కట్టిపడేశారని కొనియాడారు. "రామచిలుక" అతని బహుముఖ ప్రజ్ఞకు, శ్రేష్ఠతకు నిబద్ధతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, గోవా గవర్నర్ కార్యదర్శి యం.ఆర్.యం. రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, కవి, రచయిత కె. శివారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతి భేష్

- డాక్టర్ ఏ ముఖర్జీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతి వైద్యం భేష్ అని డాక్టర్ ఏ. ముఖర్జీ తెలిపారు. నేటి సమాజంలో చాలా మంది రుమాటిక్ ఆర్థరైటిస్, ఆస్తమా, అలర్జీ, సంబంధిత సమస్యలు, ఐబీఎస్ సమస్యలు, గుండె జబ్బులు వంటి క్లిష్టమైన కేసులను ఎదుర్కొంటున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి సరైన చికిత్స అందిస్తే ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఆధునిక కాలంలో హోమియోపతి చాలా వ్యాధులకు పరిష్కారం చూపగలదని పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో హోమియోపతి ప్రపంచంలోని ప్రతి ఇంటికి చేరుకోగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్ సంప్రదింపుల కోసం 6302761047కు కాల్ చేయండి లేదా sevahomoeoclinic.comలో సంప్రదించండి. క్లినిక్ చిరునామా - ఫ్లాట్ 102, నెస్ట్ అపార్ట్‌మెంట్స్, డీకే రోడ్, అమీర్‌పేట్ హైదరాబాద్ - 500016.

గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ద్వారా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు - 2025 కొరకు రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్ లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణను ప్రభుత్వం ఇవ్వనున్నది. అర్హులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల ఏడు వరకు ప్రభుత్వం పొడిగించింది. అభ్యర్థులు ఆబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడుతారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.మూడు లక్షలు మించరాదు. అభ్యర్థులు http://studycircle.cgg.gov.in లో లాగిన్ కావాలి. ఆన్ లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్ లైన్ అప్లికేషన్,సూచనలు .cgg.gov http://studycircle.in, http://twd.telangana.gov.in వెబ్‌సైట్ లో అందుబాటులో కలవు. మరిన్ని వివరాలకు 6281766534కు అన్ని పని దినాల్లో ఉదయం . 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల లోపు సంప్రదించాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కనీస మద్దతు ధరల కోసం

నేడు, రేపు ఆందోళనలు

- తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరల చట్టం చేయాలని కోరుతూ సోమ, మంగళవారాల్లో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు పి. జంగారెడ్డి, అరిబండి ప్రసాదరావుతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పంటల మద్దతు ధరలు సహేతుకంగా లేవన్నారు. పెరుగుతున్న రైతుల పెట్టుబడిని పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. వెంటనే ఆ ధరలను సవరించాలని డిమాండ్ చేశారు. అందుకోసం అన్ని జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో నిరసనలు తెలియజేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. గతేడాది నిర్ణయించిన ధరలపై 5 నుంచి 7 శాతం మాత్రమే పెంచారని తెలిపారు. అదే సందర్భంలో వ్యవసాయోత్పత్తి ఖర్చులు 20 నుంచి 22 శాతం పెరిగాయన్నారు. 'వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను తగ్గించి చూపి, దానికి 50 శాతం కలిపి ధరలు ప్రకటించింది. ధరల నిర్ణయాక కమిషన్ రికమండేషన్లను ప్రధాని నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ పరిగణనలోకి తీసుకోలేదు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ తరహాలో రాష్ట్రంలో 'ధరల నిర్ణయాక కమిషన్' (సీఏసీపీ) వేసి రాష్ట్రంలో పండే అన్ని పంటలకు



మద్దతు ధరలను నిర్ణయించి అమలు చేయాలి. కూరగాయలతోపాటు పండ్లకు కూడా మద్దతు ధరలను నిర్ణయించాలి. దీంతో నిర్ణయించిన ధరలను అమలు జరపడం రైతులకు వీలు అవుతుంది' అని సూచించారు. ధరలు నిర్ణయించడంతోపాటు నిర్ణయించిన ధరలను అమలు జరిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని కోరారు.

పంటలు- కేంద్రం నిర్ణయించిన ధర - వాస్తవంగా పెరగాల్సింది - రైతుకు నష్టం (క్వింటాల్ లెక్కన)

	(ఎంఎస్‌పీ)	(సీ2శాతం +50)	
వరి	2300	3012	712
పత్తి	7121	9345	2224
మొక్కజొన్న	2225	2795	570
జొన్న	3371	4437	1066
సజ్జలు	2625	2904	279
రాగులు	4290	5198	908
కందులు	7550	9756	2206
పెసర	8682	10956	2274
మినుములు	7400	9744	2344
వేరుశనగ	6783	8496	1713
పొద్దుతిరుగుడు	7280	9891	2611
సోయాబీన్	4892	6437	1555
నువ్వులు	9267	12228	2961

వెంకయ్య వాగ్ధాటి అమోఘం

- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
- ఆయన జన్మదినం సందర్భంగా జీవిత ప్రస్థానంపై మూడు పుస్తకాలు ఆవిష్కరణ

హైదరాబాద్: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గ్రామీణం ప్రాంతం నుంచి వచ్చి ఉన్నత స్థానానికి ఎదిగిన వ్యక్తి అని, ఆయన వాగ్ధాటి ముందు ఎవరూ నిలవలేరని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. వెంకయ్యనాయుడి జన్మదినం సందర్భంగా ఆయన జీవిత ప్రస్థానంపై రూపొందించిన మూడు పుస్తకాలను వర్చువల్‌గా ప్రధాని ఆవిష్కరించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. వెంకయ్య నాయుడు జీవితంపై వచ్చిన 'సేవలో వెంకయ్యనాయుడు జీవితం', '13వ ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు లక్ష్యం, సందేశం', 'మహానేత వెంకయ్యనాయుడు జీవితం, ప్రయాణం' అనే పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఇవి దేశ ప్రజలకు మార్గనిర్దేశం చేస్తాయని చెప్పారు. " వెంకయ్య నాయుడితో సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం నాకు దక్కింది. వేలాది కార్యకర్తలు ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన 17 నెలల జైలు జీవితం గడిపారు" అని అన్నారు. గ్రామీణ, పట్టణాభివద్ధి శాఖలో వెంకయ్య నాయుడు తనదైన ముద్ర వేశారని తెలిపారు. స్వచ్ఛభారత్, అమత్ యోజన వంటి ఎన్నో పథకాలు సమర్థవంతంగా అమలు చేసిన వ్యక్తి వెంకయ్య అని చెప్పారు. ఆయన రాజ్యసభ ఛైర్మెన్‌గా సభను సజావుగా నడిపారని, ఆయన సేవలను దేశం మరవదని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు బిల్లు తొలుత రాజ్యసభ ముందుకు వచ్చి ఆమోదం పొందడంలో వెంకయ్య పాత్ర కీలకమని తెలిపారు. రాజ్యసభ నిర్వహణలో ఆయన అనుభవం ఉపయోగపడిందని అన్నారు.

పార్టీ ద్వారా వచ్చిన పదవిని వదిలిన తరువాతే పార్టీ మారాలి : వెంకయ్యనాయుడు

" చట్ట సభలకు ఎంపికైన వారు హుందాగా ప్రవర్తించాలి. సిద్ధాంతం నచ్చకపోతే నాయకులు పార్టీ మారవచ్చు. పార్టీ ద్వారా వచ్చిన పదవిని వదిలి వెళ్లాలి. కార్యకర్తలకు నేతలు నియమావళి రూపొందించాలి. రాజకీయాల్లో జవాబుదారీతనం తీసుకురావడానికి ప్రయత్నించాలి. కులం, ధనం ప్రభావం తగ్గిపోవాలి. గుణం చూసి నాయకులకు ఓటు వేయాలి. మార్పు రాకపోతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. దేశ ప్రతిష్ఠను నిలబెట్టాలంటే చెడు పోకడలను అడ్డుకోవాలి" అని వెంకయ్యనాయుడు అన్నారు. దేశ ప్రజలకు ప్రధాని అందిస్తున్న సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ నినాదంతో మోడీ ముందుకెళ్తున్నారని చెప్పారు. అవసరం ఉన్నంత వరకు ఉచిత రేషన్ పథకంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కొనసాగించాలని వెంకయ్యనాయుడు కోరారు. మాతభాషలను కేంద్రం ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. తాను ఆంగ్ల భాషకు వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలన్నీ భారతీయ భాషల్లో ఉండాలని చెప్పారు. ఆ తర్వాతే ఆంగ్ల భాషలో ఉండాలని కోరారు. మాతభాష, సోదర భాష తర్వాతే ఇతర భాషలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు

సొంత డబ్బులతో అభివృద్ధి.. బిల్లులిప్పించండి

గవర్నర్ సీ.పీ.రాధాకృష్ణన్‌కు సర్పంచుల బృందం వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామాల్లో అభివృద్ధి పనులను సొంత డబ్బులు ఖర్చుపెట్టి చేశామనీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ పనులకు సంబంధించిన బిల్లులను ఇప్పించాలని రాష్ట్ర గవర్నర్ సీ.పీ. రాధాకృష్ణన్‌కు సర్పంచుల బృందం విన్నవించింది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డితో కూడిన బృందం వినతిపత్రాన్ని అందజేసింది. సర్పంచుల పదవీకాలం పూర్తై ఆరు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక పాలనపై దృష్టి పెట్టడం లేదని గవర్నర్‌కు బృందం



సభ్యులు వివరించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, రైతు వేదికలు, క్రీడా ప్రాంగణాలు, గ్రామపంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలను తమ సొంత డబ్బులతో ఖర్చు పెట్టి చేశామని వాపోయారు.

పనులు చేసి ఏండ్లు గడుస్తున్నా నేటికీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కలెక్టర్లకు, మంత్రులకు, ముఖ్యమంత్రికి వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోలేదని వాపోయారు. తమ ఆస్తులు తాకట్టు పెట్టి పనులు చేసిన సర్పంచులు వాటిని ఎలా తీర్చుకోవాలో అర్థంకాక, అప్పుల బాధతాళలేక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించేలా చూడాలని వేడుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేయిస్తానని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హామీనిచ్చారని యాదయ్య, లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సుభాష్ గౌడ్, గణేష్ సముద్రాల, రమేష్, రాజేందర్, లక్ష్మారెడ్డి, సురేష్ కూడా ఉన్నారు.

కార్టూన్లకు తగ్గుతున్న ఆదరణ

- ప్రాధాన్యతను తగ్గించిన పత్రికలు
- డిజిటల్ ప్లాట్‌ఫామ్ రాకతో కుదేలు
- తెలుగు కార్టునిస్టు వర్క్‌షాపులో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

" కార్టున్లకు రాను రాను ఆదరణ తగ్గుతోంది. ప్రపంచీకరణతో వచ్చిన మార్పుల కారణంగా సాంప్రదాయ వ్యంగ్య చిత్రాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. డిజిటల్ ఫ్లాట్‌ఫాం రాకతో వచ్చిన నూతన ఒరవడుల నేపథ్యంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని కార్టునిస్టులు కొత్తనైపుణ్యాలతో తమ వృత్తిలో రాణించాలి" అని పలువురు వక్తలు అన్నారు. వ్యంగ్య చిత్రాలు వేయడం లో మెళుకువలు, డిజిటల్ ఫ్లాట్‌ఫాం రాకతో వచ్చిన మార్పులు తదితర అంశాలపై ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిం చిన "తెలుగు కార్టునిస్టుల మెగా వర్క్‌షాప్"లో ప్రముఖ కార్టునిస్టులు తమ అభిప్రా యాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మూడు దశాబ్దాలకు పూర్వం తెలుగు పత్రికా రంగంలో రాజకీయ, సామాజిక కార్టున్లు బహుళ ప్రాచుర్యం పొందాయని అన్నారు. గ్లోబలైజేషన్ నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థ దెబ్బకు కుదేలైన పత్రికలు తమ స్వీయ మనుగడకు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యంగ్య చిత్రాలను తగ్గించాయని పేర్కొన్నారు. దాంతో కార్టునిస్టులు ఇతర మార్గాల ద్వారా వాటికి ప్రాచుర్యం తీసుకొచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫొటోషాప్, ఐ ప్యాడ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదితర సాంకేతికతలు ప్రపంచాన్ని ఏలుతున్న తరుణంలో, కాలానుగుణంగా వచ్చిన మార్పులను అందిపుచ్చుకొని కొత్త తరహాలో కార్టుని స్టులు దూసుకుపోవాలని సూచించారు. రాజకీయ విధానాలు, స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, తదితర అంశాలతో గీసే వ్యంగ్య చిత్రాలకు సృజనాత్మకతను జోడించి సమాజాన్ని, వ్యవస్థలను ప్రశ్నించే వారి సంఖ్య రోజు రోజుకు తగ్గుతు న్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దిశలో వెళ్లే వారికి వచ్చే బెదిరింపులు, ఒత్తిడిలు కూడా తప్పటం లేదని పేర్కొన్నారు. గత ముప్పై ఏండ్ల కాలంలో దేశంలో వచ్చిన రాజకీమ మార్పుల నేపథ్యంలో కార్టునిస్టులకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు.ఈ క్రమంలో కులం, మతం, ప్రాంతం, జాతి తదితర అంశాల విషయంలో జాగ్రత్తగా చిత్రాలను గీయాలని సూచించారు. కార్టున్లలోని క్రిటిజం, ఫన్, సెటైర్లు మనిషికి ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపే సాధనంగా కూడా ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తెలుగు కార్టునిస్టులు సిండికేషన్స్ వరకు వెళ్లే ప్రయత్నం చేయక పోవడం దురదృ ష్టకరమన్నారు. ప్రపంచ ప్రేక్షకులను మెప్పించేలా కార్టున్లను గీసి తెలుగువారి సత్తా చాటాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్టునిస్టులు టీవీ, సుభాని, సురేంద్ర, నర్సిం, శంకర్, శంకు, మృత్యుంజయ్, రాము, సంగీత తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యం

- డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ సతీష్‌రెడ్డి
- 'డాక్టర్స్ డే' సందర్భంగా 5కే వాక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జల సంరక్షణ కు, భూగర్భ జలాల పెంపుదలకు, వాన నీటిని సద్వినియోగానికి ప్రజలందరూ తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఆర్‌డీవో మాజీ ఛైర్మెన్ డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు, నీటి సంరక్ష ణను ఒక ఉద్యమంగా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. వాన నీటి సంరక్షణ చేయకపోతే మానవాళి మనుగడ ప్రమాదం లో పడుతుందని ఆయన హెచ్చరిం చారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ దుర్గం చెరువు పార్కులో ఇగ్నైటింగ్ మైండ్స్, వాక్ ఫర్ వాటర్, సింగరేణి సంస్థల ఆధ్వర్యంలో జల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు 5కే నడక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో ఖాదీ బోర్డు సభ్యులు పేరాల శేఖర్‌రావు, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఐఎంఏ నూతన అధ్యక్షులు డాక్టర్ ద్వారకా నాథ్ రెడ్డితోపాటు 200 మందికి పైగా వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలుపాల్గొన్నారు.

సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్‌కు అవార్డు

- ప్రదానం చేసిన గ్రీన్ మ్యాపుల్ సంస్థ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మొక్కలు నాటడమే కాకుండా ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్‌కు 'ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ' అనే అవార్డును గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ ప్రదానం చేసింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ -2024 అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. సింగరేణి సంస్థను పర్యావరణ హితగా మార్చడమే కాకుండా అందరిలోనూ పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు తానే స్వయంగా 18వేలకు పైగా మొక్కలు నాటి, తెలంగాణలోని 6 జిల్లాల్లో 35 చిన్న అడవులను (మినీ ఫారెస్ట్) సృష్టించారని ఆ సంస్థ ప్రతినిధులు కొనియాడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సింగరేణి సంస్థ కూడా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటి పర్యావరణానికి మేలు చేస్తున్న సంస్థల్లో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ అధికారిగా ఉన్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న తమ సంస్థ నిబంధనల ప్రకారం పచ్చదనాన్ని కాపాడడం తోపాటు స్వచ్ఛందంగా కూడా పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటినట్టు తెలిపారు. అలాగే పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు వీలుగా సింగరేణి పాఠశాలల్లో పర్యావరణ సిలబస్ బోధిస్తున్నామనీ, ప్రతీ క్లాస్‌లోనూ గ్రీన్ కెప్టెన్లను నియమించి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ, ఆయిల్ ఇండియా తదితర కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విశ్వగురువుగా మార్చడంలో ప్రయివేటు సంస్థలే కీలకం

- 2015 నుంచి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు
- వాణిజ్య, వ్యాపార వేత్తల ఆత్మీయ సదస్సులో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశాన్ని విశ్వగురువుగా మార్చడంలో ప్రయివేటు సంస్థల భాగస్వామ్యం చాలా కీలకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి నొక్కిచెప్పారు. అందులో భాగంగానే ప్రయివేటు సంస్థలకు 2015 నుంచి పెద్దఎత్తున ప్రోత్సహకాలు అందిస్తున్నామని చెప్పారు. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల కోల్ గ్యాసిఫికేషన్ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తున్నామనీ, అందులో ప్రయివేటు రంగం కీలక పాత్ర పోషించబోతున్నదని అన్నారు. వ్యాపార వేత్తలకు మోడీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వాణి జ్య వ్యాపార వేత్తల ఆత్మీయ సదస్సు జరిగింది. అందులో కేంద్ర మంత్రి పీయుష్ గోయల్, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లా డుతూ..ప్రభుత్వానికి, పారిశ్రామికవేత్తలకు మధ్య నిర్మాణాత్మకమైన చర్చల ద్వారానే దేశ భవిష్యత్తుకు బాటలు పడుతాయన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు ఎదురయ్యే సవాళ్లపై కార్పొరేట్ కంపెనీలతో చర్చించడానికి, ఆలోచనలు పంచుకోవడానికి, శక్తివంతమైన భాగస్వామ్యాలను నిర్మించడానికి ఇలాంటి వేదికలు అవసరమని అభిప్రా యపడ్డారు. పరిశోధన, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి హైదరాబాద్ కేంద్ర బిందువుగా ఉందనీ, ఇక్కడ తయారైన వ్యాక్సిన్ యావత్ ప్రపంచంలో కరోనా భయాన్ని తొలగించిందని చెప్పారు. ప్రయివేటు రంగ భాగ స్వామ్యం, సాంకేతిక పురోగతి ద్వారా సుస్థిరమైన ఆర్థిక ప్రగతిని సాధ్యమ వుతుదని స్పష్టం చేశారు. ఉద్యోగ కల్పన, ఎగుమతులు పెండానికి వినూత్న ఆలోచనలు అవసరమన్నారు. అందులో భాగంగానే తమ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొస్తున్నదని చెప్పారు. జీఎస్టీ, బ్యాంకింగ్ రంగ సంస్కరణలు, డిజిటలైజేషన్ వంటి చర్యలు దేశాన్ని ముందుకు నడిపించాయన్నారు. స్టార్టప్ కల్చర్ దేశ ప్రగతిలో కొత్త అధ్యాయాన్ని లిఖిం చిందనీ, ఆర్అండ్‌డీ సంస్థలకు పెద్దఎత్తున గ్రాంట్లు లభించాయని చెప్పారు. ఆర్టిఫిషియల్, ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీలో సాంకేతి పరిజ్ఞానాన్ని పెంచడానికి ఏఐ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నామన్నారు.

పాలనలో ప్రణాళిక శాఖ పాత్ర కీలకం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ పాలనలో ప్రణాళిక శాఖ పాత్ర కీలకమనీ, ఆ శాఖ రూపొందించే గణాంకాలు, క్షేత్ర స్థాయి సర్వేలు రాష్ట్ర పాలనకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని అర్థ గణాంక శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఆ శాఖ డైరెక్టర్ దయానంద్ పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దయానంద్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఆయనకు సన్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ అర్థగణాక, గణాంక శాఖలో 35 సంవత్సరాలపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న దయానంద్ దక్షతను గుర్తించి ప్రభుత్వంలో రానున్న రోజుల్లో ఆయనకు తగిన గుర్తింపు దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పదవీ విరమణ చేస్తున్న ఆ శాఖ డైరెక్టర్ దయానంద్‌ను ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఘనంగా సన్మానించారు.

దక్షిణ కొరియా, జపాన్, అమెరికా సంయుక్త విన్యాసాలను ఖండిస్తున్నాం



ప్యోంగ్యాంగ్ : దక్షిణ కొరియా, జపాన్, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలను ఉత్తర కొరియా ఆదివారం ఖండించింది. వాటిని నాటో ఆసియా వెర్షన్ అని అభివర్ణించింది. అవి "ప్రమాదకరమైన పరిణామాలు "గా హెచ్చరించింది. వార్షిక కసరత్తుల నిర్వహించాలని గత ఏడాది త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్‌లు ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. డెమోక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డీపీఆర్‌కే) వ్యతిరేకంగా ఈ సైనిక విన్యాసాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఉత్తరకొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. మిలటరీ కూటమిని బలోపేతం చేసేందుకు అమెరికా, దాని అనుచరుల ఎత్తుగడలను డీపీఆర్‌కే ఎప్పటికీ పట్టించుకోదని తెలిపింది.

తమిళనాడులోని పలు ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు

చెన్నై : తమిళనాడు రాజధాని చెన్నైలో నిషేధిత సంస్థకు సంబంధించిన పలు ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోదాలు చేపట్టింది. హిజ్బ్-ఉత్-తహ్రీర్ (హెచ్‌యూటీ) అనే నిషేధిత సంస్థపై దర్యాప్తులో భాగంగా చెన్నై, తిరుచ్చి, పుదుకొట్టై, తంజావూరు, ఈరోడ్, తిరుప్పూర్‌తో సహా పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. హెచ్‌యూటీతో సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించడానికి.. సాక్ష్యాలను సేకరించడానికి రాష్ట్ర పోలీసులతో పాటు ఎన్ఐఏ ఏకకాలంలో దాడులు నిర్వహిస్తోంది. తదుపరి విచారణ కొనసాగుతోంది. హెచ్‌యూటీ సభ్యులపై సుమోటోగా కేసు నమోదైంది.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 01-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 182 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు వెల : 6.50



స్మార్ట్ సిటీ మిషన్ గడువు పొడిగింపు

సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో స్పందించిన కేంద్రం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్మార్ట్ సిటీ మిషన్‌ను 2025 మార్చి వరకు పొడిగించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితిని వచ్చే ఏడాది జూన్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా కేంద్ర ప్రభుత్వ ం నిర్ణయించిన గడువు ప్రకారం స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితి ఈ నెలాఖరుతో ముగియనుంది. వరంగల్, కరీంనగర్ నగరాల్లో స్మార్ట్ మిషన్ పనులు చేపట్టారు. వరంగల్‌లో ఇప్పటివరకు 45 పనులు పూర్తయ్యాయి. రూ. 518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతు న్నాయి. కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయి. రూ. 287 కోట్లతో చేపట్టిన 22 పనులు కొనసాగుతు న్నాయి. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. పనులు పూర్తికానందున ప్రజల ప్రయోజనార్థం మేరకు పథకం గడువును పొడిగించాలని కోరారు. దీంతో ఆ పథకాన్ని 2025 మార్చి 31 వరకు పొడిగిస్తూ శనివారం రాష్ట్రాలకు లేఖ రాసింది. ఇప్పటికే నిధులు కేటాయించి ఆమోదించిన పనులను కొనసాగించాల నీ, కొత్త పనుల మంజూరు ఉండవని స్పష్టం చేసింది. జరుగుతున్న పనులకు సంబంధించిన నిధులను ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఫస్ట్ కమ్ ఫస్ట్ పద్ధతిన విడుదల చేయనున్నది. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించింది.

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణకు కాంగ్రెస్ కుట్ర

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్‌రంగాన్ని ప్రయివేటీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మీడియాకు ...15లో

సీఎం ఇంటికి కేంద్రమంత్రి పీయూష్‌గోయల్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ వెళ్లారు. బంజారాహిల్స్‌లోని సీఎం ఇంటికి మర్యాదపూర్వకంగానే వెళ్లినట్టు సమాచారం. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడు వ్యక్తిగతంగా కేంద్రమంత్రిని ఇంటికి రావాలని ...15లో



విస్తారంగా వర్షాలు

715 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు

- వచ్చే వారం రోజులు వానలే
- ఎల్లో హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ
- రిజర్వాయర్లలోకి ఇంకా చేరని నీరు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో వచ్చే వారం రోజులపాటు విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 715 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా తాండూర్‌లో అత్యధికంగా 5.28 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జులై 7వ తేదీ వరకు రాష్ట్రంలో ఇదే తరహాలో వర్షాలు పడనున్నాయి. ఉత్తర ఒడిశా-గ్యాంగ్‌టక్ పశ్చిమ బెంగాల తీరాలకు ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతంపై ఏర్పడిన ఆవర్తనం తాజాగా తూర్పు జార్ఖండ్ ఆ పరిసరాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. దీనివల్ల తెలంగాణలో కింది స్థాయి గాలులు పశ్చిమ, నైరుతి దిశల నుంచి వీస్తాయని అంచనా వేసింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయనీ, దీనివల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొన్ని చోట్ల, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసినట్టు వాతావరణ శాఖ వివరించింది. రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఎల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నట్టు తెలిపారు. అయితే హైదరాబాద్, ఆ పరిసర ప్రాంతాల్లోనూ తేలికపాటి నుంచి ఒకమోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఒక మోస్తరు వర్షాలు కురిస్తే వ్యయసాయానికి అనుకూలంగా ఉంటాయనీ, భారీ వర్షాలైతే నష్టం తప్పదని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కొమరంభీం, మంచిర్యాల, కామారెడ్డి జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. అదే సమయంలో కరీంనగర్, సంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, వికారాబాద్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. నారాయణ్‌పేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, నల్గొండ జిల్లాల్లో అధిక వర్షాలు కురిసినట్టు వ్యవసాయశాఖ తెలిపింది. మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా వార్షిక సగటు వర్షపాతం 919.0 మిల్లీమీటర్లు కాగా, నైరుతీ రుతుపవనాల వల్ల ఇప్పటి వరకు 720.4 మి.మీ., వర్షపాతం ...15లో



రాష్ట్రంలో భారీ వర్షాలు..

రాజధానిలో..

హైదరాబాద్‌కు తాగునీటిని అందించే రిజర్వాయర్లలో కూడా పూర్తిస్థాయి సామర్థ్యంతో నీరు లేదు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, సింగూర్, మంజీరా, అక్కంపల్లి, నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 39.783 టీఎమ్‌సీలు కాగా, ప్రస్తుతం ఈ మొత్తం రిజర్వాయర్లలో 19.025 టీఎమ్‌సీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ఈ రిజర్వాయర్లలో 23.392 టిఎమ్‌సీల నీరు ఉన్నట్టు హైదరాబాద్ వాటర్‌బోర్డ్ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించింది. యాక్షన్ ప్లాన్ రూపొందించింది. సహాయక బృందాలను అప్రమత్తం చేసింది. ఎక్కడైనా వాగులు, వంకలు పొంగితే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించింది.

7లో.. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా టీచర్ల బదిలీలు
గత తప్పిదాలకు తావులేకుండా చర్యలు | బదిలీల్లో వెబ్ ఆప్షన్ల కేటాయింపు



నివాళులర్పిస్తున్న సీఎం, ఇతర కాంగ్రెస్ నేతలు

డీఎస్‌కు అశ్రు నివాళి

జనసంద్రంగా మారిన మాజీ మంత్రి అంతిమయాత్ర

నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి 15లో..

ఇసుక వాన

నజీబ్ కావచ్చు నారాయణ కావచ్చు
ఆకలి వేటగాడి బాణం ములుకులు
తప్పించుకోవడానికి
పచ్చని తరువుల గొడుగులు
చల్లని నదీ ప్రవాహాలు కన్ను తెరిచిన ఊరు
కన్నతల్లికి దూరంగా సాగే వలస పాటలు
దుఃఖ గీతాల పల్లవులు
ఎటు చూసినా ఇసుక అలల సముద్రం
ఇరవైనాలుగు గంటలు వెట్టిచాకిరీ చేసినా
గుక్కెడు నీళ్లు, రొట్టెముక్క విదిలించని
ఇనపగుండెల షేక్‌లు
మనసు బరువు దించుకోవడానికి
ఒంటరితనం ముళ్ళకంపల్ని పెరికి వేయడానికి



మరో మనిషి తోడు లేని
ఎడారిలో జ్ఞాపకాలే ఊపిరి
పగలూ రాత్రీ వారాలూ నెలలూ ఏళ్ళూ
కాల గమనం ఆగిపోయి
చుట్టూ మూగిన గొర్రెల మందలో
తానూ ఒక జంతువైన విషాద వాస్తవం
మాటా పలుకూ మరచి
పెరిగిన వెంట్రుకలే వస్త్రాలై
ఆది మానవుడిగా తిరోగమించిన వేళ
ఆకలి ఒక నరకం వలస ఒక నరకం
భాష కాని భాష దేశం కాని దేశంలో
ఎటు చూసినా ఇసుక మేరువులు
కళ్ళు మూసినా కళ్ళు తెరచినా ఇసుక తుఫాన్లు
చిన్నప్పుడు ఆటల్లో
ఇసుక పడి మంటలు పుట్టిన కళ్ళు
పెద్దయ్యాక ఆకలి బతుకుల్లో
ఆగక కురుస్తున్న ఇసుక వాన

- మందరపు హైమవతి,
9441062732

ఊహలకు రెక్కలు తొడిగి



- పుప్పాల కృష్ణమూర్తి
99123 59345


నేడు తెలుగునాట బాలలు రచనలపంటలు పండిస్తున్నారు. గత పదేళ్ళ నుంచి నేటి వరకూ, పాఠశాల విద్యార్థులు రాసిన (142) సంకలనాలు వెలుగు చూశాయి. ఇందులో ఎక్కువగా కథా సంకలనాలు తెలంగాణ రాష్ట్రం నుండే వెలువడటం మన రాష్ట్రానికి గర్వకారణం. దీనికి కారణం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు చిన్ననాటినుండే పిల్లలకు అవగాహన ఏర్పడాలనే ఆలోచనతో కొత్త పాఠ్యాంశాలను రూపకల్పన చేయడం.

ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు గల తెలుగు పాఠ్యపుస్తకాలలో పాఠం చివర సృజనాత్మకత, ప్రశంస ఉండేలా ఏర్పాటు చేశారు. ఇందులో కథ, కవిత, సంభాషణ, లేఖారచనా, కరపత్రం, ఇంటర్వ్యూ, విశ్లేషణ మొదలగు సాహితీ ప్రక్రియలపై ప్రశ్నలు ఉంటాయి. పరీక్షల్లో వాటికి మార్కులు ఉంటాయి. కాబట్టి విద్యార్థులు తప్పకుండా వీటిని చదవడం, రాయడం చేస్తున్నారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయించే కార్యక్రమంలో భాగంగానే, తెలుగును బోధించే ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మక రచనల్లో తర్ఫీదునిస్తున్నారు. మన తెలుగు వాచకాలు రూపొందించిన రచయితలు కొత్తగా ఈ అంశాన్ని చేర్చారు. ఇది పిల్లల ఆలోచనలకు రెక్కలు తొడిగి, సృజనకారులుగా తయారవడానికి ఎంతో దోహదం చేస్తోంది. నిబద్ధత, రచనా రంగంలో ప్రవేశమున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పిల్లలను ఎక్కువగా ప్రోత్సహిస్తూ, వారినుండి మరిన్ని రచనలు రావడానికి రాచబాటలు వేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులకు, రోజూ పిల్లలు రాసే రచనలను చూడడం ఒక దినచర్యగా, బోధనలో భాగంగా మారిపోయింది.

నేటి పిల్లలు స్వతహాగానే తెలివైన వారు. క్రియేటివిటీ అంశంగా, వారి మెదళ్లకు పని పెట్టడంతో లెక్కకు మిక్కిలి కథలు, కవితలు, వ్యాసాలు, లేఖా రచనలు మొదలగునవి రాస్తున్నారు. స్వరాష్ట్రం ఏర్పాడ్డాక వారిలోని సృజనాత్మక రచనలను మొదటిగా పుస్తకరూపంలో తెచ్చిన ఉపాధ్యాయులు గరిపల్లి అశోక్ గారిని ప్రశంసించాలి. 2014 లో తాను పనిచేసే ముస్తాబాద్ పాఠశాల పిల్లలతో 'జాంపండ్లు' కథా సంకలనాన్ని తీసుకొచ్చారు. ఇందులో 34 మంది పిల్లలు రాసిన కథలున్నాయి. అది మొదలు తెలంగాణ రాష్ట్రంలోని (33) జిల్లాల్లో, వివిధ పాఠశాలల్లోని విద్యార్థులు సృజనాత్మక రచనలతో సంకలనాలను వెలువరించారు. ఇందుకు ఆర్థికంగా అదే పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు, కొన్నిచోట్ల సాహిత్యంపై ప్రేమ ఉన్న దాతలు సహకరించారు. అప్పటి నుండి ఈ ఏడాదిలో షాద్‌నగర్ పిల్లలు రాసిన 'రంగుల ప్రపంచం' వరకూ ఈ కథా సంకలనాల పరంపర కొనసాగుతోంది. ఇది సామాన్య విషయం కాదు. సుమారు నాలుగు వేల మంది పిల్లలు సృజనాత్మక రచనల్లో ఉన్నారు. నూతనంగా ఆలోచించి రాయడం ఒక్క మార్కుల ప్రయోజనం కోసమే కాదు. వారు కథ రాసినా, కవిత రాసినా అన్యాయాన్ని ఎదిరిస్తూ, న్యాయం వైపు నిలబడి గెలిచేలా చేస్తారు. ఆ మేరకు విద్యార్థుల్లో భాషపట్ల మమకారం, విస్తృత పద పరిచయం, పెద్దల పట్ల గౌరవం, పిన్నల పట్ల ప్రేమ, ప్రకృతి పట్ల మమకారం, తార్కిక శక్తి, సమస్యలను ఎదుర్కునే నేర్పు, ప్రజల పట్ల అనుబంధం, జాతీయనాయకుల పట్ల ఆరాధన, దేశభక్తి, నైతిక విలువలు... మొదలగు సద్ లక్షణాలు వారిలో రూపుదిద్దుకుంటాయి. ఇందుకు ఎక్కువగా పాఠశాలల్లో పనిచేసే తెలుగు భాషోపాధ్యాయులను అభినందించాలి. వీరే కాక బాల సాహిత్య రచయితలు చొక్కాపు వెంకటరమణ, పత్తిపాక మోహన్, పుప్పాల కృష్ణమూర్తి, డాక్టర్ సిరి, పైడిమర్రి రామకృష్ణ వంటి ఉపాధ్యాయులు కాని వారు కూడా విద్యార్థులకు కథా రచనలో శిక్షణనిచ్చి బాలల రచనలతో సంకలనాలు వచ్చేలా కృషి చేస్తున్నారు. కానీ వీరి ద్వారా వచ్చేవి పరిమిత సంఖ్యలోనే. నిత్యం విద్యార్థులతో ఉపాధ్యాయులకు పాఠశాల అనుబంధం ఉంటుంది కనుక, ఎక్కువగా ఉపాధ్యాయులు పూనుకొని, తమ సంపాదక బాధ్యతలతో వెలువరించినవే ఎక్కువ.

అదే క్రమంలో ముక్కామల జానకిరామ్ అనే తెలుగు ఉపాధ్యాయుని గురించి కూడా చెప్పుకోవాలి. తను స్వయంగా కవి. ఉగాది, తెలుగు భాషా దినోత్సవం, వివిధ కవిసమ్మేళనాల్లో కవితలు రాసి సీనియర్ కవుల అభినందనలు అందుకున్నాడు. గేయ రచయితగా తాను పల్లెపై రాసిన కొన్ని పాటలకు బాణీలు కట్టించి, సంగీత దర్శకునితో కంపోజ్ చేయించి 'యూ' ట్యూబులో పెట్టాడు. ఈ పాటలకు చాలా ప్రశంసలు వచ్చాయి. కథారచయితగా తెలుగునాట బాల సాహిత్యం రాసే వారందరికీ వీరి పేరు పరిచయమే. పలు తెలుగు దినపత్రికల్లో వీరి అనేక కథలు ప్రచురింపబడ్డాయి. పిల్లలు ఆన్‌లైన్ మోజులో పడి, పుస్తకాలను దూరం చేసుకుంటున్నారనే ఆవేదనతో ఇటీవలే 'ఆఫ్ లైన్' పిల్లల కథల పుస్తకాన్ని (22), రంగుల్లో తీసుకు వచ్చారు. ఈ పుస్తకం మీద జాతీయ దినపత్రికల్లో చక్కటి సమీక్షలు వచ్చాయి.

> **నూతనంగా ఆలోచించి రాయడం ఒక్క మార్కుల ప్రయోజనం కోసమే కాదు. వారు కథ రాసినా, కవిత రాసినా అన్యాయాన్ని ఎదిరిస్తూ, న్యాయం వైపు నిలబడి గెలిచేలా చేస్తారు. ఆ మేరకు విద్యార్థుల్లో భాషపట్ల మమకారం, విస్తృత పద పరిచయం, పెద్దల పట్ల గౌరవం, పిన్నల పట్ల ప్రేమ, ప్రకృతి పట్ల మమకారం, తార్కిక శక్తి, సమస్యలను ఎదుర్కునే నేర్పు, ప్రజల పట్ల అనుబంధం, జాతీయనాయకుల పట్ల ఆరాధన, దేశభక్తి, నైతిక విలువలు... మొదలగు సద్ లక్షణాలు వారిలో రూపుదిద్దుకుంటాయి.**



ఈ ఉపాధ్యాయుడు రెండేళ్ల క్రితం సూర్యాపేటలోని మేళ్లచెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చాడు. తాను వచ్చింది మొదలు విద్యార్థుల మీద ప్రత్యేక దృష్టి పెట్టాడు. వారిలోని సృజనాత్మకతను కనిపెట్టి ప్రత్యేక తరగతులు తీసుకొని, కథారచనలో శిక్షణ ఇచ్చాడు. వారిలో యాభై మందికి పైగా విద్యార్థులు వివిధ అంశాల మీద కథలు రాసి, గురువు చేతిలో పెట్టారు. వాటిని జల్లెడ పట్టి (33) కథలతో 'ఊహలకు రెక్కలొస్తే' పేరుతో కథా సంకలనం తీసుకొచ్చాడు. ప్రధానోపాధ్యాయులు నారపరెడ్డి, వారి మిత్ర బృందం ఆర్థిక తోడ్పాటును అందించగా, అందంగా పుస్తకం ముస్తాబై అదే పాఠశాలలో ఆవిష్కరణ జరిగి విద్యార్థుల చేతుల్లోకి వచ్చింది. తమ రచనలను అచ్చులో చూసుకున్న విద్యార్థుల సంతోషం వర్ణించలేనిది. సభకు హాజరైన తల్లిదండ్రుల ముఖాల్లోని సంతృప్తి కొలవలేం. అత్యాశ పనికి రాదని సమీర్ అనే 10వ తరగతి విద్యార్థి జంతువుల కథతో 'గుణపాఠం' కథ రాస్తే, విద్యార్థుల పాత్రలతో చదువును అశ్రద్ధ చేయకూడదని నాగేశ్వరి అనే 7వ తరగతి విద్యార్థిని 'చదువు విలువ' రాసింది. కొందరు పర్యావరణం మీద, మరికొందరు జంతువుల పట్ల ప్రేమ కలిగి ఉండాలని, మరో విద్యార్థి 'జంక్ ఫుడ్' తినకూడదని, మరో విద్యార్థిని 'సమయం విలువ' పాటించాలని...

ఇలా విద్యార్థులు అలవరచుకోవాల్సిన, ఆచరించాల్సిన మంచి లక్షణాలను కథల్లో ఇమిడ్చి ఎంతో చక్కగా రాశారు. పుస్తక ఆవిష్కరణకు హాజరైన రిటైర్డ్ కె.ఆర్.ఆర్. కళాశాల తెలుగు ఉపన్యాసకులు భరతారావు, ప్రజా వైద్యులు సుబ్బారావు... 'వీరిలో నాకు గొప్ప భావి రచయితలు కనిపిస్తున్నారని' ప్రశంసించి, చందమామ కథల పుస్తకాలు (4) వాల్యుములు పాఠశాలకు అందజేశారు.

ఇటీవలే కెనడాలో నివసించే తెలుగు సాహిత్య ప్రేమికులు ఏర్పాటు చేసిన 'గడుగ్గాయి' అంతర్జాతీయ ఆన్ లైన్ పిల్లల మాస పత్రిక వారు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కథల పోటీ నిర్వహించగా, ఈ పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులు కథలు రాసి పోటీకి పంపారు. మాడుగుల మహా లక్ష్మి అనే 8వ తరగతి విద్యార్థిని రాసిన 'ఆకుపచ్చని ఆలోచన' కథకు ప్రథమ బహుమతి లభించింది. 1500/- రూపాయలు ప్రైజ్ మనీ పంపారు. మిగతా నలుగురు శృతి, మేఘన 8వ తరగతి, స్రవంతి, గణేశ్ అనే 10 వ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు లభించాయి.

పిల్లల హృదయం మెత్తని పట్టుదూది లాంటిది. సృజనాత్మకత అనే నిప్పురవ్వను అంటిస్తే, కథై, కవితై వెలుగుతారు. ఆ వెలుగులో సమాజంలోని చీకట్లను తొలగించడానికి ప్రయత్నిస్తారు. వారి సాహిత్య ప్రయాణం

మేడి పండు



నా చూపులతోనే అందరూ
నాగరికతను అధ్యయనం చేయాలి
నా రహస్య ఎజెండానే
వాచకం కింద చెదలులా
జ్ఞానమందిరాల్లో విస్తరించాలి...
హేతువును చంపి
కాలం చెల్లిన పురాతన తత్వాన్ని
తరగతిగది సాక్షిగా బతికించాలి..
అసమసమాజ విషనీతిని
భావిభారత పౌరుల నరాల్లోకి దట్టించాలి
ప్రసిద్ధ సత్యాలను ప్రణాళికాబద్ధంగా చెరిపి వేసి
అస్మదీయుల ఘనతంత్రాలు వల్లించిన
కుటిల పుటలను చరిత్రకు అతికించాలి..
అమేయ మానవ మేధను
ఉక్కుపాదంతో తొక్కిపెట్టి,
అలౌకిక శక్తుల పాదాలకు మోకరిల్లే
సిద్ధాంతాలను ప్రబోధించాలి..
కుంకుమరంగులో మెరిసే నా మెదడును
రేపటి తరం బుర్రలో ప్రతిష్ఠించాలి..
నా ఆలోచనలకు కాసిన
మేడిపండును దేశభావి నిర్ణేతలకు
మెరుగైన ఆహారంగా పంచిపెట్టాలి ..
ఏ నోరూ నన్ను ప్రశ్నించకూడదు
ఏ పెన్నూ రాజ్య ధిక్కరాన్ని లిఖించకూడదు
పాత గడ్డి మేసి పరమ విధేయంగా
ఏలిన వారికి దండం పెట్టే
నవ యువ గంగిరెద్దులను
తక్షణం తయారు చేయటమే నా విధానం

- కోయి కోటేశ్వర రావు, 9440480274

అంటరాని మనిషి



దరి దొరికేది ఎక్కడో
తీరం చేరేది ఎప్పుడో
జీవితం చిత్ర విచిత్రంగా
సర్కస్ తీగ మీద ఆడుతున్నది
వెతుకుతున్న దారం కొస
ఇంకెవడో లాగుతున్నట్టు
బ్రతుకు చిక్కుబడుతున్నది
పైసకు ముఖం వాచినట్టు
కూలి పనికి ఎగబాకుతున్న కొద్దీ
ఎన్నుబొక్కకు డొక్క అంటుకుపోతున్నది
ఎంత ఒళ్ళొంచినా
జేబు నిండా మనసు మెచ్చని ఖాళీ
ఆపద ఏదో గుండెల మీద
దాడి చేసినప్పుడు ఊరుచెట్టు ఎంత ఊపినా
రూపాయి రాలదు
సాయం కొరకు ఏ గడప తొక్కినా
ఇంటి ముందున్న మనీ ప్లాంటు
బిచ్చగాడిని తరిమినట్టు తరిమే
విదేశీ కుక్కపిల్ల
డబ్బును ప్రేమించే లోకంలో
మనిషే అంటరానోడు
కాసుల చుట్టూ తిరిగే ప్రపంచంలో
పేద బక్కోడు దిక్కులేనోడు.

- గజ్జెల రామకృష్ణ,
8977412795

అత్తరుపూల రాగం

తొలకరిలో.. మట్టి ఊరంతా అత్తరు పూల
రాగమాలపించినట్టు సాయిబు తాత.
నా తోపుడు బండి మీద
జాజిపూల అత్తరు గులాబీ అత్తరు
మొగలిపూల అత్తరు సంపంగిపూల అత్తరు
లిల్లీ పూల అత్తరు షాజహానా అత్తరు
ఫిరదౌస్ అత్తరు శాండిల్ అత్తరు
నిజాం అత్తరులను
వీధి అంతా పరిచయం చేస్తూ
బతుకుదెరువు రాగమయ్యేవాడు.
సాయిబు తాత వస్తుంటే
ఊరంతా పండుగ సందడేదో
సీతాకోకల్లా పలకరించిపోయేది.
చిన్నప్పుడు మేమంతా పెళ్లిళ్లకు వెళ్లేప్పుడు
అమ్మ మా బట్టలకు అత్తరు పూసేది.
అప్పుడు మా చుట్టూ గులాబీ గులాబీ తోటలు
మత్తుగా పాటలు పాడేవి.
తాత కనిపించడం లేదు.
అచ్చూ ఎండాకాలంలో
ఆవిరైన ఏటి వాగులానే అత్తరు దుఃఖం
అత్తరు పాట లేదు.
మాయమైన మానవ సంబంధాల
అలాయి బలాయి
సీతాకోక పలకరింపులు లేవు.
విరగబూసిన బతుకు తోటలు లేవు.
ఊరూరికీ షాపింగ్ మాల్స్ అవతరించాక
ప్రేమానురాగాల అత్తరు పాటలు లేవు.



గంట కొట్టే పీచు మిఠాయి తాత
పలకరింపులు లేవు.
గాజుల తాత గలగల మాటల
అనుబంధం లేదు.
అత్తరు పాటలు లేవు.
సాయిబు తాత
జ్ఞాపకాలు పరిమళిస్తూనే ఉన్నాయి.

- రేపాక రఘునందన్,
9440848924

సాహితీ వార్తలు

జూలై 7న 'సముద్ర నానీలు' ఆవిష్కరణ

'సముద్ర నానీలు' ఆవిష్కరణ జులై 7వ తేదీ ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధినేత మద్దాళి రఘురాం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సుప్రసిద్ధ కవి డా. ఎన్. గోపి ఆవిష్కరిస్తారు. ఆచార్య సూర్యా ధనంజయ, డా. పోరెడ్డి రంగయ్య, కుడికాల వంశీధర్, సుంకరి కృష్ణ ప్రసాద్, చిత్తలూరి సత్యనారాయణ పాల్గొంటారు.

ఒక దుఃఖ దిమ్మరి ట్రావెలాగ్




- ప్రసేన్, 98489 97241

తెలుగులో ప్రస్తుతం సాహిత్య విమర్శ లేదు అంటున్నాం. కవులను లేదా రచయితలను సంతోష పెట్టే విమర్శకుల తాకిడి ఎక్కువయిందనీ అంటున్నాం. పుస్తక సమీక్షలు మాత్రమే సాహిత్య విమర్శగా చెలామణి అవుతున్నాయనీ అంటున్నాం. అలా ఎందుకనాల్సి వస్తోంది. ఎన్ని పేర్లు పెట్టినా చివరకు నిజంగానే ప్రశంస, లేదూ పరామర్శ మాత్రమే విమర్శగా మిగిలి పోవడమేనా కారణం. మౌలిక సిద్ధాంతాలు లేని అప్లయిడ్ క్రిటిసిజమేనా కారణం. అవునేమో! సహృదయత, నిష్పాక్షికత లేకపోవడం కూడా కావచ్చేమో! అసలైన విమర్శను స్వీకరించే స్థితిలో సృజనకారులు లేకపోవడం కూడా ఈ చెడు పరిణామాలకు కారణం కావచ్చు కామోసు!

జాబితా చేస్తూపోతే విమర్శ చాలారకాలు. అప్పట్లో వ్యాఖ్యానమే విమర్శ. ఆ తరవాతి విమర్శలో సామాజిక, సాహిత్య, భాషా, ఛందో, అలంకారిక, రస చర్చ సంబంధిత విషయాలు కలగలిసిపోయి ఉండేవి. సాంప్రదాయ విమర్శ, నైతిక విమర్శ, తాత్విక విమర్శ ఇంకా చాలా ఉండేవి. ఉన్నాయి. అయితే ఏ భాషా సాహిత్యంలోనైనా పరామర్శ, సమీక్ష, ప్రశంస, ఖండన మాత్రమే మౌలికంగా ట్రెండింగ్‌లో ఉండేవి, ఉన్నాయి. నిజం చెప్పాలంటే విమర్శకులు ఎక్కడనుంచో పుట్టుకురారు. ప్రతి సృజనకారుడిలోనూ ఒక విమర్శకుడుంటాడు. ప్రతి పాఠకుడిలోనూ విమర్శకుడుంటాడు. ఒక రచన చదివాక పాఠకుడేమనుకుంటాడో అదే ఆ రచన అసలు సిసలు జీవం. దాన్నే పాఠక ప్రతిక్రియ అంటున్నాం. రీడర్స్ రెస్పాన్స్ థియరీ అంటున్నాం. ఇప్పుడిదంతా ఎందుకూ అంటే... మీరు అడుగుబెట్టబోతున్న ఫణి మాధవి కన్నోజు విమర్శా వ్యాసాలను ఏ గాటన కట్టేయాలి అన్న సమస్యకు పరిష్కారం వెదకడం కోసం.

ఫణి మాధవి పరిచయం ప్రత్యేకంగా అవసరం లేదు. కవయిత్రి. విమర్శకురాలు. ఒకటీ అరా కథలు కూడా రాసారు. వివిధ రకాల విమర్శలలో ఫణి మాధవి చేస్తున్న విమర్శ ఏ రకం? ఫణి మాధవి విమర్శను ఏ పనిముట్లతో అర్థం చేసుకోవాలి. స్త్రీల సమస్యలు, స్త్రీల వేదన, స్త్రీల చుట్టూ అలుముకున్న చీకటి గురించిన కవిత్వ విశ్లేషణ ఈ సంపుటిలో ఉంది. కేవలం తెలుగు కవిత్వాన్నే కాక దేశ విదేశ కవులను ఆమె తన పరిధిలోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఆమె తన విశ్లేషణలో కవిత్వ రూపం గురించి ఎక్కడా చర్చించలేదు. సాహిత్య కళ గురించిన చర్చ కూడా చేయలేదు. కేవలం ఆయా కవులు ఎంచుకున్న సారం గురించి మాత్రమే చర్చించారు.

కవిత్వాన్ని గురించి మాత్రమే మాట్లాడుతున్నాం అనే ప్రిమైజ్ రూఢీ అయినపుడు ఇక కవిత్వ విశ్లేషణ అవసరమా, అది కవిత్వం ఎందుకయింది, ఎలా అయింది, కవిత్వం చేయడంలో కవి ఏయే మెళకువలు పాటించాడనే విశ్లేషణ దేనికి అనే నిర్ధారణలోకి వస్తే కవిత్వ సారాన్ని గురించి మాత్రమే మాట్లాడాల్సి ఉంటుంది. విప్లవ సాహిత్య సమర్థకులు ఇలాంటి విమర్శే చేశారు. కవితా రూపం, రూప ప్రయోగం వంటి అంశాలను పట్టించుకోలేదు. స్త్రీ వాద సాహిత్యం ఉధృతంగా వస్తున్న సమయంలో వచ్చిన సానుకూల విమర్శ కూడా కేవలం సారం గురించే చర్చించింది తప్ప కవితా రూపం గురించి చర్చించలేదు. చాలా మంది స్త్రీ వాద విమర్శకులు ఇప్పటికీ ఇదే తరహా విశ్లేషణను సాహిత్య విమర్శగా కొనసాగిస్తున్నారు. ఇదొక నిర్ధారిత పద్ధతి. అందుకే ప్రిమైజ్ అన్నది. ఈ సంపుటిలో ఫణిమాధవి కూడా అదే పద్ధతిని పాటించారు. ఆమెకు సారమే ముఖ్యం. అందుకే కావచ్చు 'మేఘాల నీలాల్లోకి' అని ఈ సంపుటికి శీర్షికనిచ్చారు. స్త్రీవాద కవిత్వానికి పెదబాలశిక్షగా చెప్పుకోదగ్గ 'నీలి మేఘాలు' సారాన్ని లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేయడం, లేదా తదనంతర కవిత్వాన్ని లోకానికి విపులీకరించడం అనే అర్థంతో ఆమె ఈ శీర్షికనిచ్చి ఉంటారు. అదే నిజం అని వ్యాసాలు చదివాక కచ్చితంగా తెలిసొస్తుంది.



ఈ సంపుటిలో మలయాళ, బెంగాలీ, కన్నడ, హిందీ, ఇరానీ, ఆంగ్ల, తెలుగు కవిత్వ సారాంశ వివరణ ఉంది. ఆయా కవుల కవితలు ఏ సారం గురించి, ఏ వేదన గురించి చర్చించారో చర్చించాయో ఉంది. ఇదొక ప్రయోగం. ఇదొక కొత్త చూపు. అందుకే గాయం సలుపుతున్నా కన్ను విప్పార్చి చూస్తున్న ముఖం ముఖచిత్రంతో విషయమంతా చెప్పేసారు ఫణి మాధవి.

> **మంచి విమర్శ వచ్చినపుడే మంచి సాహిత్యం వస్తుందన్న మాట నిజమే అయితే మంచి స్త్రీ వాద సాహిత్యం రావడానికి ఫణి మాధవి వ్యాసాలు పునాదులయి తీరతాయి. ఈ వ్యాసాలు చదవడమంటే దు:ఖదిమ్మరిగా పర్యటించి పకపకా ఏడ్వడం. ఎక్కిళ్లొచ్చేట్టు నవ్వడం. ఈ వ్యాసాలలో గుండెడు కన్నీళ్లున్నాయి. బండెడు గాయాలున్నాయి. ఇదొక అశ్రు సంచారి యాత్రా కథనం.**

చలం చెప్పిన ఆమెకు వ్యాయామం, జ్ఞానం అనుభవం కావాలన్న దశ నుంచి ఫణి మాధవి మరింత ముందుకు వెళ్లి ఆమెకు ఆలోచన ఇవ్వాలనే సారాంశాన్ని తన వ్యాసాలలో ప్రతిపాదించారు. అనసూయా సేన్ కవిత్వం సాయంతో మౌనం ఎలా బలమో ఎలా ఆయుధమో ఎలా నిరసనో చెప్పారు. అదే సందర్భంలో కారా డెల్విన్ సాయంతో డిప్రెషన్‌లో కుంగిపోయిన వారు ఎలా, ఎవరికి, ఏం చెప్పుకోవాలో ఆ వేదనను ప్రపంచం ఎలా వినాలో చెప్పారు. నో అని చెప్పడం చాలా సందర్భాలలో ఎంత అత్యవసరమో నయిరా వహీద్ కవిత్వం సాయంతో చెప్పారు. మౌనం, చెప్పడం, వినడం మధ్య ఎప్పుడు ఎటు మొగ్గు చూపాలో అనే సంకేతాన్ని తన ముఖచిత్రంలో పెదాల స్థానంలో బహుశా త్రాసును ఉంచి ఇచ్చారేమో ఫణి మాధవి.

హిందీలో రజనీ తిలక్ దళిత పాదముద్రనూ, బెంగాలీ ఫెమినిస్టు కళ్యాణ్ ఠాకూర్ దళితత్వాన్నీ, తెలుగులో భైరి ఇందిర ధిక్కారాన్నీ, అలీసా కమ్మింగ్స్ కవిత్వం ఎలా ఓ చికిత్స అయిందో, మరాఠీ గీతాంజలి తన కవిత్వంతో మానసిక సాంత్వన ఎలా పొందిందో మన మనసుకు కట్టారు ఫణి మాధవి.

మూత్రశాలల లేమి వెనుక ఉన్న నరకం, ఒలీవియా మెంటల్ హెల్త్ అవగాహన గురించి, మెన్స్యుట్రువల్ హైజీన్ ఆవశ్యకత గురించిన సారాన్ని ఎంచుకున్న కవులను తన జాబితాలోకి ఎక్కించుకుని ఫణి మాధవి ఈ సంపుటికి ఒక పరిపూర్ణతనిచ్చారు. హిజాబ్ మాటున కుట్ర చేసే లౌకిక తత్వం గురించి మాట్లాడిన జైనాబ్ రషీద్ ధైర్యం గురించి, కొండ మీది చింత చెట్టు మైదానంలోకి నడిచిరాదన్న వాస్తవాన్ని అర్థం చేసుకోలేని ఆధునిక ఆదానీల అణచివేతకు బలయే గిరిజన జీవన విధానాన్ని వివరించే కళ్యాణి కుంజ, పద్దం అనసూయ మనను ఈ వ్యాసాల్లో పలకరిస్తారు. ఆమెలే కాక ట్రాన్స్ జెండర్ శిలోక్ ముక్కటి జెండర్ కవిత్వ ప్రయాణాన్ని, ఇరాన్ మహిళలు ఫరూహ్ ఫారోక్జాద్, తాహెరా, బెహ్మనీ, గ్రానాహ్ మౌసమీల ప్రయాణాలను, పోర్శియా దేవి ఆత్మాభిమానపు మోనోలాగ్‌ను కూడా మనకో ట్రాజిక్ ట్రావెలాగ్‌లా వినిపిస్తారు ఫణి మాధవి.

కవి కంటే విమర్శకుడు ఎక్కువ అధ్యయనశీలి అయి ఉండాలన్నది వాస్తవం. కవి సగం చెపితే మిగతా సగం పాఠకుడే అర్థం చేసుకుంటాడు కదా. ఆ ఖాళీని పూరించే పనిని విమర్శలో ఫణి మాధవి చేసారు. ఆమె విమర్శలో లిబరల్ స్పిరిట్ కీలకం. తన లోపలి కవయిత్రి తనను వెన్నాడుతున్నా కూడా కేవలం విమర్శ మీదనే దృష్టి నిలపడం ఆ లిబరల్ స్పిరిట్ వల్లనే సాధ్యమైంది. ఇక్కడ ఆమె సామభేదం తూకం తప్పకుండా పాటించారు.

మంచి విమర్శ వచ్చినపుడే మంచి సాహిత్యం వస్తుందన్న మాట నిజమే అయితే మంచి స్త్రీ వాద సాహిత్యం రావడానికి ఫణి మాధవి వ్యాసాలు పునాదులయి తీరతాయి.

దు:ఖం ఒక స్వచ్ఛత. దు:ఖం ఒక బలం. దు:ఖం ఒక పొలికేక. దు:ఖం ఒక పశ్చాత్తాపం. దు:ఖం ఒక సంభాషణ. దు:ఖం ఒక ఆనందభాష్పం. దు:ఖం ఒక అవ్యాజ్య ప్రేమ.

ఈ వ్యాసాలు చదవడమంటే దు:ఖదిమ్మరిగా పర్యటించి పకపకా ఏడ్వడం. ఎక్కిళ్లొచ్చేట్టు నవ్వడం. ఈ వ్యాసాలలో గుండెడు కన్నీళ్లున్నాయి. బండెడు గాయాలున్నాయి. ఇదొక అశ్రు సంచారి యాత్రా కథనం. ఆ సంచారి విశ్వ మానవి కావచ్చు. పాఠకుడే కావచ్చు. ఫణిమాధవీ కావచ్చు. రేపటి నవ్వుల కోసం ఇవాళ కన్నీళ్లలో మునగడం కూడా బానే ఉంటుంది. మేఘాల నీలాల్లో తడిసిపొండి.

చవాన్ ఆస్పత్రిలో

హైపెక్ శస్త్ర చికిత్సలు విజయవంతం



- చవాన్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ హైపెక్ డాక్టర్ ఉదయ్ చవాన్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం సాయి నగర్ కాలనీ, ఆర్‌సీఐ రోడ్డులో ఉన్న చవాన్ ఆస్పత్రిలో హైపెక్ శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు చవాన్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, హైపెక్ డాక్టర్ ఉదయ్ చవాన్ తెలిపారు. నేడు డాక్టర్స్ డే సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. దేశంలోనే హైపెక్ శస్త్ర చికిత్సల ఖర్చు ఎంత? దేశంలోనే హైపెక్ శస్త్ర చికిత్సల నిర్వహణకు సగటు ధర సుమారు రూ.4లక్షల నుండి ప్రారంభమై రూ.7లక్షలు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు అవుతుంది.ఈ ధరలో ఆస్పత్రి చార్జీలు,సర్జన్ ఫిజ్ అన్ స్టియా ఫీజులు, మందుల ప్రక్రియకు సంబంధించిన ఇతర ఖర్చులు ఉంటాయి. హైపేక్‌ను శస్త్ర చికిత్సల తల్లి అని ఎందుకు పిలుస్తారు?.. ఇది చాలా విస్తృతమైన శస్త్ర చికిత్స. వాస్తవానికి ఈ ప్రక్రియకు మారు పేరు ఉంది. మోస్ ది మదర్ ఆఫ్ ఆల్ సర్జరిస్ దీనిలో క్యాన్సర్ బారిన పడిన ప్రతి అవయవం బయటకు తీస్తారు. చవాన్ ఆస్పత్రి వైద్య బృందం హైపెక్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసి కొనసాగిస్తుంది.

హైపెక్ సర్జరీ అంటే ఏమిటి?

హైపర్ తెర్మిక్ (హిటెడ్) ఇంట్రా పెరిటోనియల్ కేమో థెరపీ,(హైపెక్) అనేది పొత్తి కడుపు క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులకు కొత్త ఆశను కలిగించే శస్త్ర చికిత్స విధానం సైకో రెడకేటివ్ సర్జరీ అని పిలువ బడే దాని ద్వార కనిపించే కణితులను తొలగించిన వెంటనే రోగి పొత్తి కడుపులోపల వేడిచేసిన కిమో థెరపీ శక్తి వంతమైన మోతాదును పంపిణీ చేస్తారు.

హైపెక్‌లో ఏయే క్యాన్సర్లను సూచిస్తుంది?

హైపెక్ తో తరుచుగా చికిత్స పొందుతున్న క్యాన్సర్ రకాలల్లో సుడో మైక్సోయా పెరిటోని,ప్రైమరీ పెరిటోనియల్ మెనో తెలియోమా,కోలో రెక్టల్ క్యాన్సర్ అపెండిసియల్ క్యాన్సర్,గ్యాస్ట్రిక్ క్యాన్సర్, పొత్తి కడుపు దాటి వ్యాపించని అండాశయ క్యాన్సర్ ఉన్నాయి.

హైపేక్ శస్త్ర చికిత్సకు ఎవ్వరు అర్హులు?

హైపెక్ శస్త్ర చికిత్సకు తగినంత ఆరోగ్యంగా ఉండాలి.గుండె జబ్బులు లేదా ఇతర తీవ్రమైన దీర్ఘకాలిక పరిస్థితులు ఒకటి కంటే ఎక్కువ ప్రేగుకు అవరోధం లేదా పాక్షిక అవరోధం ఉండకూడదు.మనుగడను పెంపొందించడంలో హైపెక్ శస్త్ర చికిత్సలు ఎంతవరకు విజయవంతం మైంది. మాసో తెలియోమా, అపెండిక్స్ పెరిటోనియల్ మెటాస్టాసిస్ లో సీ ఆర్ ఎస్/హైపెక్ 5సంవత్సరాల మనుగడను 10/శాతం కంటే తక్కువ నుండి 50/శాతం నుండి 90/శాతం వరకు గణనీయంగా మెరుగుపర్చింది. సీ అర్ ఎస్/ హైపెక్ ఈ కణిత రకాల సంరక్షణ ప్రమాదంగా పరిగణించబడుతుంది.

హైపెక్ తరువాత రికవరీ ఎంత కాలం ఉంటుంది?

ఈ ప్రక్రియ పూర్తి కావటానికి దాదాపు 8 నుంచి 10 గంటల సమయం పడుతుంది.సాధారణంగా హైపెక్ శస్త్ర చికిత్స తరువాత 6 నుంచి 12రోజుల వరకు ఆస్పత్రిలో ఉండాల్సి ఉంటుంది.పూర్తి పునరు ద్ధరణకు 4నుండి 8 వారాలు పట్టవచ్చు.

నయనం ప్రధానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మానవ ఇంద్రియాల్లో అతి ముఖ్యమైనవి కళ్లు. కళ్లు లేని జీవితం ఊహించుకోలేము. మానవ శరీర అవయవాల్లో కళ్లకు ఉన్న ప్రాధాన్యత వేరు. ఈ ఆధునిక ప్రపంచంలో మనుషుల ఆహారపు అలవాట్లు, జన్యు పరమైన ఇబ్బందుల వలన కంటి జబ్బులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రముఖ కంటి వైద్యులు, వింధ్య హెల్త్ కేర్ స్పెషాలిటీ క్లినిక్, లేజర్ కంటి ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ నవనీత్ సర్వే అంటున్నారు. శనివారం డాక్టర్స్ డే సందర్భంగా ఆయన నవతెలంగాణ ప్రతినిధితో మాట్లాడుతూ కంటి జబ్బులు, వాటి పరిష్కార మార్గాలు వివరించారు.- నవజాత శిశువులు ప్రీ టర్మ్ డెలివరి లేదా 1500 నుండి 2000 గ్రాముల బరువు కన్నా తక్కువ బరువుతో పుట్టిన నవ జాత శిశువులు రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ బారిన పడే అవకా శాలు ఉంటాయన్నారు. వీరికి ఆర్ఓపీ ద్వారా స్క్రీనింగ్ చేసి రెటినల్ ఇంజక్షన్ లేదా రెటినల్ లేజర్స్ ద్వారా కంటి పరిష్కారం చూపించవచ్చని.. అశ్రద్ధ వహిస్తే శాశ్వత అంధత్వం వచ్చే ప్రమాదం ఉందన్నారు.

- పాఠశాల విద్యార్థుల నుండి కౌమారదశ వరకు రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ పరీక్షలు నిర్వహించి కాంటాక్ట్ లెన్స్, స్పెక్ట్రాక్ట్ కరక్షన్ లేదా లాసిక్ సర్జరీ ద్వారా కంటి జబ్బులు తొలగించవచ్చన్నారు.
- 40 సంవత్సరాలు దాటిన వారిలో క్యాటరాక్ట్ గల వారికి క్యాటరాక్ట్ సర్జరీ విత్ ప్రీమియం ఐఓసీ ఇంప్లాంటేషన్ సింట్రా ఓకులర్ లెన్స్ ద్వారా చికిత్స అందించ వచ్చన్నారు. 40 సంవత్సరాలు దాటిన షుగర్, బీపీ పేషంట్లకు రెటినోపతి (షుగర్) హైపర్‌టెన్సివ్ (బి.పి) పేషంట్లకు రెటినా లాన్సర్స్ లేదా ఇంజక్షన్ ద్వారా చికిత్స అందించవచ్చని తెలిపారు.
- 20 నుండి 60 సంవత్సరాల వారికి ప్రెజర్ ఎక్కువై కంటిపై ఒత్తిడి పెరగడంతో కంటి నరం ఒత్తిడికి గురైనప్పుడు గ్లూకోమా స్క్రీనింగ్ ద్వారా చికిత్స అందించవచ్చని తెలిపారు. ఈ ఆస్పత్రిలో గైనకాలజీ క్లినిక్, ఆర్థోపెడిక్ క్లినిక్‌లు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.











స్నేహ్ మాయజాలం

8 వికెట్లతో చెలరేగిన ఆఫ్ స్పిన్నర్
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 266/10

నవతెలంగాణ-చెన్నై : భారత్, దక్షిణాఫ్రికా మహిళల ఏకైక టెస్టులో టీమ్ ఇండియా ఆఫ్ స్పిన్నర్ స్నేహ్ రానా (8/77) మ్యాజిక్ చేసింది. 8 వికెట్ల ప్రదర్శనతో సఫారీ బ్యాటర్లను మాయలో పడేసింది. మరో స్పిన్నర్ దీప్తి శర్మ (2/47) సైతం మెరవటంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 84.3 ఓవర్లలో 266 పరుగులకే కుప్పకూలింది. సఫారీ తరఫున మారజానె కాప్ (74, 141 బంతుల్లో 8 ఫోర్లు), సునె లుస్ (65, 164 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలతో రాణించారు. 337 పరుగుల వెనుకంజలో నిలిచిన దక్షిణాఫ్రికాను భారత్ ఫాలోఆన్‌కు పిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో సఫారీలు ప్రతిఘటిస్తున్నారు. ఓపెనర్ లారా (93 నాటౌట్, 252 బంతుల్లో 12 ఫోర్లు) అజేయ అర్థ సెంచరీతో, సునె లుస్ (109, 203 బంతుల్లో 18 ఫోర్లు) సెంచరీతో కదం తొక్కారు. 85 ఓవర్లలో 2 వికెట్లకు దక్షిణాఫ్రికా 232 పరుగులు చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా మరో 105 పరుగుల వెనుకంజలో నిలిచింది. నేడు చివరి రోజు ఆటలో భారత స్పిన్నర్లు మెరిస్తే.. మరోసారి బ్యాట్ పట్టకుండానే భారత్ విజయం సాధించేందుకు అవకాశం ఉంది.



హెచ్‌సీఏ క్రికెట్ హెడ్‌గా వెంకటేశ్ ప్రసాద్?!

అపెక్స్ కౌన్సిల్‌లో అధ్యక్షుడు జగన్ ప్రతిపాదన

హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) క్రికెట్ వ్యవహారాల హెడ్‌గా భారత మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్‌ను నియమించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ప్రతిపాదించినట్టు సమాచారం. హైదరాబాద్‌లో ప్రపంచ శ్రేణి సదుపాయాలతో కూడిన అధునాతన స్టేడియం నిర్మాణంపై హెచ్‌సీఏ సిద్ధంగా ఉందని, స్థలం కేటాయింపు కోసం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించనున్నారు. జిల్లా కేంద్రాల్లో ఫస్ట్ క్లాస్ క్రికెట్ స్థాయి మూడు స్టేడియాలను నిర్మించేందుకు అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆడిట్ నివేదికలను ఆమోదించటంతో బీసీసీఐ నిధుల విడుదలకు మార్గం సుగమం అయ్యింది. హెచ్‌సీఏ క్రికెట్ ఈ నెల 8 నుంచి ఆరంభం కానుండగా.. మహిళల లీగ్ క్రికెట్ రోడ్‌మ్యాప్‌పై అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించారు. హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లు ఆర్. దేవరాజ్, సికె శ్రీనివాసరావు, సునీల్ అగర్వాల్‌లు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

భారత్ జయించిందిలా!

- కెప్టెన్ రోహిత్, కోచ్ ద్రవిడ్ దూకుడు మంత్ర
- ఫలించిన నలుగురు ఆల్‌రౌండర్ల కూర్పు
- జట్టులోని ప్రతి ఆటగాడిపై ఎనలేని నమ్మకం
- టీమ్ ఇండియా భావోద్వేగ విజయ ప్రస్థానం

హార్దిక్ పాండ్య.. ఐపీఎల్‌లో దేశవ్యాప్తంగా విద్వేషం చవిచూశాడు. అతడు ఇప్పుడు ప్రపంచ చాంపియన్

జశ్‌ప్రీత్ బుమ్రా.. వెన్నునొప్పి గాయంతో ఏడాదికి పైగా ఆటకు దూరంగా ఉన్నాడు. 2022 టీ20 ప్రపంచకప్‌లో ఆడలేకపోయాడు. ఇప్పుడు 2024 టీ20 ప్రపంచకప్‌ను సాధించాడు.

రిషబ్ పంత్.. 2022 రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. సుమారు రెండేండ్లు ఆటకు దూరమయ్యాడు. పంత్ ఇప్పుడు పొట్టి ప్రపంచకప్ విజేత.

2022 టీ20 ప్రపంచకప్ సెమీస్, 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఫైనల్.. కెప్టెన్‌గా రోహిత్ శర్మ గుండెకోత ఎదుర్కొన్న సందర్భాలు. భారత జట్టు సారథిగా నాల్గో ప్రయత్నంలో రోహిత్ శర్మ దేశం గర్వపడే విజయాన్ని అందించాడు. దిగ్గజ ఎం.ఎస్ ధోని సరసన నిలిచాడు.

రాహుల్ ద్రవిడ్.. 2007 వన్డే వరల్డ్‌కప్‌లో మరిచిపోలేని పరాజయం చవిచూశాడు. ఇప్పుడు అదే గడ్డపై 2024 టీ20 ప్రపంచకప్‌ను కోచ్‌గా అందుకుని ఔరా అనిపించాడు.

దశాబ్ది కాలంగా కంటి దిగువన దాగి ఉన్న కన్నీళ్లు ఒక్క విజయంతో ఉబికి వచ్చాయి. క్రికెటర్లు, సహాయక సిబ్బందితో పాటు మాజీ క్రికెటర్లు, అభిమానులు సైతం భావోద్వేగ సంద్రంలో మునిగిపోయారు. 2024 టీ20 ప్రపంచకప్ విజయం అందుకే ప్రత్యేకం.



పొట్టి ప్రపంచకప్ విజేతలకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ నజరానా ప్రకటించింది. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్ సాధించిన రోహిత్‌సేనకు రూ.125 కోట్ల నగదు బహుమతి అందిస్తున్నట్టు బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించాడు. అద్వితీయ విజయం సాధించిన క్రికెటర్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి బీసీసీఐ అభినందనలు తెలిపింది.

నవతెలంగాణ క్రీడావిభాగం

ప్రపంచ క్రికెట్ అగ్రజట్టు. అత్యంత ధనిక క్రికెట్ బోర్డు. స్వదేశంలో వంద కోట్ల విశేష అభిమాన ఆదరణ. అయినా, పదేండ్లుగా ఐసీసీ టైటిల్ విజయం లేదనే వెలితి. టీమ్ ఇండియా ద్వైపాక్షిక సిరీస్ పులి అంటూ.. పాశ్చాత్య మీడియా, క్రికెట్ విశ్లేషకులు హేళన చేసిన సందర్భాలు సైతం ఉన్నాయి. పదేండ్ల నిరీక్షణకు తెరదించుతూ రోహిత్‌సేన టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను స్వదేశానికి పట్టుకొచ్చింది. పొట్టి ప్రపంచకప్ ట్రోఫీని భారత్ అందుకునేందుకు.. తెరవెనుక, తెర ముందు అవిశ్రాంత పోరాటం చేసిన హీరోల గురించి...!

నాయకుడు రోహిత్

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో రోహిత్ ఒకడు. ముంబయి ఇండియన్స్‌కు ఐదు టైటిల్స్ అందించిన రోహిత్.. భారత్‌కు ఐసీసీ టైటిల్ లోటు తీర్చగలడని అప్పటి బీసీసీఐ బాస్ గంగూలీ గట్టిగా విశ్వసించాడు. రోహిత్ శర్మకు కెప్టెన్సీ పగ్గాలు దక్కటంలో దాదా పాత్ర ఎక్కువ. 2022 టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్లో పోటీ ఇవ్వకుండా ఓటమి పాలైంది. అక్కడే కెప్టెన్ రోహిత్ శర్మ ఓ నిర్ణయానికి వచ్చాడు. సంప్రదాయ క్రికెట్‌తో ఐసీసీ టైటిల్ సాధించలేమని.. బ్రేకుల్లేని దూకుడు మంత్ర అవసరమని భావించాడు. జట్టుకు దూకుడు మంత్ర ఎక్కించాడు. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో ముందుండి ఎదురుదాడి చేశాడు. అజేయంగా ఫైనల్‌కు చేర్చినా.. ఆఖర్లో నిరాశే ఎదురైంది. అదే పంథా కొనసాగించి కరీబియన్ దీవుల్లో కప్పు కైవసం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో రోహిత్, పంత్, సూర్య పవర్‌ప్లేలో నిష్క్రమించినా.. క్రీజులోకి వస్తూనే అక్షర్ పటేల్ బౌండరీ బాదటం వెనుక రహస్యం ఇదే ఫార్ములా. వికెట్లు పడినా.. ఎదురుదాడి ట్రాక్ వీడొద్దనే ఫార్ములా భారత్‌ను నేడు చాంపియన్‌గా నిలిపింది.

ది వాల్.. గురువు

భారత క్రికెట్ జెంటిల్‌మెన్ రాహుల్ ద్రవిడ్. స్వతహాగా సంప్రదాయ క్రికెటర్. కానీ కోచ్‌గా తన టీమ్‌ను పూర్తి భిన్న పథంలో నడిపించాడు. ఆటగాడిగా దక్కని ఐసీసీ టైటిల్‌ను.. కోచ్‌గా చివరి రోజు సాధించాడు. గతంలో తుది జట్టు కూర్పులో ప్రతి మ్యాచ్‌కు మార్పులు చేర్పులు సహజం. కానీ ఈ ప్రపంచకప్‌లో భారత్ 12 మంది ఆటగాళ్లతో బరిలోకి దింపింది. ప్రదర్శనతో సంబంధం లేకుండా ఆటగాళ్లపై విశ్వాసం ఉంచిన ద్రవిడ్.. గొప్ప ఫలితం సాధించాడు. తుది జట్టు కూర్పులో నలుగురు ఆల్‌రౌండర్లను ఎంచుకోవటం భారత్‌కు బాగా కలిసొచ్చింది. రవిశాస్త్రి, అనిల్ కుంబ్లేలు ఐసీసీ టైటిల్‌కు చేరువగా వచ్చినా.. రాహుల్ ద్రవిడ్ ఒక్కడే గత దశాబ్ది కాలంలో చాంపియన్‌గా నిలిచిన భారత చీఫ్ కోచ్.

విరాట పర్వం

టీ20 ప్రపంచకప్ జట్టులో విరాట్ కోహ్లి చోటుపై ప్రశ్నలు. గ్రూప్, సూపర్8 మ్యాచుల్లో వైఫల్యంతో విమర్శలు. అయినా, జట్టు మేనేజ్‌మెంట్ కోహ్లిపై నమ్మకం ఉంచింది. కెరీర్ చివరి టీ20 మ్యాచ్‌లో కోహ్లి క్లాస్ చూపించాడు. బ్యాటింగ్‌కు సహకరించిన పిచ్‌పై సహచర బ్యాటర్లు నిరాశపరిచినా.. ఓ ఎండ్‌లో గట్టిగా నిలబడ్డాడు. 2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్ తరహాలో 2024 టైటిల్ పోరులో అర్థ సెంచరీతో ఆదుకున్నాడు. అన్ని మ్యాచుల్లో పరుగుల వేట ఓ ఎత్తు.. టైటిల్ పోరు ఒక్కటీ ఓ ఎత్తు అని మరోసారి నిరూపించాడు. ఫైనల్లో విన్నింగ్ ఇన్నింగ్స్‌తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

రథ సారథి బుమ్రా

బ్యాటింగ్‌కు పెద్దగా అనుకూలించని పిచ్‌లపై టీమ్ ఇండియాను విజయ తీరాలకు చేర్చిన రథ సారథి, పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా. గ్రూప్ దశలో పాకిస్థాన్‌పై నిప్పులు చెరిగిన బుమ్రా.. స్వల్ప స్కోరును నిలబెట్టాడు. ఫైనల్లోనూ చేజారింది అనుకున్న మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. చరిత్ర పుటల్లో నిలిచిపోయే బుల్లెట్ల వంటి బంతులను సంధించాడు. భారత్ కష్ట కాలంలో ప్రతి సారి బంతి అందుకుని వికెట్ల వేట సాగించాడు. యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 8 మ్యాచుల్లో 17 వికెట్లు కూల్చగా.. బుమ్రా 8 మ్యాచుల్లో 15 వికెట్లు కూలదోశాడు. అర్ష్‌దీప్ సింగ్ సగటు 12.64 కాగా.. బుమ్రా సగటు 8.26 కావటం విశేషం. ముంబయి ఇండియన్స్‌కు ఐపీఎల్ నరాలు తెగే ఉత్కంఠ ఫైనల్లో అద్వితీయ విజయాలు అందించిన బుమ్రా.. ఈసారి ఆ పని భారత్‌కు చేసి పెట్టాడు. బుమ్రా లేకుండా భారత టీ20 ప్రపంచకప్ విజయాన్ని ఊహించలేం.

ప్రజానేతగా ఎదుగుతారా ?

రాహుల్‌పై బాధ్యతల బరువు

- మిత్రులను కలుపుకుపోవాలి
- పార్టీలో కుమ్ములాటలను నిలువరించాలి
- తరాల అంతరాలు తగ్గించాలి
- మోడీని దీటుగా ఎదుర్కోవాలి



న్యూఢిల్లీ : రాజకీయాల్లో ఉత్థానపతనాలు సర్వసాధారణమే. పలువురు నాయకులు పడి లేచిన కెరటం మాదిరిగా పరాజయాలు, పరాభవాలను దాటుకుంటూ ప్రజా జీవనంలో తమ ప్రస్థానాన్ని కొనసాగించారు. అలాంటి వారిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాను రాహుల్ అభినందిస్తుంటే ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆయన వెనుక నిలబడిన దృశ్యాన్ని చూసిన వారికి అదే భావన కలిగి ఉంటుంది.

రాజకీయాల్లో రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం లోక్‌సభలో ప్రతిపక్షాల ముందు వరుసలో రాహుల్‌కు స్థానం లభించింది. ఆయన తండ్రి రాజీవ్ గాంధీ, తల్లి సోనియా గాంధీ కూడా గతంలో ప్రతిపక్ష నేతలుగా వ్యవహరించారు. వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో సోనియా దాదాపు ఐదు సంవత్సరాల పాటు ప్రతిపక్ష నేతగా కొనసాగారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీకి ఇప్పుడు ఎన్నో అధికారాలు, సౌకర్యాలు లభించాయి.

ఇప్పటి వరకూ పాత్ర తక్కువే

ఇరవై సంవత్సరాలకు పైగా ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీ చట్టసభలో కేవలం 99 ప్రశ్నలు మాత్రమే వేశారు. 26 చర్చల్లో మాత్రమే భాగస్వామి అయ్యారు. సమావేశాలకు హాజరైంది కూడా చాలా తక్కువే. 2014 నుండి జరిగిన పలు బడ్జెట్ సమావేశాలకు ఆయన హాజరు కాలేదు. అప్పుడప్పుడు మాత్రం తళుక్కుమని సభలో మెరిసేవారు. ఆయన నియమించిన వారు కూడా ప్రధాని మోడీని గట్టిగా నిలదీయలేకపోయారు. ఇప్పుడు రాహుల్ స్వయంగా ప్రతిపక్ష నేత అయినందున ఇకపై ఆయన ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వచ్చిన ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. ఆయన ఆ పని చేస్తారా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

భాగస్వాములను కలుపుకుంటూ...

ఇప్పుడు రాహుల్ తిరిగి కాంగ్రెస్‌కు జీవం పోశారు. సామాజికంగా ఆయన అందరికీ ఆమోదయోగ్యుడయ్యారు. వయసు కూడా ఏమంత ఎక్కువ కాదు. అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, సుప్రియా సూలే, కనిమొళి, ఒమర్ అబ్దుల్లా, అభిషేక్ బెనర్జీ, కేజ్రీవాల్, ఆదిత్య ఠాకరే వంటి నేతలు ఇప్పుడు రాహుల్‌కు సహజ మిత్రులు. డీఎంకే, ఆర్జేడీ పార్టీలు రాహుల్‌ను భావి ప్రధానిగా చూపాయి. అయితే ఇప్పటికీ కాంగ్రెస్‌కు చాలా రాష్ట్రాల్లో సరైన ఉనికి లేదు. కానీ అక్కడ ప్రాబల్యం కలిగిన మిత్రులు ఉండడం కలిసొచ్చే అంశం. వారి ఆధిపత్యాన్ని అంగీకరిస్తూ రాహుల్ ముందుకు సాగాల్సి ఉంటుంది. ఒకప్పటి తన విమర్శకుడైన శరద్ పవార్‌కు సోనియా గాంధీ పెద్దపీట వేసి, 2004లో అధికారంలోకి రాగలిగారు. యూపీఏ మిత్రపక్షాలకు కీలకమైన మంత్రి పదవులు ఇచ్చారు. సంకీర్ణ రాజకీయాల్లో ఇది అందరికీ ఓ పాఠం కావాలి.

1984 నుండి 2019 వరకూ...

కాంగ్రెస్ తనంత తానుగా ఇప్పట్లో అధికారాన్ని సొంతం చేసుకునే అవకాశాలు లేవు. 1984 తర్వాత ఆ పార్టీకి లోక్‌సభలో ఎప్పుడూ మెజారిటీ రాలేదు. 1984లో మాత్రం రాజీవ్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్‌కు అత్యధికంగా 404 స్థానాలు వచ్చాయి. ఎనిమిది సంవత్సరాల పాటు రాజకీయ ఎడారిలో గడిపిన కాంగ్రెస్ పార్టీ 2004లో బీజేపీని ఓడించింది. 2009లో కూడా సోనియా నేతృత్వంలోనే కాంగ్రెస్ బలం 200 దాటింది. 2014లో సీన్ రివర్స్ అయింది. ఆ పార్టీ కేవలం 44 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2019లోనూ ఆ పార్టీకి దక్కింది 52 సీట్లే. కాంగ్రెస్ కంటే గాంధీలనే ఎక్కువగా లక్ష్యంగా చేసుకొని మోడీ రాజకీయాలు నడిపారు.

పాత, కొత్త తరాల కలయికతో...

పది సంవత్సరాల పాటు ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన నరేంద్ర మోడీ ఇప్పుడు తొలిసారిగా సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నారు. మిత్రుల నుండి అప్పుడే డిమాండ్లు మొదలయ్యాయి. బీహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని జేడీయూ అధినేత నితీష్ కుమార్ కోరుతున్నారు. అందుకు మోడీ తలవంచడమో లేదా తిరస్కరించడమో చేయాల్సి ఉంటుంది. ఈ కీలకమైన పరిణామాన్ని రాహుల్ తనకు అనుకూలంగా మలచు కోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్‌లో ముఠాల కుమ్ములాటలు కొత్తేమీ కావు. పార్టీ నేతలందరినీ ఏకం చేసి, పార్టీని యుద్ధానికి సన్నద్ధం చేయడం రాహుల్ ముందున్న కర్తవ్యం. కాంగ్రెస్‌లో వృద్ధ నేతల సంఖ్య తక్కువే. యువత, మధ్య వయస్కులే ఎక్కువగా ఉన్నారు. సచిన్ పైలట్, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్, గౌరవ్ గొగోయ్, నానా పాటోల్, దీపేందర్ హుడా, శశి థరూర్, భూపేష్ బాఘేల్ వంటి నేతలు వ్యక్తిగతంగా, పార్టీ పరంగా తమ తమ ప్రాంతాలలో విజయాలు సాధించగలరు. వారందరినీ కూడగట్టుకొని, పాత కొత్తల మేలు కలయికతో ముందడుగు వేస్తే రాబోయే కాలంలో బీజేపీని నిలువరించడం కష్టమేమీ కాబోదు. అప్పుడే ఆయన ప్రజా నేతగా ఎదుగుతారు.

ఎన్జీఓలపై ఉక్కుపాదం తగదు

- క్రూరమైన చట్టాలతో వేధింపులు సరికాదు
- 700 సంస్థలపై ఆధారాలే లేవు
- అంతర్జాతీయ సంస్థ ఎఫ్ఏటీఎఫ్ నివేదిక



(ఫైల్)

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలపై ఉక్కుపాదం మోపుతోందని అంతర్జాతీయ సంస్థ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) అభిప్రాయపడింది. ఉగ్రవాదులకు ఆర్థిక సాయం, మనీలాండరింగ్ కార్యకలాపాలపై ఈ సంస్థ పరిశీలన జరుపుతోంది. జూన్ 23-28 తేదీల మధ్య సింగపూర్‌లో ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశం జరిగింది. కువైట్, భారత్‌లో నెలకొన్న పరిస్థితులపై రూపొందించిన నివేదికలను ఈ సమావేశంలో చర్చించారు. భారత్‌లో స్వచ్ఛంద సంస్థల విషయంలో తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా లేవని అంటూ నేరస్థులను విచారించే విషయంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని సమావేశం సూచించింది. ఉగ్రవాదానికి సాయం అందకుండా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, అదే సమయంలో ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందిస్తున్నాయన్న కారణం చూపి స్వచ్ఛంద సంస్థలను వేధించకూడదని తెలిపింది.

స్వచ్ఛంద సంస్థలను అణచివేసేందుకు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) వంటి వాటిని భారత్ ప్రయోగిస్తోందని, ఈ వైఖరి తమ మార్గదర్శకాలకు అనుగుణంగా లేదని ఎఫ్ఏటీఎఫ్ స్పష్టం చేసింది. ప్రమాణాలను సాకుగా చూసి ఎన్‌జీఓలపై విరుచుకుపడడం సరికాదని హితవు పలికింది. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఎఫ్‌సీఆర్ఏను 2020లో మరోసారి సవరించిన విషయం తెలిసిందే. విదేశీ విరాళాలు పొందే ఎన్జీఓలపై నిఘాకు, నియంత్రణకు ఈ సవరణ ప్రభుత్వానికి అధికారాలు కట్టబెట్టింది. అదే విధంగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం, ఉపాను కూడా మోడీ ప్రభుత్వం సవరించి వాటిని మరింత క్రూరమైన చట్టాలుగా మార్చింది. ఎఫ్ఏటీఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం చెప్పుకుంది.

ఎఫ్‌సీఆర్ఏ కింద నమోదైన పలు ప్రముఖ స్వచ్ఛంద సంస్థల రిజిస్ట్రేషన్లను గత కొన్ని సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం రద్దు చేస్తోంది. దీంతో అవి విదేశీ విరాళాలు పొందే అవకాశం లేకుండా పోయింది. కంపాసన్ ఇంటర్నేషనల్, గ్రీన్‌పీస్, అమ్నెస్టీ, సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ వంటి పేరెన్నికగన్న ఎన్‌జీఓల భారతీయ శాఖల రిజిస్ట్రేషన్లు రద్దయ్యాయి. చివరికి 2022లో నోబెల్ పురస్కార గ్రహీత మదర్ థెరిసాకు చెందిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్ కూడా కొంతకాలం లైసెన్సును కోల్పోయింది. ప్రతిపక్ష పార్టీల నుండి తీవ్రమైన నిరసన వ్యక్తం కావడంతో రెండు వారాల తర్వాత దానిని ప్రభుత్వం పునరుద్ధరించింది.

విదేశీ విరాళాలు పొందేందుకు అనుమతి కోసం ఎన్జీఓలు సమర్పించిన దరఖాస్తుల్లో 2010 నుండి ఇప్పటి వరకూ 56 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని ఎఫ్ఏటీఎఫ్ తెలిపింది. ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందిస్తున్న కొన్ని ఎన్జీఓలను భారత ప్రభుత్వం గుర్తించిందని, అయితే వీటిలో 700 సంస్థల కార్యకలాపాలపై ఎలాంటి ఆధారాలు లభించలేదని తేల్చింది. ఎన్జీఓలపై గంపగుత్తగా చర్యలు తీసుకోవడం సరికాదని, వాటి కార్యకలాపాలను విడివిడిగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని 2014లోనే ఈ అంతర్జాతీయ సంస్థ సూచించింది.

ఈపీఎఫ్ఓలో తగ్గిన కొత్త సభ్యులు

న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ)లో కొత్త సభ్యుల చేరిక తగ్గిపోయింది. గత సంవత్సరంతో పోలిస్తే 2023-24లో కొత్త చందాదారుల సంఖ్య 4 శాతానికి తగ్గి 10.9 మిలియన్లకు చేరిందని గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక తెలిపింది. 2022-23లో ఈపీఎఫ్ఓలో 11,498,453 మంది కొత్త సభ్యులు అదనంగా చేరగా 2023-24లో 10,993,119 మాత్రమే చేరారు. నూతన సభ్యుల చేరిక తగ్గడానికి కోవిడ్ కూడా కారణమేనని భావిస్తున్నారు. 2019-20లో 11,040,683 మంది కొత్త సభ్యులు చేరగా 2020-21లో 8,548,898 మంది చేరారు. 2021-22లో సభ్యుల సంఖ్య మళ్లీ పెరిగి 10,865,063కు చేరింది.

ప్రాణాంతక కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2020, 2021లో పలు ఆంక్షలు విధించాయి.

ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగాలపై ప్రభావం పడింది. 2023-24కు ముందు ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఈపీఎఫ్ఓలో చేరిన నూతన సభ్యుల సంఖ్య కోవిడ్‌కు ముందున్న 2018-19 స్థాయికి చేరుకోలేకపోయింది. 2018-19లో ఈపీఎఫ్ఓలో 13,944,349 మంది కొత్త సభ్యులు చేరారు. కాగా ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ)లో కూడా నూతన సభ్యుల చేరిక తగ్గింది. 2022-23లో 17,760,672 మంది సభ్యులు చేరితే 2023-24లో మంది 16,773,023 మాత్రమే చేరారు. జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్)లో మాత్రం నూతన చందాదారుల సంఖ్య పెరిగింది.





కమ్యూనిస్టు యోధుడు చౌదరి తేజేశ్వర్‌రావును పరామర్శిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల సీపీఐ(ఎం) నేతలు

అభ్యుదయవాది సావిత్రమ్మ



- తెలుగు రాష్ట్రాల సీపీఐ (ఎం) నాయకులు

శ్రీకాకుళం : సీపీఐ(ఎం) అభిమాని సావిత్రమ్మ గొప్ప అభ్యుదయవాది అని పలువురు నాయకులు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం నవభారత్‌నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన సావిత్రమ్మ సంస్మరణ సభకు తెలుగు రాష్ట్రాల నుంచి సీపీఐ(ఎం) నాయకులు హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల చిన్నతనంలోనే భర్త చనిపోయినా అధైర్యపడకుండా ముగ్గురు కుమారులను సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల వెనుక మహిళలు విశిష్ట పాత్ర పోషిస్తారనడానికి సావిత్రమ్మ ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడుతూ సావిత్రమ్మ తన కుమారులను పార్టీ కోసం పనిచేసేలా ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఆమెతో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున, తన తరుపున సావిత్రమ్మ కుటుంబానికి ఆయన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. జ్యోతి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో పని చేయడం వల్లే ఆ కుటుంబం సమాజం పట్ల ఎంతో బాధ్యతగా పని చేసిందన్నారు.

ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ సావిత్రమ్మ ఆలోచనలు, ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు గపూర్, బి.వెంకట్ తమ సంతాప సందేశాన్ని పంపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి లోకనాథం, శ్రీకాకుళం, విశాఖ జిల్లా కార్యదర్శులు డి గోవిందరావు, జగ్గునాయుడు, సావిత్రమ్మ కుమారులు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బాబూరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి జయరాం, మరో కుమారుడు పోస్టల్ యూనియన్ నాయకులు జ్యోతీశ్వరరావు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గన్నారు.

గృహజ్యోతి కోసం..

లక్షలాది మంది ఎదురుచూపు

- రాష్ట్రవ్యాప్తంగా 1.05కోట్ల మందికి అర్హత ఉన్నా.. 34.59 లక్షల మందికి మాత్రమే లబ్ది
- రేషన్‌కార్డు లేదని అర్హత పొందని వైనం
- కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అమల్లో అర్హులు సైతం లబ్దిపొందలేక పోతున్నారు. గృహజ్యోతి పథకానికి విధిగా రేషన్‌కార్డు ఉండాలనే నిబంధన పేదలకు పెద్ద ఆటంకంగా మారింది. ఎన్నో ఏండ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయలేదు. దాంతో చాలా మంది ఆరు గ్యారంటీ పథకాల్లో లబ్దిదారులు కాలేకపోతు న్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తున్నప్పటికీ ప్రజా పాలన దరఖా స్తుల్లో రేషన్‌కార్డు నెంబర్ ఎంటర్ చేయలేదన్న నెపంతో వాళ్లందర్నీ అనర్హులుగా పక్కన పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు జారీ చేసి అర్హులందరికీ ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ నిత్యం ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. గృహజ్యోతి పథకం కింద.. 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తూ రేషన్‌కార్డు కలిగిన వాళ్లందరికీ జీరో బిల్లు ఇస్తూ ఉచిత విద్యుత్‌ను రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేస్తున్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తుల్ని స్వీకరించిన ప్రభుత్వం వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. దరఖాస్తుదారులు విద్యుత్ సర్వీస్ నెంబర్, తెల్లరేషన్‌కార్డు నెంబర్ నమోదు చేయాల్సి ఉంది. అలా నమోదు చేయని దరఖాస్తుల్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో రేషన్‌కార్డు నెంబర్‌లేకపోవడంతో అర్హులుగా గుర్తించలేదు. విద్యుత్ అధికారుల లెక్కల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారుల సంఖ్య 1.05 కోట్లు. వీరిలో ఎంతమందికి రేషన్‌కార్డు లు ఉన్నాయెూ తెలియని పరిస్థితి. దాంతో ఇందులో సగం మందికి కూడా జీరో బిల్లు వస్తుందా.. లేదా అనే అనుమానాలు మొదలయ్యాయి.



34.59 లక్షల మందికి మాత్రమే లబ్ది

గృహజ్యోతి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 34,59,585 మంది వినియోగదారులు లబ్ది పొందుతున్నారు. వారి బిల్లుల కోసం రాష్ట్రప్రభుత్వం సుమారు రూ.125 కోట్లు డిస్కంలకు విడుదల చేసినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ఉచిత గృహలక్ష్మి పథకం కింద లబ్దిపొందేందుకు ప్రజాపాలన కార్యక్రమంలో 1,09,01,255 దరఖాస్తులు వచ్చాయి. వాటిల్లో 64,57,891 దరఖాస్తులు ఆధార్‌తో అనుసంధానమై తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉన్నట్టు నిర్ధారించారు. అందులో 34,59,585 మంది దరఖాస్తుదారులకు గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్టు గుర్తించారు. వీరికి మాత్రమే గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు జీరో బిల్లు ఇస్తున్నారు.

జీరో బిల్లు వస్తున్న వాళ్లందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,71,456 మంది వినియోగదారులు లబ్దిపొందుతున్నారు. జూన్ నెలలో జీరో బిల్లు వచ్చిన లబ్దిదారుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లాలో 1,75,464 మంది లబ్దిదారులు ఉచిత విద్యుత్ సదుపాయంతో రూ.6.63 కోట్ల రాయితీ పొందుతున్నారు. సిద్దిపేట జిల్లాలో 1,81,365 మందికి ఉచిత విద్యుత్ ద్వారా రూ.6.10 కోట్ల రాయితీ లభిస్తుంది. మెదక్ జిల్లాలో 1,14,627 మంది లబ్దిదారులకు రూ.2.19 కోట్ల రాయితీ లభిస్తుంది. నెల నెలా గృహలక్ష్మీ పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తున్న వాళ్లకు మాత్రమే పథకం వర్తింపచేస్తున్నారు. మొదట్లో లబ్దిదారులుగా గుర్తించబడిన తర్వాత ఇటీవల వేసవి అవసరాల నిమిత్తం ఫ్యాన్లు, కూలర్లు వాడినందుకు 200 యూనిట్ల కంటే కొంచెం ఎక్కువ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించడంతో జీరో బిల్లు రాలేదు. అలాంటి వినియోగదారుల్ని గుర్తించిన విద్యుత్ శాఖ సిబ్బంది వినియోగదారుల నుంచి మొత్తం బిల్లు వసూలు చేశారు.

కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూపు

కొత్తగా వివాహమైన కుటుంబాల్లో వారు వేరుగా కాపురాలు పెట్టారు. చిన్నపాటి ఇండ్లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. కొందరు కిరాయి ఇండ్లలో నివాసముంటున్నారు. ఉమ్మడి కుటుంబం రేషన్‌కార్డు నెంబర్‌పైన ఒక ఇంటికే లబ్ది చేకూరుతుంది. ఆ కుటుంబం నుంచి వివాహమై, వారి పిల్లలూ పెద్దయ్యారు. రాష్ట్రంలో ఎన్నో ఏండ్లుగా రేషన్‌కార్డులు మంజూరు కాలేదు. దాంతో చాలా మంది గృహజ్యోతి పథకానికి అర్హులు కాలేక పోతున్నారు. గృహజ్యోతి పథకం దరాఖా స్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాక విద్యుత్ అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. అయితే వందలాది కుటుంబాలు వేర్వేరుగా ఉండటంతో ఒకే రేషన్‌కార్డు ఉన్నందున వాళ్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. అలాగే గత ప్రభుత్వం తొమ్మిదేండ్ల పాలనలో రేషన్‌కార్డుల్ని మంజూరు చేయలేదు. రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలో జన్మించిన వాళ్ల పేర్లను కూడా రేషన్‌కార్డుల్లో నమోదు చేయలేదు. ఆన్‌లైన్‌లో విద్యుత్ సర్వీస్ నెంబర్‌ను ఎడిట్ చేసుకునే చాయిస్ ఇచ్చిన ప్రభుత్వం రేషన్‌కార్డు నెంబర్‌ను ఎంటర్ చేసేందుకు మాత్రం ఎడిట్ చాయిస్ ఇవ్వలేదు. గృహజ్యోతి పథకం కోసం ప్రజాపాలనలో 8.20 లక్షల వరకు దరఖా స్తులు వచ్చాయి. వాటిల్లో 3.5 లక్షల వరకు రేషన్‌కార్డు నెంబర్ నమోదు చేయలేదని అనర్హులుగా గుర్తించారు. కొందరు రేషన్‌కార్డు ఉన్నా ప్రజాపాలన సమయంలో వివరాలు పేర్కొనలేదు. వాళ్లకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు. దాంతో ఈ 3.5 లక్షల మంది ఉచిత విద్యుత్ కోసం గ్రామాలకు చెందిన ప్రజలు ఎంపీడీఓ, పట్టణ ప్రజలు మున్సిపాలిటీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

రేషన్‌కార్డు లేదని ఉచితం ఇస్తలేరు : పద్మమ్మ, సంగారెడ్డి

రేషన్‌కార్డు కోసం ఎన్నో ఏండ్లుగా దరఖాస్తు చేస్తూ వస్తున్నాం. ఇంతవరకు మంజూరుకాలేదు. చిన్నపాటి ఇంట్లో ఉంటున్నాం. మాకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ కంటే ఎక్కువ వినియోగించే పరిస్థితి లేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేశాం.

అయినా మాకు ఉచిత విద్యుత్ ఇస్తలేరు. ప్రభుత్వం రేషన్‌కార్డు మంజూరు చేసి గృహజ్యోతి కింద లబ్దిచేకూరేలా చూడాలి. రోజువారి కూలీ మీద బతికే మాలాంటి వాళ్లకు కూడా ఉచిత విద్యుత్ ఇస్తలేరు.

రేషన్‌కార్డు ఉండి 200 యూనిట్లలోపు వాడితే ఉచితం: మాదవరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ

200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వాళ్లు గృహజ్యోతి పథకం కింద లబ్దిపొందాలంటే రేషన్‌కార్డు కలిగి ఉండాలి. అలా రేషన్‌కార్డు ఉంటి దరఖాస్తు చేసిన వాళ్ల వివరాల్ని సర్వే చేసి లబ్దిదారులుగా గుర్తించాం. రేషన్‌కార్డు లేని వాళ్లు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిం చినప్పటికీ ఉచితం కింద లబ్దిపొందడానికి వీలుకాదు.

200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్‌ను వినియోగిస్తే ఉచితం వర్తించదు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పథకాన్ని అమలు చేస్తున్నాం.

పట్టణ భూమి, ఆస్తి రికార్డుల క్రమబద్ధీకరణకు

ప్రణాళికలు సిద్ధం చేస్తున్న మోడీ ప్రభుత్వం

- దాదాపు తొమ్మిది రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్

న్యూఢిల్లీ : గ్రామీణ ప్రాంతాల్లో భూమి, ఆస్తి రికార్డు వ్యవస్థలను ఆధునీకరించిన తర్వాత.. మోడీ ప్రభుత్వం ఇప్పుడు భూ లావాదేవీలలో పారదర్శకతను తీసుకురావటానికి పట్టణ ప్రాంతాల్లో భూమి, ఆస్తి యాజమాన్య రికార్డులను క్రమబద్ధీకరించటానికి సిద్ధమవుతున్నది. గ్రామీణాభివద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన భూ వనరుల శాఖ(డీఓఎల్ఆర్).. ఈ పథకాన్ని ఖరారు చేసే ముందు సవాళ్లను అర్థం చేసుకోవడానికి దాదాపు తొమ్మిది రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌ను ప్లాన్ చేస్తున్నదని మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రెండు కీలకమైన కేంద్ర ప్రభుత్వ పథకాలు డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రామ్ (డీఐఎల్ఆర్ఎంపీ), గ్రామాల సర్వే, గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన సాంకేతికతతో మ్యాపింగ్ (ఎస్‌వీఏఎంఐటీవీఏ) పథకం విజయవంతంగా అమలు జరిగిన తర్వాత కేంద్రం ఈ విషయంలో ముందుకెళ్తుండటం గమనార్హం. ఈ నెల ప్రారంభంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శివరాజ్ సింగ్ చౌహాన్.. బీజేపీ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు సంబంధించిన పనిని ప్రారంభించాలని అధికారులను కోరారు. పట్టణ భూ రికార్డుల సంక్లిష్ట సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం గతేడాది నుంచి మార్గాలను అన్వేషిస్తున్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం గతేడాది జూన్‌లో నిటి ఆయోగ్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ), డీఐఎల్ఆర్ఎంపీని అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కలిసి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల(యూటీ)తో సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించింది.

గతేడాది డిసెంబర్‌లో ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన ప్రధాన కార్యదర్శుల సమావేశంలో కూడా ఈ విషయంపై చర్చ జరిగిందని ప్రభుత్వ వర్గాల సమాచారం. పట్టణ ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్ కోసం.. కర్నాటక, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు అనుసరించిన వివిధ నమూనాలను డీఓఎల్ఆర్ పరిశీలిస్తున్నదనీ, వాటిలో మంచి పట్టణ భూ రికార్డు వ్యవస్థలు ఉన్నాయని మరో సీనియర్ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారి తెలిపారు.

విద్యార్థుల సంఖ్యకనుగుణంగా టీచర్ల బదిలీలు

- గత తప్పిదాలకు తావులేకుండా చర్యలు
- బదిలీల్లో వెబ్‌ఆప్షన్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తికనుగుణంగా టీచర్లు లేరు. దాంతో తక్కువ మంది విదార్థులున్న చోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు, ఎక్కువ మంది విద్యార్థులున్న చోట తక్కువ మంది టీచర్లు ఉన్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా విద్యార్థులసంఖ్యకనుగునంగా ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. పాఠశాల విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచేలా విధివిధానాలు ఖరారు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి టీచర్ల బదిలీల్లో వెబ్ ఆప్షన్లను కేటాయించినట్టు సమాచారం.అదొక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. అక్కడ ఐదవ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుంది. విద్యా శాఖ లెక్క ప్రకారం అక్కడ ఐదుగురు ఉపాధ్యాయులుండాలి.

కాని క్లాసుల్లో విద్యార్థుల సంఖ్య సింగిల్ డిజిట్ మాత్రమే. అయినా విద్యా శాఖ ఇష్టా రీతిన ఉపాధ్యాయులను కేటాయించింది. దాంతో విద్యార్థులకు, టీచర్లకు మధ్య సమతూకం కొరవడింది. గత సర్కార్ హయాంలో రాష్ట్రంలోని అనేక స్కూళ్ల పరిస్థితి ఇది. రాష్ట్రంలో కొత్తగా రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఈ తప్పులకు తావు లేకుండా చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ తగు చర్యలు చేపట్టింది. సున్నా నుంచి 19 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒకరు, 20 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఇద్దరు, 61 నుంచి 90 మంది విద్యార్థులున్న పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేలా గత ప్రభుత్వం 2015, జూన్, 27న జీవో నెం: 17, 2021, ఆగస్టు 21న జీవో 25 జారీ చేసింది.

విద్యార్థుల సంఖ్య, వారికి మెరుగైన విద్యా బోధనను దష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కొన్ని మార్పులతో వెబ్ ఆప్షన్లను కేటాయించింది.1నుంచి10 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒకటి, 11 నుంచి 40 వరకు విద్యార్థులున్న పాఠశాలకు రెండు, 41 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు మూడు, 61పైన విద్యార్థులున్న పాఠశాలకు ఆ పాఠశాలకు మంజూరైన అన్ని పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతమున్న విద్యార్థులకన్నా ఎక్కువ మంది పాఠశాలలో చేరితే పెరిగిన సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయించనున్నారు. ఈ విధానం వల్ల విద్యార్థుల చదువు సాఫీగా సాగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

అసోంలో మార్క్‌షీట్ స్కామ్

- గౌహతి వర్శిటీలో కొందరు విద్యార్థుల మార్కుల పెంపు
- ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు సహా 10 మంది అరెస్టు

న్యూఢిల్లీ : నీట్ స్కామ్ మరువక ముందే అసోంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో మరో స్కాం వెలుగుచూసింది. గౌహతి యూనివర్సిటీలో విద్యార్థుల పరీక్ష పేపర్లలో మార్కులను మార్పు చేసి, ఎక్కువ మార్కులు నమోదు చేస్తూ.. పెద్దమొత్తంలో నగదు గుంజుతున్నారని వెల్లడైంది. ఒక పేపరులో మార్కులు పెంచడానికి రూ.16 వేలు, ఒక సెమిస్టర్‌లోని అన్ని పేపర్లలో మార్కులు మార్పు చేసేందుకు లక్ష రూపాయలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఈ స్కామ్‌లో ఇప్పటివరకూ ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు సహా 10 మందిని అరెస్టు చేసినట్టు సీఐడీ, అసోం పోలీసులు ఆదివారం తెలిపారు.

పోలీసులు, విద్యార్థుల కథనం ప్రకారం... గౌహతి యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న గణేష్ లాల్ చౌదరి కాలేజీకి చెందిన విద్యార్థి మార్క్‌షీట్‌లో తేడాపై విచారణతో ఈ స్కామ్ బయటపడింది. విద్యార్థి అజీజుల్ హక్ మార్క్‌షీటుపై కాలేజీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విద్యార్థి వాస్తవంగా పొందిన మార్కుల కన్నా మార్క్‌షీట్‌లో ఎక్కువ మార్కులు ఉన్నట్టు నిర్ధారణ అయినట్టు పేర్కొంది. విచారణలో .. విద్యార్థి మొదటి, మూడు, నాలుగు, ఐదవ సెమిస్టర్‌లలో మార్కుల మార్పునకు రూ.10,000 చెల్లించినట్టు అంగీకరిం చాడు. డిజిటల్ ట్యాంపరింగ్‌తో కొంతమంది ఈ స్కామ్‌కి పాల్పడుతున్నారని తేలింది. ఈ విషయం వెలుగుచూడటంతో సీఐడీకి దర్యాప్తును అప్పగించారు. యూనివర్సిటీలోని వివిధ విభాగాలకు చెందిన కొందరు ఉద్యోగులు ఈ మోసాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు తెలిపారు. యూనివర్సిటీలో ఏజెంట్లను పెట్టారని, వారు విద్యార్థులతో మాట్లాడతారని, ఎక్కువ మార్కులకు ఎక్కువ ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారని చెప్పారు. బార్‌పేటలో ఆరు కేసులు వెలుగు చూశాయని, అదే ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి ప్రధాన నిందితుడిని, అతనిని అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. గౌహతి విశ్వవిద్యాలయం ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐయుఎంఎస్)ని థర్డ్‌పార్టీకి ఆపరేటర్‌కి అవుట్ సోర్స్ కింద ఇచ్చినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐటీఐ లిమిటెడ్ అనేది డేటా ఎంట్రీ బాధ్యత వహించే కేంద్ర ప్రభుత్వ సంస్థ అని, ట్యాంపరింగ్ జరిగినట్టు ఆ వర్గాలు తెలిపాయి. తాజాగా అరెస్టు చేసిన పదో నిందితుడు అడ్వకేట్ అని, అతనిని ఇంటరాగేట్ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. బార్‌పేట, ధుబ్రి, కమ్‌రూప్ (మెట్రో), నాగావ్ జిల్లాల నుంచి నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ స్కామ్‌లో మార్కులను కంప్యూటరైజ్డ్ చేసే సెక్షన్‌కు చెందిన క్రిషన్ కృష్ణమూర్తి ప్రధాన నిందితుడని, అతనిని ఇప్పటికే అరెస్టు చేశామని చెప్పారు. అతనితోపాటు అజీజుల్ హక్, ఇస్మాయిల్ హుస్సేన్, అలంగీర్ ఖాన్, మొయినుల్ హక్, హమేజుద్దీన్, అబుల్ బాసర్, అమీనుల్ ఇస్లాం, శివతోష్ మహతోను అరెస్ట్ చేశామని చెప్పారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, అరెస్టుల సంఖ్య పెరిగే అవకాశముందని సీఐడీ అధికారులు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐయుఎంఎస్)కు చెందిన ఓ ఉద్యోగి ఈ స్కామ్‌కు సూత్రధారి అని గౌహతి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రతాప్ జ్యోతి హండిక్ తెలిపారు.

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌కు కన్నీటి వీడ్కోలు



నవతెలంగాణ-ఉట్నూర్

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అంత్యక్రియలను ఆదివారం నిర్వహించారు. భౌతికంగా తమతో లేకపోయినా గొప్ప నాయకుడిగా తమ హృదయాల్లో ఎల్లప్పుడూ ఉంటారని ఈ సందర్భంగా పలువురు తెలిపారు. జెడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్దన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ గోడం నగేష్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఇతర రాజకీయ ప్రముఖులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్ నివాసం నుంచి ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని తమ వ్యవసాయ క్షేత్రం వరకు అంతిమయాత్రను నిర్వహించి, అక్కడ అంతక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడారు. రాథోడ్ రమేష్ లేరన్న వార్త జీర్ణించుకోలేక పోతున్నామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఒక గొప్ప నాయకుణ్ని కోల్పోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు పదవుల్లో జిల్లాకు చేసిన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని నలుములల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీగా అంతక్రియలకు హాజరయ్యారు. ఈ అంతక్రియల్లో ఎమ్మెల్యే పాయల శంకర్, జోగు రామన్న, మాజీ ఎంపీ సోయం బాపురావు, రాథోడ్ బాపు రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ నరేష్, ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్, శ్రీరామ్ జాదవ్, జాదవ్ గోపాల్‌రావు, నారాయణ్, ఈశ్వరి బాయి, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'తిరుపతమ్మ'ను దర్శించుకున్న డిప్యూటీ సీఎం



నవతెలంగాణ-మధిర

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. జనసేన నాయకులు లగడపాటి శంకర్ డిప్యూటీ సీఎంను అమ్మ వారి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం పెనుగంచిప్రోలులో ఎస్.నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మధిర ప్రముఖులు పాల్గొన్నారు.

టూరిజం కార్పొరేషన్ ఉద్యోగుల మెడపై కత్తి

- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేధింపులు
- చీటికిమాటికీ సస్పెన్షన్లు, మెమోలు
- రోడ్డున పడ్డ 30 మంది ఉద్యోగులు
- కోర్టు ఉత్తర్వులు సైతం బేఖాతరు
- ఏండ్ల తరబడి కుర్చీ వదలని హెచ్ఓడీలు
- పీకల్లోతు అవినీతిలో కార్పొరేషన్
- కొత్త సర్కార్‌పై ఉద్యోగుల ఆశలు

TELANGANA STATE TOURISM DEVELOPMENT CORPORATION LTD.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌టీడీసీ)లో పని చేస్తున్న ఉద్యోగుల మెడపై కత్తి పెట్టి ఉంటారా? పోతారా? అంటూ యాజమాన్యం నిత్యం వేధింపులకు గురి చేస్తున్నది. గత సర్కార్ హయాంలో పని చేసిన ఎండీ అవినీతి, అక్రమాలకు వత్తాసు పలకలేదని 30 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వారందరినీ తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు ఏండ్లు గడిచినా అమలుకు నోచుకోవడం లేదు. ఇరవై ఏండ్లుగా ఒకే చోట తిష్ట వేసిన హెచ్‌ఓడీలు, ఉన్నతాధికారులు చేస్తున్న అవినీతి అక్రమాలకు కింది స్థాయి ఉద్యోగులు బలౌతున్నారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

టీఎస్‌టీడీసీలో మొత్తం 800 మందికిపైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. అందులో 80 మంది రెగ్యులర్, 170 మంది కాంట్రాక్ట్, 300 మంది ఔట్ సోర్సింగ్, 100 మంది డైలీ వేజ్, 100 మంది కన్సల్టెంట్ , 70 మంది ట్రైనీ సిబ్బంది తమ విధులను నిర్వహిస్తున్నారు. టూరిజం హెూటళ్ల లీజు, పర్యాటక ప్రాంతాల్లో చేపట్టిన పనుల కాంట్రాక్టులు, ఇష్టారాజ్యంగా నిధుల ఖర్చు తదితర ఆరోపణలు గత సర్కార్ హయాంలో పని చేసిన ఎమ్‌డీ మనోహర్‌పై వెల్లువెత్తాయి. ఇందుకు సంబంధించి హైకోర్టు పలుమార్లు మొట్టికాయలు వేసిన సందర్భాలు న్నాయి. సంస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు వత్తాసు పలకడం లేదనే నెపంతో దాదాపు 30 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆయన సస్పెండ్ చేశారు. అదే క్రమంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా అధికార పార్టీకి మేలు చేస్తున్నారనే కారణంతో 2023 డిసెంబర్‌లో మనోహర్‌ను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. పాత ఎమ్‌డీ అసాధారణ నిర్ణయం వల్ల ఉద్యోగాలు కోల్పోయిన 30 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వీరిని తిరిగి ఉద్యోగంలోకి వెంటనే తీసుకోవాలని తెలంగాణ హైకోర్ట్ ఉత్తర్వులు ఇచ్చినా వాటిని అమలు చేయకుండా యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. వీరిని ఉద్యోగంలోకి తీసుకుంటే తమ తప్పులు ఎక్కడ బయట పడుతాయేమోననే భయంతో కొంతమంది ఉద్యోగులు అడ్డుపడుతున్నారని ఆరోపణలున్నాయి.

పాత ఎమ్‌డీపై అటకెక్కిన విచారణ

పాత ఎమ్‌డీ మనోహర్ అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వ అధికారం చేపట్టిన తర్వాత అంతర్గత విచారణ చేపట్టింది. టూరిజం హెూటళ్ల లీజు, పర్యాటక ప్రాంతాల్లో చేపట్టిన పనుల కాంట్రాక్టులు, ఇష్టారాజ్యంగా నిధుల ఖర్చు తదితర ఆరోపణలు అతనిపై వెల్లువెత్తాయి. ఇందుకు సంబంధించి కోట్లాది రూపాయల చేతులు మారాయనే ఆరోపణలున్నాయి. కొంతమంది అగ్రనేతల జోక్యంతో అతనిపై చేపట్టిన విచారణ మధ్యలోనే ఆగిపోయిందనే విమర్శలున్నాయి.

24 ఏండ్లుగా రెగ్యులర్‌కు నోచుకోని ఉద్యోగులు

మార్చి 2000 సంవత్సరంలో సంస్థలో పనిచేసిన డైలీవేజ్ ఉద్యోగులను రెగ్యులర్ చేశారు. ఆ తర్వాత 24 ఏండ్లుగా ఎవరినీ పర్మినెంట్ చేయలేదు. ఏండ్లు గడుస్తున్నా తమను క్రమబద్ధీకరించకపోవడం కార్మిక చట్టాలకు వ్యతిరేకమంటూ ఉద్యోగులు పలుమార్లు నిరసనలు, ఆందోళనలు చేసినా యాజమాన్యం పట్టించుకోలేదు. దాంతో ఉద్యోగులు కోర్టు తలుపు తట్టారు. 2010లో అప్పటి ఉమ్మడి హైకోర్టు (కేసు నెంబర్ 24/98) కార్పొరేషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. 2014లో తెలంగాణ ఏర్పడ్డ తర్వాత సంస్థ కూడా రెండుగా విడిపోయింది. ఇక్కడ పని చేసిన ఉద్యోగులందరినీ ఇక్కడ ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు కేటాయించారు. స్వరాష్ట్రంలోనైనా కోర్టు ఉత్తర్వులను అమలు చేసి తమకు న్యాయం చేస్తారని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ఎనిమిదేండ్లు గడిచినా సర్కార్‌లో చలనం లేకపోవడంతో తిరిగి 2019లో (కేసు నెంబర్ 19927 /19)) కోర్టును ఆశ్రయించారు. సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలని మరోసారి కోర్టు తీర్పు చెప్పింది. నాలుగేండ్లు గడిచిన తర్వాత సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ 2023లో యాజమాన్యం కోర్టుకెళ్లింది. (కేసు నెంబర్ 488 /23) లో కార్పొరేషన్ అప్పీల్‌ను విచారించిన ద్విసభ్య ధర్మాసం వీరికి అవసరమైన పోస్టులు లేకుంటే వెంటనే ఏర్పాటు చేసి వారిని పర్మినెంట్ చేయాలని కార్పొరేషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తీర్పు వెలువడి ఏడాది గడుస్తున్నా యాజమాన్యం గాని, సర్కార్‌గాని ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొత్తగా రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు న్యాయం చేస్తారని సిబ్బంది గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

ఘనంగా డిప్యూటీ మేయర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు డిప్యూటీ మేయర్‌ను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, బాల్ లింగని జంగయ్య, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డీఈఈ జ్యోతి, శ్రీను, మసూద్ భాయ్, మహమూద్ భాయ్, సుధాకర్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ- వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్‌లోని వెంకటరమణ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం స్థానిక కార్పొరేటర్ రావుల చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్పొరేటర్ వెంట వెంకటరమణ కాలనీ అధ్యక్ష, కార్యదర్శి, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

రూ.8.5లక్షల గంజాయి స్వాధీనం







నవతెలంగాణ- నాగోల్

విశ్వసనీయ సమాచారం మేరకు అంతరాష్ట్ర మాదకద్రవ్యాల రాకెట్‌ను ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసుల బృందం, నాగోలు పోలీసులు కలిసి ఆదివారం ఛేదించారు. ఈ ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పైపాడుకు చెందిన బోయినపల్లి సురేష్ అనే వ్యక్తి ఆదివారం ఉదయం ఏపీ22జీ0676 800 మారుతి కారులో గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే అతన్ని పట్టుకుని అతని వద్ద నుంచి రూ.8.5లక్షలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

నిందితుడు బోయినపల్లి సురేష్ విజయవాడలో పుట్టి పెరిగి క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనిపై ఖమ్మం జిల్లా భద్రాచలం పోలీస్ స్టేషన్లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఒక కేసులో నిందితుడని తెలిపారు. ఆ కేసులో తనతో పాటు ఉన్న ఒక పాత నేరస్తుడితో పరిచయం పెంచుకున్నాడు. సదరు నేరస్తుడు త్వరగా డబ్బులు సంపాదించాలంటే గంజాయి రవాణా చేయాలని నిందితుడు సురేష్‌కు సూచించాడు. దీంతో గంజాయి విక్రయదారులు నిజామాబాదుకు డెలివరీ చేయాలని 31.2 కేజీల గంజాయితో కూడిన మారుతి 800 కారును సురేష్‌కు అప్పగించారు. తనిఖీల సమయంలో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు నిందితులు గంజాయి ప్యాకెట్లను గ్యాస్ ట్యాంకులో ప్రత్యేకంగా రూపొందించి దాచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ఏపీ 22జి 0676 మారుతి కారుని, నిందితుడు సురేష్‌ను పట్టుకొని.. అతని వద్ద ఉన్న 31.2 కేజీల గంజాయిని, కారు, ఒక మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి విలువ రూ.8.5లక్షలు ఉంటుందని అన్నారు. సురేష్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. విక్రయదారులు, కొనుగోలుదారులను పట్టుకోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు.

ఓల్డ్ సిటీ

విద్యుత్ నిర్వహణను అదానీ కంపెనీకి ఇవ్వొద్దు

- సంతోష్ నగర్ చౌరస్తాలో సీపీఐ(ఎం) భారీ నిరసన ర్యాలీ
- బీజేపీ, కాంగ్రెస్ సర్కార్ల విధానాలపై ఆగ్రహించిన సీపీఐ(ఎం)



నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఓల్డ్ సిటీ విద్యుత్ నిర్వహణను అదానీ కంపెనీకి ఇవ్వాలన్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కే.ఈశ్వర్ రావు అన్నారు. స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం నుండి సంతోష్ నగర్ చౌరస్తా వరకు సీపీఐ(ఎం) శ్రేణులు ఆదివారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ ప్రయివేటీకరణ సంస్కరణలను అమలు చేయడానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అత్యుత్సాహం ప్రదర్శించడం సరికాదని అన్నారు. తక్షణమే ఆ నిర్ణయాలు ఆపకపోతే గత టీడీపీ ప్రభుత్వానికి పట్టిన గతి పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలోని 9 విద్యుత్ సర్కిళ్లను మొదటి దశగా ప్రైవేటు అదానీ కంపెనీకి అప్పగించాలని రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు ఢిల్లీలో చేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన ద్వారా తెల్సిందన్నారు. ప్రజలు ఇప్పటికే అనేక భారాలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్కరణ బిల్లు -2020 పేరుతో కేంద్ర బీజేపీ తెచ్చిన చట్టానికి వ్యతిరేకంగా 15 నెలలపాటు దేశ రైతాంగం పోరాటం చేసిన ఫలితంగా తాత్కాలికంగా అమలు చేయడం ఆపారని, ఎన్నికలు ముగిసిన వెంటనే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర బీజేపీ సర్కార్ ఒత్తిడి చేస్తున్నదని ఆరోపించారు. ఇక్కడి ప్రజలు ఎన్నో ఆశలతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. మరోవైపు దేశంలోని సహజ వనరులన్నీ గుప్పిట్లో పెట్టుకొని దోపిడీ చేసే అదానీ కంపెనీతో రహస్యంగా ఒప్పందాలు చేసుకొని కాంగ్రెస్ సర్కార్ తప్పు చేస్తుందన్నారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీజీఎస్‌పీడీసియల్ పరిధిలోని ఓల్డ్ సిటీ పరిధిలో గల సౌత్ సర్కిల్ నిర్వహణను అదానీ కంపెనీకి ఇవ్వనున్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయని గుర్తుచేశారు. ఈ నిర్ణయం ఇక్కడి ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తున్నదని, ప్రజలు ఉద్యమబాట పట్టకముందే ప్రభుత్వం పునరాలోచన చేయాలని హితవు పలికారు. ఈ నిరసన ర్యాలీలో సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.నాగేశ్వర్, ఎల్.కోటయ్య, ఎం.మీన, కార్యవర్గ సభ్యులు ఎం.బాలు, ఎం.శ్రావణ్, కే.జంగయ్య ఎస్. కిషన్, బాబర్ ఖాన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'సీనియర్ సిటిజన్స్ భవనంలో

గ్రంథాలయం, వైద్య శిబిరం ఏర్పాటు'



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ శ్రీనివాసపురం కాలనీలోని సీనియర్ సిటిజన్స్ భవనంలో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో నూతన గ్రంథాలయం, ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రావుల వెంకటేశ్వర్ రెడ్డి, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ ఉపాధ్యక్షుడు పానుగంటి ప్రతాపరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క సీనియర్ సిటిజన్స్ ఫోరం వాళ్ల గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అమోర్ హాస్పిటల్ కూకట్ పల్లి డాక్టర్ కె సి గౌతంరెడ్డి, జనరల్ ఫిజీషియన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి దాదాపు 80 మంది హాజరైనట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి బి. శ్రీరాములు నేత, కోశాధికారి జై మురళీధర్, ఎం అంజిరెడ్డి, ఎస్ శ్రీరాములు, ఎం గోవర్ధన్ నేత, ఎస్ నరసింహారెడ్డి, టి బాలచందర్ శ్రీనివాసపురం కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కె నరసింహారెడ్డి, పి ప్రసాద్, సిహెచ్ సత్యనారాయణ, జి శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు హర్షనీయం

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం

హరిహర పురం కాలనీలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయం అని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని హరిహర పురం కాలనీలోని వెల్ఫేర్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ సాయి నేత్రాలయ కంటి హాస్పిటల్ బీఎన్‌రెడ్డి వారి నేతృత్వంలో డాక్టర్ డి. సంతోష్ సమక్షంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాన్ని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రీ నేత్రాలయ కంటి ఆస్పత్రి వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం డాక్టర్ సంతోష్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో దాదాపు 100 మంది పరీక్షలు చేయించుకున్నారన్నారు. వారికి మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. 15 మందికి ఉచితంగా ఆపరేషన్ చేయడానికి హాస్పిటల్‌కు పంపించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, కార్యదర్శి జనార్దన్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు శంకర్ గౌడ్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు స్వతంత్ర రెడ్డి, కార్యదర్శి ఈశ్వరరావు, సంజీవరెడ్డి, డి రాములు, పార్టీ చేనేత మోర్చా కన్వీనర్ రఘురాం నేత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రజ ఆస్పత్రి ఆధ్వర్యంలో 3కే రన్







నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రాణం పోసేవాడు దేవుడైతే.. ఆ ప్రాణాలను నిలబెట్టి పునర్జన్మను ఇచ్చేవారు డాక్టర్స్ అని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ఆదివారం నాగోల్‌లోని సుప్రజ ఆసుపత్రి నుండి అల్కాపురి చౌరస్తా వరకు 3కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చే పేషెంట్స్‌కు మేం ఉన్నామని భరోసా ఇచ్చి ప్రాణాలను కాపాడే దేవుళ్లు డాక్టర్స్ అని కొనియాడారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడారని గుర్తుచేశారు. అన్నీ వృత్తులలో కెల్లా వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని అన్నారు. సుప్రజ హాస్పిటల్ యాజమాన్యం అతి తక్కువ ఖర్చులతో క్వాలిటీ వైద్యాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ రోజుల్లో హాస్పిటల్‌కు వెళ్లాలంటే సామాన్యుడు భయపడే రోజుల నుండి మేం ఉన్నామని భరోసా ఇచ్చి అతి తక్కువ ఫీజులతో మంచి వైద్యాన్ని సుప్రజ ఆస్పత్రి అందిస్తుందన్నారు. సుప్రజ ఆస్పత్రి ఎండీ సిగ విజయకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కనిపించే దేవుడికి రూపం ఉందా అంటే తాను డాక్టర్స్‌ను చూపిస్తానని అన్నారు. ప్రతిరోజు వారు చేసే సేవల్ని తాను దగ్గరుండి చూస్తుంటే వైద్యులకు ఉండే బాధ్యత ఎంత గొప్పదో నాకు అర్థమైందని అన్నారు. తమది ప్రైవేట్ ఆస్పత్రి అయినప్పటికీ ఉచిత సేవలు కూడా అందిస్తున్నామని తెలిపారు. ముందు కూడా ప్రజలకు సేవ చేసేందుకు మా హాస్పటల్ సిబ్బంది ఎప్పుడూ ముందుంటామని అన్నారు. కొందరు బాధ్యతారహితంగా డాక్టర్లపై భౌతిక దాడులు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ డాక్టర్లను గౌరవించాలని అన్నారు. డాక్టర్స్ కూడా బీధాన్ చంద్ర రాయ్‌ని స్ఫూర్తిగా తీసుకొని సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య గౌడ్, ఎక్సైజ్ ఏసీపీ గణేష్, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ బాల లక్ష్మి, మార్కెటింగ్ జీఎం సిగ అజయ్ కుమార్ గౌడ్, కార్పొరేట్ మార్కెటింగ్ మేనేజర్ వి. ప్రభాకర్, ఆరోగ్యశ్రీ జీఎం బి. విక్రమ్, జీఎం సతీష్, లోకేష్, డాక్టర్స్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబంధు అమలుపై ప్రత్యేక సమావేశం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రామంలో ఉన్న రైతు సహకార సంఘం బ్యాంకు కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం రైతులతో రైతు బంధు అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ది భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ నాయకత్వంలో రైతు బంధు పథకంలో ఒకే సారి రూ.2లక్షలు మాఫీ చేయడం శుభ పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాంకు అధికారి దాత్రి దేవి, వైస్ చైర్మెన్ బంగారు బాబు, మాజీ చైర్మెన్ పి.పుల్లారెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు ఏల్చల సుదర్శన్ రెడ్డి, టి.గిరిరాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాల సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయం



నవతెలంగాణ-నాగోల్/ పెద్ద అంబర్‌పేట్

గాన గంధర్వుడు బాల సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయం అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఎల్‌వీటీ మ్యూజిక్ గ్రూప్ సమర్పించు పద్మభూషణ్ బాల సుబ్రహ్మణ్యం 78వ జయంతి సందర్భంగా సినీ సంగీత మధుర గీతాలాపన బాలు గళం చిరస్మరణీయం స్పందన హెూం ఆధ్వర్యంలో తట్టి అన్నారంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దిగ్గజ గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పాడిన పాటలు నిత్యం బాలును గుర్తు చేస్తూనే ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ దైవజ్ఞశర్మ, పెద్ద అంబర్ పేట మున్సిపల్ వైస్ చైర్మెన్ చామ సంపూర్ణ విజయ్ శేఖర్ రెడ్డి, 16వ వార్డ్ కౌన్సిలర్ గీత వేణు గోపాల్ రెడ్డి, స్పందన హెూం డైరెక్టర్ ఉత్తమ్ కుమార్, పవన సాయి హాస్పిటల్ చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, నళిని శ్రీదేవి, సంతోష్, శ్యామల, ప్రభాకర్ గాయనీలు మాధురి, జయలక్ష్మి, శిల్ప, లక్కీ పాల్గొన్నారు.



హస్తినాపురం డివిజన్ నందనవనం సీపీఐ(ఎం) పార్టీ శాఖ సమావేశాన్ని జూలై 2న నిర్వహిస్తున్నట్టు శాఖ కార్యదర్శి మంథని యాదయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఏం.చంద్ర మోహన్‌లు హాజరవుతున్నారని యాదయ్య తెలిపారు.

నవతెలంగాణ - హస్తినాపురం

2న సహకార సంఘం సమావేశం

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

బాటసింగారం రైతు సేవ సహకార సంఘం ప్రత్యేక సమావేశాన్ని సంఘం చైర్మెన్ చేగూరి భరత్ కుమార్ అధ్యక్షతన జూలై 2న నిర్వహించనున్నట్లు సంఘం ఇంచార్జి మేనేజర్ రాకేష్ గౌడ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో రైతుబంధు స్కీమ్‌పై చర్చించి.. సంఘం సభ్యుల సూచనలు, సలహాలు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపవలసిందిగా జిల్లా సహకార అధికారి ఆదేశాలు ఆదేశించడమైనదని ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం సభ్యులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నాగోల్ ఎస్‌హెచ్‌ఓగా సుధీర్ కృష్ణ



నవతెలంగాణ -నాగోల్

నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా సుధీర్ కృష్ణ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల నాగోలు ఎస్‌హెచ్‌గా పనిచేసిన పి. పరశురాం రాచకొండ కమిషనర్ కార్యాలయానికి అటాచ్ కాగా.. పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో డీఐగా పనిచేసిన సుధీర్ కృష్ణ నాగోల్ పీఎస్‌కు ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యారు. 2009వ బ్యాచ్‌కు చెందిన సుధీర్ కృష్ణ ఎస్ఐగా మాదాపూర్ కుషాయిగూడ ఉప్పల్ తో పాటు పలు పోలీస్ స్టేషన్లలో పని చేశారు. అదేవిధంగా బాలాపూర్ కీసర పోలీస్ స్టేషన్‌లో డీఐగా భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా, మల్కాజ్గిరి పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ గా విధులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు ప్రజలకు సత్సంబంధాలు మెరుగుపరుచుకుని స్నేహభావంతో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఏ సమస్య వచ్చినా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. చట్టపరమైన చర్యలు తీసుకొని వారికి న్యాయం చేకూర్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు.

'సమస్యలపై విద్యార్థులు పోరాటం చేయాలి'



నవతెలంగాణ-హయత్ నగర్

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విద్యార్థులు చదువుతో పాటుగా విద్యా సమస్యలపై పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అఖిల భారత విద్యార్థి సమైక్య రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ మండలం నిర్మాణ మహాసభ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభకు ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. శివకుమార్, సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్ రెడ్డి, హయత్ నగర్ మండల సీపీఐ పార్టీ సహాయ కార్యదర్శి రామావత్ సక్రు నాయక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ చదువుతో పాటు విద్యారంగ సమస్యలపైన ఐక్య పోరాటాలు నిర్వహించడానికి భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. నాణ్యమైన విద్య కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. హయత్‌నగర్ మండల కార్యదర్శిగా బి. అరుణ్ కుమార్ గౌడ్, అధ్యక్షులుగా కే మణికంఠ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.బన్నీ, ఉపాధ్యక్షులుగా ఈ. ఉపేందర్, జి.గణేష్, సహాయ కార్యదర్శిగా వి.శివ, జి.వరుణ్, జి.లక్ష్మణ్ మరియు జాయింట్ సెక్రటరీగా జె. భాను ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజ్, వరుణ్ కుమార్, యశ్వంత్, రామకృష్ణ, కామల్నాథ్, వంశీ, వేణు, శివ, ప్రసన్న కుమార్, ప్రసాద్, వరుణ్ కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

చంపాపేటలో అత్యాధునిక కార్డియాలజీ ఆస్పత్రి



నవతెలంగాణ- సంతోష్ నగర్

హైదరాబాద్ నగరంలోని చంపాపేట ప్రాంత వాసులకు అత్యున్నత స్థాయి గుండె వైద్య చికిత్సలు అందించేందుకు ఓనస్ రోబోటిక్, కార్డియాక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో కొత్తగా అత్యాధునిక కార్డియాలజీ విభాగాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రణాళికా మండలి వైస్ చైర్మెన్ చిన్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వ్యవస్థాపకుడు, ఎండీ డాక్టర్ బాలరాజు నాయుడు మాట్లాడుతూ.. 'ఈ విభాగంలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. అత్యంత నైపుణ్యం కలిగిన కార్డియాలజిస్టులు, నర్సులు, టెక్నీషియన్ల బృందంతో ఇక్కడ అత్యుత్తమ స్థాయి చికిత్సలను రోగులకు అందిస్తామన్నారు. రోజువారీ పరీక్షలతో పాటు నాన్ ఇన్వేజివ్ చికిత్సలు, సంక్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సలు, ఇంటర్వెన్షనల్ ప్రొసీజర్లు అన్నీ ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటివరకు ఈ ఆస్పత్రిలో 6,500కు పైగా శస్త్రచికిత్సలు, 1.35 లక్షల మంది రోగులకు చికిత్సలు అందించినట్టు పేర్కొన్నారు. అనంతరం కార్డియాలజీ విభాగాధిపతి, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ లక్కిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..ఆస్పత్రిలో ఇంకా ఎలక్ట్రో ఫిజియాలజీ సేవలు, కార్డియాక్ రీహాబిలిటేషన్, 24/7 ఎమర్జెన్సీ చికిత్సలు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. 2018లో 30 పడకల ఆస్పత్రిగా ప్రారంభమైందన్నారు. 2019లో దేశంలోనే తొలిసారిగా ఓనస్ హాస్పిటల్ ఆన్ వీల్స్ ప్రారంభించినట్టు తెలిపారు. 2020లో 30 పడకల నుంచి 50 పడకలకు విస్తరించి, ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ సేవలనూ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ఎస్.ప్రకాష్ రెడ్డి ఐపీఎస్, యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కార్పొరేటర్లు శ్వేతా మధుకర్ రెడ్డి, వంగా మధుసూదన్ రెడ్డి, సబితా రాజశేఖర్ రెడ్డి, దరిపల్లి రాజశేఖర్ రెడి, మాజీ కార్పొరేటర్ స్వప్నా సుందర్ రెడ్డి, డాక్టర్ల బృందం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సీనియర్ సిటిజన్స్

నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్‌లోని అభ్యుదయ నగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పార్కులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ ప్రధాన సలహాదారుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి ప్రతాపరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్క కాలనీలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ఉండాలని సూచించారు. ఈ ఫోరం వలన ఐక్యత, పరస్పర సహకారానికి నాంది పలుకుతుందన్నారు. అభ్యుదయ నగర్ సీనియర్ సిటిజన్స్ జూన్ నెలలో పుట్టినరోజు వచ్చిన అందరి చేత చివరి ఆదివారం కేక్ కట్ చేయించారు. తర్వాత శాలువాతో సత్కరించారు. అభ్యుదయ నగర్ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు బి. జయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నెల చివరి ఆదివారం ఆ నెలలో పుట్టిన రోజు వచ్చే సీనియర్ సిటిజన్ అందరికీ కూడా ఇదే విధంగా జరుపుతామని పేర్కొన్నారు.అభ్యుదయ నగర్ పార్కులో దాదాపు 30 మొక్కలను నాటినట్లు తెలిపారు. అభ్యుదయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. గంగారెడ్డి మాకు ఎల్లవేళలా ఆదుకుంటూ చేదోడు వాదోడుగా ఉంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్. ప్రభాకర్ రాజు, సీనియర్ సిటిజన్స్ కే ఆర్ కే ప్రసాద్, కే సీతారామయ్య, జి నాగయ్య, ఆర్ లక్ష్మీకామేశ్వరి, ఎల్ ఎల్ గంగారాం, ఎం పద్మ, ఎస్ వి దాసు, సిహెచ్ రామకృష్ణారావు, ఎన్ హనుమంతరావు, సీనియర్ సిటిజన్స్, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
సోమవారం | జూలై 01, 2024 | www.navatelangana.com

కూకట్‌పల్లి సీఐగా కొత్తపల్లి ముత్తు



నవతెలంగాణ-కూకట్‌పల్లి
కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొత్తపల్లి ముత్తు ఆదివారం రోజున బాధ్యతలు తీసుకున్నారు. కాగా కూకట్‌పల్లిలో సీఐగా విధులు నిర్వర్తించిన కృష్ణ మోహన్ మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సీఐగా సైబరాబాద్‌లో కొత్తపల్లి ముత్తు విధులు నిర్వర్తించారు. ఇప్పుడు కూకట్‌పల్లి సీఐగా బాధ్యతలు తీసుకున్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి
ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో గల ముస్లిం స్మశానవాటికను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముస్లిం స్మశానవాటికలో ప్రస్తుతం ముఖద్వారం ఆర్చ్, ప్రార్థన హాల్ నిర్మాణం పూర్తయ్యాయని అన్నారు. స్మశాన వాటిక చుట్టూ నిర్మిస్తున్న రిటర్నింగ్ వాల్ నిర్మాణం కొంతమేర పెండింగ్ ఉందని, దానిని కూడా త్వరలో పూర్తిచేస్తామని అన్నారు. స్మశాన వాటికలో చెట్లు నాటి రోడ్డు వేసి, సుందరీకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, ఫారూఖ్, ఖాజా, ఖాజా మియా, సమ్మద్, వాసుదేవరావు పాల్గొన్నారు.

'స్థానికం' ఇప్పట్లో లేనట్టే..!



- బీసీ కులగణన తర్వాతే రిజర్వేషన్ల ఖరారు
- అక్టోబర్ లేదా జనవరిలో ఎన్నికలకు ఛాన్స్..!
- ఈ నెల మొదటి వారంలో ముగియనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం
- ఇప్పటికే పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన

నవతెలంగాణ-సిటీబ్యూరో
లోక్‌సభ హడావుడి ముగిసింది. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలంటూ ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రకటన పల్లె పోరులో పోటీ చేయాలనుకునే వారిలో ఆశలు రేకెత్తించింది. దీంతో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పని చేసి, నేతల మన్ననలు పొందారు. ఫిబ్రవరి 1వ తేదీకి సర్పంచుల పదవీకాలం ముగియడంతో.. అంతకుముందే నూతన ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందని అందరూ భావించారు. కానీ, ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగిస్తుండటంతో ఎన్నికల నిర్వహణకు మరికొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ముగియనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 5 మండలాలు, 61 గ్రామ పంచాయతీలు, ఒక జిల్లా పరిషత్ ఉన్నాయి. ఇప్పటికే అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. కాగా ఈ నెల మొదటి వారంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీల సభ్యుల పదవీ కాలం సైతం ముగియనుంది. దీంతో అటు గ్రామ పంచాయతీలు, ఇటు మండలాల్లోనూ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. గతంలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించారు. మొదట సర్పంచ్, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఎన్నికలు జరిపారు. ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ఈ నెల 3వ తేదీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం ఈ నెల 5వ తేదీ వరకు మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో సర్కార్ ప్రత్యేకాధికారుల పాలన వైపే మొగ్గు చూపుతుండటంతో, ఈసారి మూడు ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

బీసీ కులగణనే అడ్డంకి..

స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన బీసీ కుల గణన అంశం ప్రధాన అడ్డంకిగా మారింది. ఎన్నికలకు ముందే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కులాల లెక్కలు తేల్చాలని, సమగ్ర కుటుంబ సర్వే తరహాలో యుద్ధప్రాతిపదికన ఇంటింటా సర్వే చేపట్టాలన్న డిమాండ్లు బీసీ సంఘాల నుంచి వస్తున్నాయి. వీటికి సర్కారు తలొగ్గితే బీసీ కులగణన చేపట్టాలని బీసీ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేస్తుంది. సమగ్ర కుటుంబ సర్వే తరహాలో ఇంటింటి సర్వే చేస్తారా..? లేక జిల్లాల వారీగా తేలుస్తారా..? అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఆరు నెలల కాలంలోనే వరుస ఎన్నికలతో అధికారులు బిజీబిజీగా ఉండటంతో పాలనా వ్యవస్థ కుంటుపడిందన్న విమర్శలున్నాయి. ఇలాంటి తరుణంలో పంచాయతీ సమరానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపితే మూడు దఫాలుగా గ్రామపం చాయతీ ఎన్నికలు, మరో రెండు దఫాలుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల పరిపాలన గాడి తప్పుతుందని సర్కారు భావిస్తే, ఎన్నికలను వాయిదా వేసి మండలాలు, జిల్లాలోనూ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగించనున్నారు. ఇదే జరిగితే ఈ ఏడాది అక్టోబర్ తర్వాతే లేదా వచ్చే ఏడాది జనవరిలో 'స్థానిక సంస్థల' ఎన్నికలు ఉండే అవకాశం ఉంది.

కులగణనతో మరింత ఆలస్యం..

ప్రభుత్వం కులగణన ప్రారంభిస్తే పూర్తవడానికి సుమారు రెండు నెలల సమయం పడుతుంది. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్న ఆలోచన చేస్తే ఎలక్షన్లు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రానున్న స్థానిక సమరంలో రిజర్వేషన్ల ప్రక్రియ ఎలా ఉంటుందనే విషయమై నాయకులు ఇప్పటి నుంచే లెక్కలేసుకోవడం మొదలు పెట్టారు.

నేతలకు తలనొప్పి..

వరుస ఎన్నికలు రాజకీయ పార్టీల నేతలకు తల నొప్పిగా మారనున్నాయి. శాసనసభ, పార్లమెంట్ ఎలక్షన్లు మొదలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వరకు కార్యకర్తలను, ద్వితీయ శ్రేణి నాయకులను పార్టీ మారకుండా చూసుకోవడం, వారిని వెంట తిప్పుకోవడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. దీంతో ఇప్పుడే మళ్లీ ఎన్నికలంటే రాజకీయంగాను కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో సర్కార్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఇండ్లు లేని వారికి భూములు పంచాలి



- సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
ఖమ్మంలో జరుగుతున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ పాల్గొని ఇండ్లు లేని వారికి భూములు పంచాలని మాట్లాడారు. ఈ సమావేశాలకు జాతీయ కార్యదర్శి కే.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్యాతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారి సమస్యలను పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ 100 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉత్సవాలను నిర్వహించాలని, పార్టీని బలోపేతం చెయ్యాలని,ఆర్‌టీసీని బలోపేతం చెయ్యాలని తెలిపారు. రైతు భరోసాను వెంటనే అమలు చెయ్యాలని రాష్ట్ర సమితి సమావేశాలో డిమాండ్ చేశారు.

కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం హర్షనీయం

- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షనీయమని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిలియన్ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసయడం ఆ ప్రాంత ప్రజల చిర కాల వాంఛ అన్నారు. ఈ సమస్యపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు అటు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కి ఇటు ప్రధాన మంత్రి మోడీ దృష్టికి తీసుకెళ్లారన్నారు. స్వయంగా తనే ప్రధానమంత్రిని ప్రత్యక్షంగా కలిసి సమస్యను ఆయనకు విన్నవించారన్నారు. రక్షణ శాఖ ప్రధానమంత్రి సానుకూలంగా స్పందించి, కంటోన్మెంట్ బోర్డులని రద్దుచేసి స్థానిక పురపాలక సంఘాల్లో విలీనం చేయాలని శనివారం నిర్ణయించారన్నారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను ఇప్పటికైనా తొలగించి, కంటోన్మెంట్ బోర్డును రద్దుచేసి పురపాలక సంఘాల్లో కలపటం హర్షణీయమన్నారు. దీనికి విశేషంగా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తలుచుకుంటే సాధించలేనిది ఏది లేదని నిరూపించారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కోలన్‌ను కలిసిన కాలనీ వాసులు



నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12 డివిజన్ బాలాజీ హిల్స్‌కు చెందిన కాలనీవాసులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి తమ కాలనీలో ఉన్న సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ బాలాజీ హిల్స్ కాలనీలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. అధికారులతో మాట్లాడి ఎటువంటి సమస్యనైనా తక్షణమే పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీలోని పెద్దలు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన దేవాలయాల కమిటీ సభ్యులు...

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలోని నల్ల పోచమ్మ, శివాలయం కమిటీ మెంబర్స్ ఆలయ ధర్మకర్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని ఆదివారం కలిశారు. ప్రతి సంవత్సరంలాగ బోనాల పండుగ మహోత్సవం నిర్వహించడం పై మాట్లాడారు. ఈ సందర్భంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని అమ్మవారి దయ ఉంటే బాధలన్నీ తొలగి అన్ని సమకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ -పితాని శ్రీనివాసరావు, వైస్-ప్రెసిడెంట్ లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ - కుమార్ రెడ్డి జాయింట్ సెక్రెటరీ -వరికుప్పల దశరథ్, ట్రెజరర్- వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ- వివి రమణ, కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా... ప్రజా సేవలో ఉంటూ.. ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేని కలిసి పలు వినతులు, ఆహ్వానాలు అందజేశారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్ పనులను పూర్తి చేసుకోవడంతో పాటు నూతన పనులకు శంకుస్థాపన చేశానని తెలిపారు.

'వి అస్థెటిక్స్ క్లినిక్స్' ను ప్రారంభించిన ఎమ్మెల్యే..

జీడిమెట్ల132 డివిజన్ పేట్ బషీరాబాద్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 'వి ఆస్థిటిక్స్ క్లినిక్' ను ఆదివారం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, డాక్టర్ రామస్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ ఈ హాస్పిటల్ దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువత అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు అనిల్, పెద్ది మల్లేశం, కుంట సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం..

దుండిగల్ :సీసీరోడ్డు పనులు చేపట్టాలని రాజీవ్ గాంధీ నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్ కొంపల్లిలోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి సుజాత ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ నగర్ కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ని కలిసి మోడ్రన్ టాయిలెట్‌ల నుంచి సాయిబాబా దేవాలయం వరకు సీసీ రోడ్డు, అంగన్వాడి సెంటర్ నందు అదనపు తరగతి గది, క్రీడా ప్రాంగణం ఏర్పాటుకై స్థలాన్ని కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద సీసీ రోడ్డుతో పాటు అంగన్వాడి సెంటర్లో అదనపు గది, క్రీడా ప్రాంగణం ఏర్పాటు పనులను అతి త్వరలోనే చేపడుతానని తెలియజేశారు.



సింధూ రావ్ బొటిక్" ను ప్రారంభించిన ఎమ్మెల్యే..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయభేరి పార్క్ అయాతి కాలేజ్ సమీపంలో సింధు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "సింధూర మ్యాచింగ్ సెంటర్ బొటిక్"ను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కుత్బుల్లాపూర్ మండల మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, జీహెచ్‌ఎంసీ డివిజన్ల అధ్యక్షులు రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.





సమస్యలు పరిష్కరించాలని మేయర్‌కు వినతి



నవతెలంగాణ-దుండిగల్
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డిని ప్రగతి నగర్ 4వ డివిజన్ నాయకులు, ఆయా కాలనీ వాసులు కలిశారు. ఈ సందర్భంగా వారి డివిజన్ పరిధిలో పెండింగ్ పనులు పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయగలరని ప్రజాస్వామ్య వాదుల ఐక్య వేదిక సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు సురేంద్ర కుమార్ యాదవ్, ఓంకార్, చంద్ర మోహన్ రెడ్డి, శ్రీనివాస్, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి
ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూకట్‌పల్లికి చెందిన నాగప్ప (70) తమ ఇంటి పక్కన నివాసం ఉండే మహిళ లక్ష్మిలు కలిసి ఐడిఎల్ చెరువు సమీపంలోని రంగనాథ స్వామి ఆలయానికి వెళ్తుండగా, కూకట్ పల్లిలోని మిలటరీ రాజన్న హోటల్ వద్ద క్రీట కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో, నాగప్ప, లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని ఆమోర్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు పరిశీలించగా నాగప్ప మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రిలో లక్ష్మి చికిత్స పొందుతున్నదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి
మూసాపేట్ డివిజన్ అవంతి నగర్ తోటలోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో 7వ వార్షికోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్, కూకట్‌పల్లి కార్పోరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సి.హెచ్ సత్యనారాయణ సాయినాథుని దర్శించుకున్నారు. కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉదయ్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట
సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీ గెలవడంలో అంబర్‌పేట నియోజకవర్గం కీలక పాత్రను పోషించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ సమావేశానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ అంబర్‌పేట అసెంబ్లీ మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు మాట్లాడుతూ బీజేపీని మరింత పటిష్టం చెయ్యాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి కృష్ణ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమాల ఆనంద్ గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, అజయ్ కుమార్, శ్యామ్ రాజ్, రమేష్ యాదవ్, నంద కిషోర్, కార్పోరేటర్లు అమృత, ఉమా రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మగ్దుమ్ నగర్‌లో సూచిక బోర్డు ఏర్పాటు



- ప్రారంభించిన యూత్ నాయకులు కొలుకుల జైహింద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దుంనగర్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు సూచిక బోర్డులను ఆదివారం డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆదేశాల మేరకు బి.ఆర్.ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూచిక బోర్డుల ను ఏర్పాటు చేయడం వలన ప్రతి ఒక్కరికి అడ్రస్ తెలుసుకోవడం సులభతరం అవుతుందన్నారు. ముఖ్యంగా అంబులెన్స్ లాంటి ఎమర్జెన్సీ సర్వీసులకే కాకుండా పోస్టల్ డిపార్ట్మెంట్ తదితర సర్వీసులకు సైతం చిరునామా వెతకడం చాలా సులభంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మగ్దుంనగర్ కమిటీ అధ్యక్షులు నిడిగొండ లక్ష్మణ్, మాజీ వార్డ్ మెంబర్.మహమూద్, స్థానిక నాయకులు మాదాసు శంకర్, రాయి రాజేష్, వినోద్ కుమార్, సత్య రాజు, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో నేషనల్ చాంపియన్ షిప్‌లో ఉత్తమ ప్రతిభ

నవతెలంగాణ-ముషీరాబాద్



నేషనల్ తైక్వాండో చాంపియన్షిప్ పోటీలలో హైదరాబాదుకు చెందిన రౌనక్ రాజ సింగ్ సహని ఉత్తమ ప్రతిభను కనబరించి గోల్డ్ మెడల్ సాధించారు. ఉత్తర ప్రదేశ్ కేడీ సింగ్ బాబు ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హెడ్ కోచ్ ట్రైక్వాండో టి.బాలరాజ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థి నేషనల్ ఛాంపియన్షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో గర్వకారణం

రైతు రుణమాఫీ హర్షణీయం..

● గోషామహల్ కాంగ్రెస్ నాయకులు ఆర్‌ఏ.వినోద్ కుమార్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన రెండు లక్షల రైతు రుణమాఫీ హామీని ఏకకాలంలో మాఫీ చేస్తున్నారని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆర్‌ఏ.వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం సుల్తాన్ బజార్‌లో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని, బడుగు బలహీనవర్గాలకు మేలు చేకూర్చే పార్టీ అని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన రైతు రుణమాఫీ ఇటీవల క్యాబినెట్‌లో ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కింద న్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలతో ముందుకెళ్తామన్నారు.

ప్రజలకు నష్టం కలిగే పనులు చేస్తే పోరాటం తప్పదు

● సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు జి.విఠల్

నవతెలంగాణ-ధూల్‌పేట్



ప్రభుత్వం ప్రజలకు నష్టం కలిగే పనులు చేస్తే పోరాటం తప్పదని సీపీఐ(ఎం) సౌత్ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు విఠల్ అన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో ఎంతో కష్టపడి పేద ప్రజలు కట్టుకున్న ఇండ్లను తొలగించే చర్యల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు స్థానిక ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా మూసీ పరిసర బస్తీల్లోని ప్రజల నివాసాలను కూల్చివేస్తామంటే ప్రభుత్వంపై పోరాడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పద్మనగర్ బస్తీలో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. సుందరీకరణ పేరుతో అనేక బస్తీలలో పేద ప్రజల ఇల్లు కూల్చడాన్ని సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తుందన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రజలను భయాందోళనకు గురి చేస్తుందన్నారు. వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న స్పందించడం లేదన్నారు. అభివృద్ధికి సీపీఐ(ఎం) పార్టీ వ్యతిరేకం కాదని కానీ ప్రజలకు నష్టం కలిగించే పనులు చేస్తే దానికి వ్యతిరేకమన్నారు. పేద ప్రజల పట్ల ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న పనులు ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ జనరల్ బాడీ కార్యక్రమంలో పద్మనగర్ బస్తీ అధ్యక్షులు నరసింహ చారి, బస్తీ నాయకులు పాల్గొన్నారు.

బోలక్‌పూర్ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలి

జిల్లా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో



ముషీరాబాద్ నియోజకవర్గంలోని బోలక్‌పూర్ డివిజన్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని బోలక్‌పూర్ డివిజన్ పరిధిలోని రంగానగర్, క్రాంతి నగర్, బోలక్‌పూర్, మజీద్ ప్రాంతాల్లో సంతకాల సేకరణ చేపట్టింది. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.డి జావిద్ ఈ ఏరియాలోని డ్రయినేజీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షం, నల్ల నీరు వచ్చిన డ్రయినేజీ పొంగి ఇండ్లలోకి నీళ్లు రావడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేసి రోడ్లు మొత్తం తవ్వి ఎక్కడికక్కడ వదిలేసి మరిచిపోయారని మండిపడ్డారు. సంబంధిత అధికారులు ఇక్కడ రోడ్ల పనులు ప్రారంభించాలన్నారు. బస్తీలలో గంజాయి సమస్య తీవ్రంగా ఉందని, గంజాయి తాగి మహిళలు, విద్యార్థులను వేధిస్తున్నారని తెలిపారు. వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రతి రోజూ అన్ని బస్తీలలో పెట్రోలింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్ స్పందించి.. వాటిని పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో డీవైఎఫ్ఐ అధ్యక్షులు హస్మి బాబు, నాయకులు వేణు, సల్మాన్, బస్తీ నాయకులు ఈశ్వర్ బాబు, కృష్ణ పాల్గొన్నారు.

కల్వకుంట్ల చంద్రసేన గుప్తా సేవలు మరువలేనివి

● ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి కొత్త జీవితాలను అందిస్తున్న వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ సేవా సంస్థకు బీజం వేసిన కల్వకుంట్ల చంద్రసేన గుప్తా (కేసీ గుప్తా) సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. ఈ మేరకు ఆదివారం ఇసామియా బజార్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కేసీ గుప్తా విగ్రహాన్ని దయానంద్ గుప్తాతో పాటు సంఘం అధ్యక్షులు అనిల్ కుమార్‌లతో కలిసి ఇసామియా బజార్‌లో ఆవిష్కరించారు. వాసవి క్లబ్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి అని, నేటి తరం ఆయనను ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేఖ ఓం ప్రకాశ్, వాసవి సేవా కేంద్రం జీవిత కాల సలహా దారులు అశోక్‌కుమార్, నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సరాబు లక్ష్మణ్, ఇసామియా బజార్ ఆర్యవైశ్య సంఘం ఎ.రవి కుమార్, కోశాధికారి లక్ష్మణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక దురాచారాలు, స్త్రీల హక్కులపై సదస్సు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ఈనాటి సమాజంలో ఒంటరి మహిళలు (వితంతు స్త్రీలు) పట్ల సాంఘిక దురాచారాలను విడనాడి వారి పట్ల వివక్ష చూపకుండా ఉండాలని పూలే ఫౌండేషన్ అడ్వైజర్ ఎం.సూర్యనారాయణ అన్నారు. హనుమాన్ డెకిడిలోని బీసీ సాధికారత భవన్‌లో పూలే ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రమీల అధ్యక్షతన సాంఘిక దురాచారాలు, స్త్రీల హక్కులపై రౌండ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ హైకోర్టు అడ్వకేట్ జీవీ ఎస్ లక్ష్మి తులసి, ఈఎస్ఐ ఆస్పత్రి అనిస్తీసియా డాక్టర్ కే.సంధ్య కొండూరు దేవి, బీసీ జస్టిస్ ఫ్రంట్ నాయకులు నారగోని, డాక్టర్ రామ్ నరసయ్య హాజరై మాట్లాడారు. సాంఘిక దురాచారాలను అరికట్టాలన్నారు. ఒంటరి మహిళ (వితంతు) మనుషులుగా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. భర్త చనిపోయిన స్త్రీలను మానసికంగా అవమానిస్తున్న కొంగర తీస్తున్న సాంఘిక దురాచారాల్లో ఒక్కటైన వితంతు చర్యను ఖండిస్తున్నామని పలువురు అన్నారు. శుభకార్యాల్లో ఆమె భాగస్వామ్యాన్ని అపశకునంగా భావించకుండా ప్రతి స్త్రీని మంగళకరంగా భావించి వాయనం ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. ఇలాంటి చర్యలపై ఒక చట్టాన్ని తీసుకురావడానికి అందరం కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా ఓ మహిళకు వాయనం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీపీ భవన్ ఇన్‌చార్జి ఇంద్రగంటి రమేష్ పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

'తెలంగాణ సైకాలజిస్ట్స్ కౌన్సిల్ వెంటనే ఏర్పాటు చేయాలి'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



సమాజంలో మానసిక ఆరోగ్యం ప్రధానమైన అంశంగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణలో సైకాలజిస్ట్స్ కౌన్సిల్ ను ఏర్పాటు చేయడం అత్యవసరమని, కావున వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్ నగర్ లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్ లో అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకుల ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ సైకాలజిస్టులకు ఒక భరోసా, భద్రత కల్పించడానికి ప్రభుత్వం కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గత ఏడు సంవత్సరాలుగా సైకాలజిస్టుల సమస్యలపై పోరాటం చేస్తున్నామని, మనస్తత్వ శాస్త్ర ప్రాముఖ్యతను ప్రభుత్వం, ప్రజలకు తెలిసేలా చేశామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నిసార్లు విన్నవించిన తమను పట్టించుకోలేదని, కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమ సేవలు, ప్రాధాన్యత రిత్యా సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరారు. మానసిక ఆరోగ్య నిపుణులకు ఒక కౌన్సిల్ ఏర్పడితే వారు మరింత సమర్థవంతంగా, సమన్వయంతో పని చేస్తారన్నారు. సైకాలజిస్టుల నిరంతర విద్య, ప్రొఫెషనల్ డెవలప్మెంట్ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుటకు, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన పరిశోధనలకు మరింత ప్రోత్సహించుట తదితర ప్రయోజనాలు కౌన్సిల్ ద్వారా అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, నాయకులు శ్రీకాంత్, బాల సుబ్రమణ్యం, రాజు ఆచార్య ఉమర్ ఖాన్, కృష్ణ, సాహితి, వైదేహి, సునయన, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులకు ఇచ్చిన హామీలను అమలుపరచాలి

● సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్

నవతెలంగాణ-ముషీరాబాద్



సంచార జాతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీలను అమరుపరచాలని సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కమిటీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఒంటెద్దు నరేంద్ర హాజరై వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సంచార జాతులకు ఐదు శాతం రిజర్వేషన్ విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కమిటీ చైర్మెన్ వై.వెంకటనారాయణ, వైస్ చైర్మెన్ సామన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నెల నాగరాజు, యూత్ రాష్ట్ర అధ్యక్షులు బండారి యువరాజ్, మహిళా అధ్యక్షురాలు దేవేందర్ సావిత్రి ,కోట అనిత, కోనేరు శ్రీనివాస్, పొన్నాల కుమార్, శ్యామల, యాదగిరి, శ్రీనివాస్, సురేందర్, ముత్తు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

● కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట



కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, 6 గ్యారంటీల పథకాలు అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంత మందికి అర్హులైన వారు కూడా ఉచిత కరెంటు రూ.500లకు గ్యాస్ సిలిండర్ కొన్ని అనివార్య కారణాలవల్ల రాలేకపోతున్నాయని అలాంటి వారందరూ స్థానిక జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ప్రజాపాలన దరఖాస్తు తీసుకొని వెళ్లి దానికి సంబంధించిన డాక్యుమెంట్లు అందజేసి అర్హులైన వారు లబ్ధి పొందవచ్చుని సూచించారు. పీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంత రావు, డీసీపీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి సూచనల మేరకు ప్రజలకు పార్టీకి వారధిగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా అండగా ఉండి వారికి సాయం చేయాలని సూచించారు.

25 వేల డీఎస్సీ మెగా టీచర్ల పోస్టులను భర్తీ చేయాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్



25 వేల డీఎస్సీ మెగా టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. టీచర్ పోస్టుల భర్తీకి బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్ అనంతయ్య అధ్యక్షతన ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగుల భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. స్కూల్ అసిస్టెంట్లు లేక పాఠశాలలు వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ర్యాంకుల సాధించాలని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా డీఎస్సీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 25వేల టీచర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు పీఆర్సీ కమిటీ రిపోర్ట్ లో పేర్కొందన్నారు. పదివేల మంది సెకండరీ గ్రేడ్ టీచర్ స్కూల్ టీచర్లు అసిస్టెంట్ ప్రమోషన్లు ఇస్తే ఇంకో 10 వేల పోస్టు వస్తాయని పది సంవత్సరాల కాలం నుంచి దాదాపు 6వేలకు పైగా పాఠశాలలు మూసివేశారని వీటిలోని టీచర్ పోస్టులు భర్తీ చేసి 22 వేల స్పెషల్ టీచర్ల నియమించడానికి ఆర్థిక శాఖ ఐదు నెలల క్రితం ఆమోదించిందన్నారు. టీచర్ పోస్టులు ఖాళీగా లేకపోతే స్పెషల్ టీచర్లు ఎందుకు నియమిస్తారని ప్రశ్నించారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 16 వేల పాఠశాలల్లో ఇంగ్లీష్, గణితం, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థులకు సబ్జెక్టుల విజ్ఞానం పరిజ్ఞానం లేక చదువులో వెనుకబడిపోతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తక్కువ పోస్టులను వేస్తున్నారని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని వాస్తవంగా ఖాళీలను లెక్కించి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో నాయకులు ధర్మారపు పవన్, సంగేష్, మోడీ రాందేవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమకారుడు దిలీప్ కుమార్ ఆకస్మిక మృతి



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

పాతబస్తీ శివగంగ నగర్‌కు చెందిన సౌత్ జోన్ విద్యార్థి ఉద్యమ నాయకుడు రసం దిలీప్ కుమార్ కార్డియా కాలేజిస్ట్ అనే వ్యాధితో బాధపడుతూ గత కొన్ని రోజుల గా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. దిలీప్ మరణం తీరని లోటని బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రివర్యులు మహమ్మద్ అలీ అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గ్యాదరి బాలమల్లు, పుస్తె శ్రీకాంత్, సీతారామ రెడ్డి, శ్యామసుందర్ రెడ్డి, శ్రీమతి సాయిచంద్, రజిని, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత, ముషీరాబాద్ సీనియర్ నాయకుడు ముఠ జయసింహ, ఎమ్మార్పీఎస్ నాయకుడు సాప కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ఆకుల శ్రీనివాస్, సాయి తేజ రావు, రాజు, నరేష్, బ్రహ్మాచారి, అంతిమయాత్రలో పాల్గొని సానుభూతి వ్యక్తం చేశారు.

చిత్రాల నగర్ బస్తీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం, కవడిగూడ డివిజన్ పరిధిలోని చిత్రాల నగర్ బస్తీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బస్తీ అధ్యక్షులు విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ప్రధానంగా స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ డ్రయినేజీ , రోడ్ల సమస్యలపైన స్పందించడం లేదని బస్తీ వాసులు వాపోతున్నారు. నియోజకవర్గంలోని చిత్రాల నగర్ బస్తీ వాసులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తీరుపై ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బస్తీ అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ.. 2022లో డ్రయినేజీ, రోడ్ల పనులకు కమ్యూనిటీ హాలుపై అంతస్తుకు ఎంఎల్ఏ ముఠా గోపాల్ శంకుస్థాపన చేశారు. చిత్రాల నగర్ బస్తీ యువకులకు సంక్షేమ పథకాలను అందించడంలో స్థానిక శాసనసభ్యుడు ముఠాగోపాల్ ఘోరంగా వివక్షత కనబరిచారని యువకులు ఆరోపించారు. డ్రయినేజీ నీరు వర్షాకాలంలో వర్షం నీరు తమ ప్రాంతంలో ఎక్కడికక్కడ నిలిచిపోయి అనేక ఇబ్బందుల గురవుతున్నామని తెలిపారు. దళితుల బస్తీ అని చిన్న చూపు చూడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తక్షణమే పనులను చేపట్టి పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో వారి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిత్రాల నగర్ బస్తీ వాసులు భరత్ ,జీవన్, రామకృష్ణ, క్రాంతి, నవీన్, యాది, రాజు, విజయ్, మల్లేష్, అచ్యుత్, శివ, తదితరులు పాల్గొన్నారు.

'అగ్రహారాల ఆశ చూపి బ్రాహ్మణ సామాజిక వర్గం టార్గెట్'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



భూములు, అగ్రహారాల ఆశ చూపి బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్‌నేషనల్ పేరుతో దాదాపు 5 వేలకు పైగా బాధితుల నుంచి సుమారు రూ.1,000 కోట్లు వసూలు చేసి మోసం చేసిన ఫౌండేషన్ చైర్మెన్ పంతంగి కమలాకర శర్మ, అతని భార్య డాక్టర్ జయశ్రీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ఫోరం ఆవేదన వ్యక్తం చేసింది. బాధితుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితుల ఫోరం కన్వీనర్ కళ్ళే గిరి ప్రసాద్ శర్మ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జరిగిన అతి పెద్ద మోసాల్లో ఈ ధన్వంతరి ఫౌండేషన్ చేసిన మోసం అతి పెద్దదన్నారు. దాదాపు 70 ఏండ్లు నిండిన బాధితులు ఈ మోసంలో 80 శాతం మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ విద్యార్థుల కోసం కేవలం డాక్టర్ల చేత ఏర్పాటు చేసిన ఈ ట్రస్టులో ఫౌండేషన్ చైర్మన్ కమలాకర శర్మ, అతని భార్య డాక్టర్ జయశ్రీలు భారీ అక్రమాలకు పాల్పడుతూ సంస్థను భ్రష్టు పట్టించారని ఆరోపించారు. గత 20 సంవత్సరాలు ధన్వంతరి ఫౌండేషన్ బ్రాహ్మణులకు భూములు, అగ్రహారాలు ఇస్తామంటూ ఒక్కొక్కరి వద్ద నుండి రూ.3 లక్షల నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేశారని చెప్పారు. ధరణి షెల్టర్స్, ధరణి ఇన్‌ఫ్రాలతో పాటు వివిధ పేర్లతో 21 కంపెనీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా బ్రాహ్మణులకు పెట్టుబడులు, అధిక వడ్డీ ఆశ చూపి వెంచర్ల పేరుతో ఆర్‌బిఐ నిబంధనలకు విరుద్ధంగా రూ.100 బాండ్ పేపర్లపై రాయించుకొని మోసాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ధన్వంతరి ఫౌండేషన్‌లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను డైరెక్టర్లుగా నియమించుకుని భారీ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కమలాకర శర్మ ఆస్తులను అమ్మకాలు జరగకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే నిందితుడి పాస్‌పోర్ట్, ఆస్తులు అకౌంట్లు అన్ని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసును సీబీసీఐడీ చేత విచారణ జరిపించి మోస పోయిన బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ విషయంపై త్వరలో ప్రభుత్వ సీసీఎస్, డీజీపీలు, రిజిస్టర్ అధికారులు, ప్రభుత్వ సీట్ బృందం ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో విచారణ జరిపించి అతడిపై, అతని అక్రమ ఆస్తు లు, మోసాలను బయటపెట్టి కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ధన్వంతరి బాధితుల ఫోరం సభ్యులు ఎం.వెంకట రమణ శర్మ, డాక్టర్ ఎం.మోహన్ రావు శర్మ, దర్శనం మాసపత్రిక ఎడిటర్ దర్శ నం శర్మ, ఆత్రేయ శర్మ, రవి శర్మ, ఇందిరా, పసుమర్తి రాజ రాజేశ్వరితో పాటు 300 మంది బాధితులు పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన ఫోటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు



నవతెలంగాణ చాంద్రాయణగుట్ట

శాలిబండ ఏసీపీసీ.హెచ్ చంద్రశేఖర్‌ను పాతబస్తీ ఫోటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కలిశారు. ఈసందర్భంగా ఓల్డ్ సిటీలోని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం ఏర్పడిందని జూలై 2న యూనియన్ అసోసియేషన్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త కమిటీ సభ్యులు పాతబస్తీలో ఫోటో అండ్ వీడియోగ్రాఫర్లు తాము ఆర్డర్లపై రాత్రి సమయంలో వస్తున్నప్పుడు జరుగుతున్న వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ సమయాలలో ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ల తనిఖీలలో భాగంగా చెక్ చేసే సమయంలో వాళ్లకు ఆర్డర్లపై వెళ్లడానికి లేట్ అవుతుందని అలాంటి సమయాలలో తమ యూనియన్ ఐడెంటిటీ కార్డు చూసి తొందరగా పంపించాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ సిటీ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జె. రాము, వైస్ ప్రెసిడెంట్ రమేష్, అలోక్ జనరల్ సెక్రటరీ డి మల్లేష్, సీనియర్ అడ్వైజర్స్ టీ బ్రహ్మయ్య, శ్రీనివాస్, కమిటీ సభ్యులు నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పట్ల మోడీ సర్కార్ నిర్లక్ష్య వైఖరి తగదు

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. ఈశ్వర్ రావు

నవతెలంగాణ-ధూల్‌పేట్



కార్మికుల పట్ల మోడీ సర్కార్ నిర్లక్ష్య వైఖరి తగదని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. ఈశ్వర్ రావు అన్నారు. సీఐటీయూ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రభుత్వం మొదటి సారి అధికారంలో వచ్చినప్పటినుండి కార్మిక వ్యతిరేక విధానాలు అవాలంబిస్తుందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరణ, కార్పొరేటికరణ విధానాలను వేగంగా అమలు చేయాలని చూస్తుందని ఆరోపించారు. ప్రజా కార్మికుల సంక్షేమం, మేలు చేయాల్సిన ప్రభుత్వం వ్యతిరేక విధానాలకు పాల్పడటం సరికాదన్నారు. ఎన్నికల్లో బీజేపీ గెలిచిన వెంటనే నాలుగు లేబర్ కోర్డ్ అమలు చేస్తామని బీజేపీ ప్రకటించిడం దారుణమన్నారు. బొగ్గు బ్లాకుల వేలానికి పూనుకుందని మండిపడ్డారు. ఈపిఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యంపై విధించే చాలాన్లు భారీగా తగ్గించిందన్నారు. ఇటు కార్పొరేట్, మతోన్మాదులను ప్రసనం చేసుకొని వారికీ లాభాలు కట్టబెట్టేందుకు నిశ్చయించుకుందన్నారు. బీజేపీ విధానాలను నివారించి కార్మిక హక్కులను కాపాడేందుకు దేశ వ్యాప్తంగా కార్మిక పోరాటాలు చేయాలనీ సీఐటీయూ పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా జులై 10న కార్మికుల కోర్కెలా దినం పాటించాలని, ఎక్కువ చోట్ల నిరసన ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సౌత్ కార్యదర్శి ఎం. శ్రవణ్ కుమార్, మీన, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోవింద్‌నగర్ బస్తీ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

గోల్నాక డివిజన్‌తో పాటు గోవింద్ నగర్ బస్తీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి అన్నారు. ఇటీవల నూతనంగా ఏర్పాటైనా గోవింద్ నగర్ సంక్షేమ సంఘం గౌరవ చైర్మెన్ కుంబర్తి ప్రభాకర్, అధ్యక్షులు భీమనబోయిన నర్సింగ్ రావు యాదవ్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొమ్మరాజు ఈశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి కుయ్య అరుణ్ దాస్, సంయుక్త కార్యదర్శి సెట్ల గోపాల్ , కోశాధికారి సెట్ల మురళి కార్యవర్గ సభ్యులు బద్దుల చంద్రకాంత్ యాదవ్, తూముకుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

నిరుద్యోగ యువతీ యువకుల కోసం జూలై 6న పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లాయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్(గ్రీన్ల్యాండ్స్) సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా చేపట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు హరిసందీప్, ముప్వ రాంరెడ్డి, లక్ష్మికుమారిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ సా ఫ్వేర్, ఫార్మ కంపెనీలతో పాటు ఇతర పేరొందిన సంస్థలు పాల్గొని వివిధ రకాల ఉద్యోగులను నియమించుకొనున్నట్లు వారు వెల్లడించారు. 10వ తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ అర్హత కల నిరుద్యోగ యువతీ,యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18-30 సంవత్సరాల వయస్సు వారు అర్హులన్నారు. సుమారు ఈ జాబ్ మేళాలో 25 సంస్థలు వారు పాల్గొని 5 వేల ఉద్యోగాలను భర్తీ చేసుకుంటాయని వారు తెలిపారు. ఈ జాబ్ మేళా రాణీగంజ్ గుజరాతీ హైస్కూల్ బోయగూడలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్‌సైట్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో సంప్రదించాలన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో నిర్వహించిన మంకీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న అంబర్‌పేట బీజేపీ డివిజన్ అధ్యక్షులు, ప్రెసిడెంట్ నాగభూషణం చారి నాయకులు రామకృష్ణ, దశరత్, టీవీ చారీ, రేఖ, కార్తీక్ నవతెలంగాణ-అంబర్‌పేట

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
సోమవారం | జూలై 01, 2024 | www.navatelangana.com

నిల్వగా చెత్త కుప్పలు..



నవతెలంగాణ-కొత్తపేట్

గత కొన్ని రోజులుగా న్యూ మారుతి నగర్ రోడ్ నెంబర్ 12 సత్యా నగర్ దారిలో ఒక అపార్ట్‌మెంట్ పక్కన గత కొన్ని రోజులుగా చెత్త కుప్ప నిల్వ ఉంటుంది. దీని ద్వారా వర్షం వచ్చినప్పుడు రోడ్డుపైకి చెత్త వచ్చి ఇబ్బందిగా మారుతుంది. సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. దీనిని వెంటనే శుభ్రపరుచగలరని కాలనీ వాసులు కోరుతున్నారు.

షూటింగ్‌లో డాక్టర్ వంశీధర్‌కు గోల్డ్ మెడల్



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో డాక్టర్ వంశీధర్ నాలి హాట్రిక్ గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాద్‌లోని శాట్స్ రేంజ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని అగ్రసేణి షూటర్లు పాల్గొన్నారు. 10 మీటర్ల రైఫిల్ మాస్టర్మెన్ ఇండివిడ్యువల్ విభాగంలో 380/400 స్కోర్ చేసి వంశీధర్ గెలుపొంది గోల్డ్ మెడల్ సాధించారు. ఇది అతనికి వరుసగా మూడో గోల్డ్ మెడల్, ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి మాజీ డీజీపీ అంజనీకుమార్, తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షులు అమిత్సంఘీ కార్యదర్శి జె.కిరణ్ హాజరై గోల్డ్ మెడల్ అందజేశారు. అనంతరం వంశీధర్ మాట్లాడుతూ నిరంతర సాధన, కుటుంబం,కోచ్‌ల సహాయంతో ఈవిజయాన్ని సాధించానన్నారు. కాగా డాక్టర్ వంశీధర్ బీజేపీ తెలంగాణ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

కార్యకర్త మృతి పట్ల ఎమ్మెల్యే దిగ్భ్రాంతి



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌కు చెందిన బీ.ఆర్.ఎస్. పార్టీ మహిళా నాయకురాలు మాధురి అలియాస్ పప్పీ మతి పట్ల సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ తన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పార్టీ కై నిబద్ధతతో పనిచేసే ఆమె తన వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడడం శోచనీయమని అన్నారు. ఆదివారం గాంధీ మార్చురీలో మాధురి మృతదేహాన్ని పద్మారావు గౌడ్ సందర్శించి ఆమె కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోకుండా ఆత్మ హత్యకు పాల్పడడం సరికాదన్నారు. దివంగత మాధురి తమ పార్టీ కోసం శ్రమించారని, ఆమె కుటుంబసభ్యులను ఆదుకుంటామన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తమ పార్టీ కార్యకర్తలు తమ కుటుంబ సభ్యు లేనని వారి కష్ట సుఖాల్లో తాము తోడుగా ఉంటామని తెలిపారు.

బాధిత కుటుంబానికి డిప్యూటీ మేయర్ పరామర్శ

జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి దంపతుల అనుచరురాలు మాధురి అనే మహిళా కన్నుమూసింది. ఈ మేరకు తార్నాక డివిజన్‌లోని సాయి నగర్ కాలనీలో వారి నివాసానికి డిప్యూటీ మేయర్ వెళ్లి మృతురాలి భౌతికకాయానికి నివాళ్లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిత్తశుద్ధి కలిగిన కార్యకర్తగా ప్రతీ కార్యక్రమం లో ఎంతో చురుగ్గా పాల్గొనేది అని, ఆత్మీయ అనుచరు రాలిగా మాధురితో ఉన్న బంధాన్ని గుర్తు చేసుకున్నారు.



జాతీయ గణాంక దినోత్సవ వేడుకలు



- జిల్లా గణాంక దర్శిని-2023 పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీ బ్యూరో

జాతీయ గణాంక దినోత్సవము-2024 వేడుకలు కలెక్టరేట్‌లోని ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 18వ జాతీయ గణాంక దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా గణాంక దర్శిని-2023 పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 18వ జాతీయ గణాంక దినోత్సవానికి "నిర్ణయాల కోసం సమాచార వినియోగం" నేపథ్యం ఇవ్వడం వల్ల మన దేశ సాంఘిక-ఆర్థిక ప్రణాళిక, అభివృద్ధికి విధాన రూపకల్పనలో గణాంకాల పాత్ర, ప్రాముఖ్యతపై ప్రజల్లో, ముఖ్యంగా యువతరంలో అవగాహన కల్పించడం గణాంకాల దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రధాన లక్ష్యమన్నారు. ఆ దిశగా ఈ శాఖలో ప్రచురణకి ప్రత్యేక శ్రద్ధ వహించి కృషి చేసిన ప్రతి ఒక్క గణాంక అధికారికి, సమాచారాన్ని సకాలం లో అందించిన జిల్లా అధికారులందరికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య ప్రణాళిక అధికారి డాక్టర్ ఎస్. సురేందర్ మాట్లా డుతూ 18వ జాతీయ గణాంక దినోత్సవం ప్రాము ఖ్యాన్ని వివరిస్తూ 2024లో సుస్థిర అభివృద్ధి సూచీలను సాధించే క్రమంలో దేశం ఆర్థిక స్వావలం బన సాధించడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న వివిధ ఆర్థిక, విధాన పరమైన నిర్ణయాలకు, సంక్షేమ పథకాల అమలుకు ప్రస్తుత గణాంకాల అవసరాలు వాటి సేకరణ విశ్లేషణ ఆవిష్కరణలను ప్రతిబిం బించే అంకితమైన ఇతివృత్తంతో ఈ వేడుక ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకున్నదని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించిన 'జిల్లా గణాంక దర్శిని-2023' పుస్తకంలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుం బ సంక్షేమం విద్య, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకిం గ్, ప్రజా ఆర్థిక వ్యవస్థ, సామాజిక భద్రత మొదలగు అంశాల సంపుటి విద్యావేత్తలకు, పరిశోధకులకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రతి ఒక్కరికీ ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్టాటిస్టికల్ ఆఫీసర్ రెడ్డప్ప, డీవైఎస్‌వోలు ఉమామహేశ్వరి, ఆనంద్ కుమార్, మనోహర్, ప్రమీలరాణి, సూపరింటెండెంట్ మాధవి, ప్రణాళిక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE AT : SANGAREDDY
IA No. 546 of 2023
IN
O.S. No. 731 OF 2023

Between:
Sri.B. Subbaraju. ..Petitioners/Plaintiffs.
AND
Garimella Maruthi Prasad,& Another ...Respondents/Defendants

To,
R.1 Garimella Maruthi Prasad, S/o. Rama Rao,Aged 53 years, occ: Business,R/o. h.No. 15-21-171/1, Venkata Padmavathi Residency, Balaji Nagar, Kukatpally. Medchal Malkajgiri Dist.

NOTICE
Take notice that our clients Sri.B.Subbaraju and another filed above IA seeking adinterim injunction order against the respondents/defendantsfor perpetual injunction in respect of suit schedule properties before the Hon'blelll Addl. Junior Civil Judge, At: Sangareddy. The above case is posted on 12-07-2024 for your appearance. On that day you may appear before Hon'blelll Addl. Junior Civil Judge, Sangareddy by 10.30 A.M. either in person or through advocate failing which the case will be decided in your absence.
// BY ORDER OF THE COURT//
J.RAM REDDY,
P.VIVEKANAND,
M.VINOD KUMAR,
ADVOCATES,SANGAREDDY

ఓయూలో ఘనంగా సాయిచంద్ ప్రథమ వర్ధంతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు సాయిచంద్ ప్రథమ వర్ధంతి సభ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓయూ అధ్యక్షులు నామ సైదులు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి , గాజుల ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు.

"త్యాగాల తెలంగాణ గడ్డమీద సాహిత్యానికి పాటకి ఆటకి గజ్జకి ప్రాణం ఉన్నదని తెలంగాణ కళాకారుడు సాయి చందు మరోసారి నిరూపించాడు. తన రాజకీయ ప్రస్థానం అరుణోదయ సంస్థ నుండి మొదలై తెలంగాణ సాంస్కృతిక సంస్థతో చివరి మజిలీ వరకు నడిచినా ఎక్కడ కూడా తన ప్రగతిశీల భావజాలాన్ని అంబేద్కర్ భావజాలాన్ని వదిలిపెట్టలేదు. సాక్షాత్తు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు చివరికి రాష్ట్ర అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్న వేదికల మీద కూడా సాయి చంద్ తన గళాన్ని వినిపించాడు.నిన్ను నన్ను కన్న తల్లి భారతమ్మ ఒక్కటే నీకు నాకు మధ్య ఈ కులం గోడలు ఏందిరా అని చాలా వేదికల మీద మనువాదాన్ని తన గొంతుతో ప్రశ్నించాడు. అంబేద్కర్ లేనిదే రాజ్యాంగం లేదు రాజ్యాంగం లేనిదే మనకు హక్కులు లేవు అని ప్రతి వేదిక మీద అనర్గళంగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. లక్షల మంది జనాన్ని కూడా తన ఆటతో మాటతో గంటల తరబడి కట్టిపడేసే నైజం సాయి చందుది. తనకు తన కుటుంబానికి ఎలాంటి రాజకీయ వారసత్వం లేకుండా వచ్చి మొక్కవోని ధైర్యంతో తెలంగాణ రాష్ట్రమంతా తిరిగి కళాకారులను కూడగట్టి ప్రజలను చైతన్యవంతం చేసి స్వరాష్ట్ర సాధనలో కీచిన్న వయసులోనే ఆనాటి ప్రభుత్వంలో గిడ్డంగుల శాఖకు చైర్మెన్‌గా వ్యవహరిస్తూనే గుండెపోటుతో సాయిచంద్ మరణించారు. అప్పుడే సంవత్సరం గడిచిపోయింది. ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్ మీద ఏర్పాటు చేయాలి. సాయి చంద్ ఆశయాలను కొనసాగించడం అంటే ప్రజలకు అండగా నిలబడడమే' అని అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో తెలంగాణ తెలంగాణ స్టూడెంట్ పొలిటికల్ జాక్ ప్రెసిడెంట్ వలిగొండ నరసింహ,రాహుల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు క్రాంతి, టీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు, జంగయ్య, పవన్ దేవాన్ష్,పార్థు కళ్యాణ్,సతీష్,నగేష్, శివ వివిధ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఒంగోలు
I.A.NO.617/2019
IN
O.S.NO.676/2019
కొమ్మినేని కోదండరామయ్య ....వాది
వర్సెస్
శిఖాకొల్లు చంద్రమోహన్ ...ప్రతివాది

To,
శిఖాకొల్లు చంద్రమోహన్, S/O సుబ్బారావు, చైర్మన్ భీమా సిమెంట్, హౌస్ నెంబర్ 32, ఆదిత్య ఫోర్ట్ విల్లా, మణికొండ, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబర్ దావాలో వాది మీ మీద ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొనుటకు మరియు మీ ఆస్తిని అటాచ్ చేయమని ప్రతివాది నోటీసుకుగాను తేదీ10.07.2024 న వాయిదా వేసి ఉన్నారు కావున పై నెంబర్ దావా విషయమై ప్రతివాదికి ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల పైకోర్టు వారి ఎదుట ఉదయం గం 10.30 నిమిషాలకు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనగలరు లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది
//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఇట్లు
K.V.రామాంజనేయులు
అడ్వకేట్ , గోల్డెన్ టవర్స్
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు
సెల్ నెంబర్ :8074231236

CHANGE OF NAME
I, SOMARAJU SAI ASHRITH VENKATA RAM KRISH NAGA , son of RAGHAVENDRA RAO SOMARAJU, aged approximately 18yrs, currently a student, residing at H.No.1-9-734/2, Sitarama Nilayam, Julywada, Subedari, Hanumakonda, Warangal-Hanumakonda, T.S.-506001, India, My name is SOMARAJU SAI ASHRITH VENKATA RAM KRISH NAGA, son of RAGHAVENDRA RAO SOMARAJU, and my mother's name is **LAKSHMI SIREESHA SOMARAJU**. It has come to my attention that in my **Passport bearing No.Y7414382**, my mother's name was incorrectly recorded as **LAKSHMI SIRISHA CHALLA**. I hereby declare that the discrepancy between the names **LAKSHMI SIREESHA SOMARAJU** and **LAKSHMI SIRISHA CHALLA**

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT : MAKALGIRI
E.P.No.29 of 2015
Between :
V.V.Konda Reddy died and as per LRs ...Petitioners
AND
Shaganti Shankaramma and another ...Respondents
To,
Shaganti Shankaramma, W/o.late Shaganti Ananthaiah, aged 77yrs, R/o.H.No.28-49, Neredmet, Secunderabad - 56.
Please take notice that the Decree Holders above named have filed the above E.A.No.14 of 2022 in E.P.No.29 of 2015 under Sec.28 of Specific Relief Act seeking direction against both of your i.e. the judgement debtors herein to deliver possession of E.P. Schedule property and the said Hon'ble Court posted the above E.P. for your appearance on 08.07.2024. Therefore you Judgement Debtors No.1 are hereby called upon to appear either in person or through advocate duly instructed before the said court on **08.07.2024 at 10:30 A.M.** failing which the above E.P. will be decided in your absence.
SCHEDULE OF PROPERTY
All that Plot No.107, admeasuring 267 Sq.Yards in Sy.Nos.296, 297 &282/1, situated at Kakateeya Nagar, Neredmet, Malkajgiri Municipality & Mandal, Ranga Reddy District (Presently Medchal-Malkajgiri District) and bounded by **North** : Plot No.118, **South :** 25 Ft Road, **East :** Plot No.106 and **West :** Plot No.108
(BY ORDER OF THE HON'BLE COURT)
S.N.C.SRINIVAS
Advocate
22-85, R.K. Nagar, Malkajgiri, Hyd-500047. Vinayak Nagar, Neredmet, Sec-Bad.
Counsel for Decree Holders
Mobile : 9391099994

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE AT : SANGAREDDY
O.S. No. 731 OF 2023
Between:
Sri.B.Subbaraju ... Plaintiffs.
AND
Garimella Maruthi Prasad, & Another ...Defendants
To
D.1 Garimella Maruthi Prasad, S/o. Rama Rao,Aged53 years, occ: Business, R/o. H.No. 15-21-171/1, Ven klataPadmavathi Residency, Balaji Na-gar, Kukatpally. Medchal Malkajgiri Dist

NOTICE
Take notice that our clients Sri.B.Subbaraju and another filed Suit for perpetual injunction in respect of suit schedule properties against the Defendants before the Hon'blelll Addl. Junior Civil Judge, Sangareddy District, At: Sangareddy. The above case is posted on 12-07-2024 for your appearance. On that day you may appear before Hon'blelll Addl. Junior Civil Judge, Sangareddy by 10.30 A.M. either in person or through advocate failing which the case will be decided in your absence.
// BY ORDER OF THE COURT//
J.RAM REDDY,
P.VIVEKANAND,
M.VINOD KUMAR,
ADVOCATES
SANGAREDDY

ఒంగోలు 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.NO.915/2022
O.S.NO.84/2017
వలేటి పద్మ ...పిటీషనరు
వర్సెస్
వలేటి ప్రసాద్ ...రెస్పాండెంట్లు
IA నోటీసు
To,
R9.మర్రిపూడి మాధవి, భర్త మల్లికార్జున, అనంతసాగరం, కందుకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
పై తెలిపిన కోర్టు వారి ఎదుట పై తెలిపిన పిటీషనరు పై తెలిపిన నెంబరు పిటీషన్ ను ఆర్డర్ 1 రూల్ 10 సిపిసి ప్రకారం ఆర్ 7 to ఆర్ 9 లను దావానందు ప్రతివాదులుగా చేర్పించమని దాఖలు చేసుకొనగా కోర్టు వారు మీ నోటీస్ నిమిత్తం తేదీ 19.07.2024 కి వాయిదా వేసియున్నారు ఇందు విషయమై మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నను పై తెలిపిన కోర్టు వారి ఎదుట ఉదయం 10 గంటల 30 నిమిషాలకు హాజరుపడి మనవి చేసుకోవలెను లేనియెడల మీ పరోక్షమందు ఈ పిటీషన్ ను తీర్మానం చేయుదురు అని తెలియపరచమైనది
//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
నగరికంటి శ్రీనివాసరావు
పిటీషనరు తరపు అడ్వకేట్, ఒంగోలు

IN THE COURT OF THE HON'BLE 1 ST ADDL. JUNIOR CIVIL JUDGE; RAJENDER NAGAR, RANGA REDDY DISTRICT AT: UPPERPALLI
O.S.NO.184 OF 2024
BETWEEN: -
Burra Srikanth Goud & Others ...Plaintiffs
AND
1.THE TAHSILDAR, GANDIPET MANDAL
2.TO WHOM EVER IT MAY CONCERNED ...Defendants
To
TO WHOMSOEVER IT MAY CONCERN (Defendant No.2)
NOTICE
Please take notice that the above named Plaintiffs filed the above Suit for Declaration to declare the Plaintiffs are the only legal heirs of Late Burra Kumar Goud and Late Smt. Santosha, and the above Suit is posted on 14-08-2024 for appearance and objections if any, so, if any person's have got any objection/s, claim/s are hereby directed to appear before the said Hon'ble Court on **14-08-2024 at 10.30 a.m.,** in person or through counsel, failing which the above matter will be disposed off in accordance with law.
(BY ORDER OF THE COURT)
I.NAGENDER RAO
Advocate
Residence: Flat No.104, 1 st Floor, Om Chaitanya Samrudhi Apts, Sangam Road, Langer House, Hyderabad - 500 008, T.S.
Cell : 9949001407

బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి



- కురుమ రాజ్యాధికార పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల నవీన్

నవతెలంగాణ-ఓయూ

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అట్టడుగు వర్గాల గొంతుక గొర్ల కాపరుల సమాజానికి చెందిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని కురుమ రాజ్యాధికార పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల నవీన్ కురుమ డిమాండ్ చేశారు.ఆదివారం మిరియాల నవీన్ కురుమ ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న గొల్లకురుమలకు మంత్రివర్గ విస్తరణలో సముచిత స్థానం కల్పించాలన్నారు. నీతికి, నిజాయితీకి మారుపేరైనా కురుమలు అంతే నిబద్ధతతో పనిచేస్తారన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో గెలిచిన బీర్ల ఐలన్నకు రాబోయే మంత్రివర్గ విస్తరణలో స్థానం కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మంత్రులు ఉన్నారని.. నల్గొండ జిల్లాలో ఉన్న ఏకైక బీసీ ఎమ్మెల్యే ఐలయ్య కు మంత్రి పదవిని ఇచ్చి బహుజన సమాజానికి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. లేని పక్షం లో రాబోయే రోజుల్లో మా బహుజనుల సత్తా ఓటు అనే ఆయుధంతో చూపిస్తాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఓయూ కురుమ విద్యార్థి సంఘం నాయకులు డా కంకల ఎలెందర్ కురుమ, గొరిగే మల్లేష్ కురుమ, జేఏసీ నాయకులు పర్వతాలు కురుమ, గురునాథ్ కురుమ, కేఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శులు సతీశ్ , మన్మోహన్, భాను చంద ర్ , కేమిడి ఉపేందర్ కల్లే మల్లేష్ కురుమ, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE COURT :: RANGA REDDY DIST. COURTS AT: L.B. NAGAR.
S.O.P.No.12 OF 2023
Between:
K.Indrasena Reddy ...Petitioner
AND
Bank Of Baroda & Others ...Respondents
To
5.N.Swarna Kumari, W/o N.Karunakar Reddy, Aged about 57yrs, Occ: Housewife, R/o Plot No.22, G.V Reddy Colony, Opp: Rythu Bazar, Alwal, Secunderabad -500 010.
6.B.Kusuma Kumari, W/oB.Tirupati Reddy, Aged about 50yrs, Occ: Housewife, R/o Plot No.67/P, H.No.7-761/2/4, Subhash Nagar, Quthbullapur, Jeedimetla, Hyderabad – 500 055.
7.All Concerns. ...Respondents
THE ABOVE CONCERNED
Take notice that the above mentioned Petitioner filed S.O.P.for issuance of succession certificate in his favour. If any one has got any objection or claims against grant of succession certificate by the Hon'ble Court, they may appear before the Hon'ble Court along with proof, on **15.07.2024 at 10.30 am** and if no objections are received, the court will proceed to determine the matter on merits.
(BY ORDER OF THE COURT)
G.Vasantha Rayudu,
K.Punyavathi
Advocates
Flat NO. 16, Surya Complex, Durganagar Colony, Panjagutta, Hyderabad - 82. No. 9849145084
Counsel for the Petitioner

IN THE COURT OF VI ADDI TIONAL DISTRICT JUDGE, RANGAREDDY DISTRICT, KUKATPALLY, AT: PRASHANTH NAGAR
O.S.No.39 OF 2022
Between:
Mrs.Mangal Rathi and others ...PLAINTIFFS
AND
Mr.K.Dhananjaya Reddy and others. ...DFENDANTS
To,
1.YV.Divakar S/o Y.J.Raidu, aged about 51yrs, Occ:Business,
2.YVS Sudhakar S/o Y.J.Raidu, aged about 54yrs, Occ: Business, Both R/o 6-3-111/2A, Bola Shanker Maktha, Begumpet, Hyd
Please take notice that the above named plaintiffs instituted the above suit against you for Declaration of Title, Recovery of Possession in respect of Plaint schedule described property adm. 1,120 Sq. Yds., situated in Sy.No. 11/36 Khanamet Village, Seriling ampally Mandal, Ranga Reddy District and the same is coming up for your appearance on 18.07. 2024.
Please make it convenient to appear before Hon'ble VI Additional District Judge, Rangareddy District, Kukatpally at Prashanth Nagar, either in person or through authorized agent on **18.07.2024 at 10.30 a.m.** Otherwise the matter would be decided ex-parte.
(BY ORDER OF THE COURT)
SRI.P. RAM REDDY
Advocate
Plot No.5, MPs & MLAs Colony, Road No.10C, Jubilee Hills, Hyd- 500 033. Ph: 2355 4244,

IN THE COURT OF THE HON'BLE 1 ST ADDL. JUNIOR CIVIL JUDGE; RAJENDER NAGAR, RANGA REDDY DISTRICT AT: UPPERPALLI
O.S.No.720 OF 2022
Between: -
A.Indira & Others ...Plaintiffs
AND
1.The Tahsildar, Rajendernagar MANDAL
2.The Branch Manager, SBI, Kattedan Branch
3.TO WHOM EVER IT MAY CONCERNED ...Defendants
To
TO WHOM EVER IT MAY CONCERNED (Defendant No.3)
NOTICE
Please take notice that the above named Plaintiffs filed the above Suit for Declaration to declare the Plaintiffs as the only legal heirs and successors of LATE AERWA BUCHAIAH, and the above Suit is posted on 11-07-2024 for appearance and objections if any, so, if any person/s have got any objection/s, claim/s are hereby directed to appear before the said Hon'ble Court on **11-07-2024 at 10.30 a.m.,** in person or through counsel, failing which the above matter will be disposed off in accordance with law.
(BY ORDER OF THE COURT)
I.NAGENDER RAO
Advocate
Residence: Flat No.104, 1 st Floor, Om Chaitanya Samrudhi Apts, Sangam Road, Langer House, Hyd-08, T.S. Cell: 9949001407
Counsel for Plaintiffs

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT : MAKALGIRI
E.P.No.25 of 2015
Between :
V.V. Konda Reddy died and as per LRs ...Petitioners
AND
Shaganti Shankaramma and another ...Respondents
To,
Shaganti Shankaramma, W/o. late Shaganti Ananthaiah, aged 77 yrs, R/o.H.No.28-49, Neredmet, Secunderabad - 56.
Please take notice that the Decree Holders above named have filed the above E.A.No.13 of 2022 in E.P.No.25 of 2015 under Sec.28 of Specific Relief Act seeking direction against both of your i.e. the judgement debtors herein to deliver possession of E.P.Schedule property and the said Hon'ble Court posted the above E.P. for your appearance on 08.07.2024. Therefore you Judgement Debtors No.1 are hereby called upon to appear either in person or through advocate duly instructed before the said court on **08.07.2024 at 10:30 A.M.** failing which the above E.P. will be decided in your absence.
SCHEDULE OF PROPERTY
All that Plot No.106, admeasuring 267 Sq.Yards in Sy.Nos.296, 297 & 282/1, situated at Kakateeya Nagar Neredmet, Malkajgiri Municipality & Mandal, Ranga Reddy District (Presently Medchal-Malkajgiri District) and bounded by **North :** Plot No.119, **South:** 25 Ft Road, **East:** Plot No.105 and **West:** Plot No.107
(BY ORDER OF THE HON'BLE COURT)
S.N.C.SRINIVAS
Advocate
22-85, R.K. Nagar, Malkajgiri, Hyd-500047. Vinayak Nagar, Neredmet, Sec-Bad.
Counsel for Decree Holders
Mobile : 9391099994

నిరుద్యోగుల ప్రశ్నలకు జవాబేది..?

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు



నవతెలంగాణ-ఓయూ

నిరుద్యోగుల ప్రశ్నలకు జవాబేదనిబీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల డిమాండ్ల కోసం గత ఏడు రోజుల నుంచి గాంధీ ఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు విషమిస్తోందన్నారు. జీవన్‌రెడ్డి అలిగితే రాయబారానికి మంత్రులు పంపిస్తావు.. పోచారంని చేర్చుకోవడానికి నీవే స్వయంగా వెళ్తావు... నిరుద్యోగ గిరిజనుడైననా మోతిలాల్ దీక్ష చేస్తుంటే రేవంత్ రెడ్డి దురహంకారం చాలా స్పష్టంగా కనిపిస్తున్నదని బాలు దుయ్యబట్టారు. మోతీలాల్ ప్రాణానికి ఏమైనా అయితే రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అతనికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. నిరుద్యోగుల ఆశల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేడు వారిని సమాధి చేస్తున్నదని మండిపడ్డారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ 1: 100కు సెలెక్ట్ చేయాలని అలాగే గ్రూప్ 2,3లలో పోస్టుల సంఖ్యను రూ. 2000 నుంచి రూ. 3000 వరకు పెంచాలని, జీవో 46 సమస్యలు వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీకి అల్టిమేటం జారీ చేశారు. జాబ్ క్యాలెండర్ ఇవ్వడంతో పాటు ప్రతి పరీక్షకు మధ్యన రెండు నెలల సమయం ఇవ్వాలని, రాష్ట్రంలో ప్రతి ఏటా ఏర్పడుతున్న ఖాళీలను సకాలంలో గుర్తించి, తదనుగుణంగా నోటిఫికేషన్లు విడుదల చేసే విధంగా ప్రత్యేక అధికారిని కూడా నియమించాలని కోరారు. ఏది ఏమైనా నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల కోసం బీఆర్ఎస్వీ ఎప్పుడూ మద్దతుగా ఉంటుందని అదే క్రమం లో రాష్ట్రంలో అన్ని చోట్ల ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగుల డిమాండ్లని నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కచ్చితంగా భవిష్యత్తు పరిణామాలకు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఫిజియోథెరపీతో కండరాలకు బలం

• డాక్టర్ జక్కిడి అనిల్‌రెడ్డి



నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట

నవతెలంగాణ : ఫిజియోథెరపీ అంటే ఏమిటి?

డాక్టర్: ఫిజియోథెరపీ అంటే కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు ఉన్నప్పుడు నొప్పి తగ్గించడం కోసం, అదే విధంగా కండరాలు బలం పెంచడం కోసం మిషన్లు యూస్ చేసిగాని ఎక్సర్సైజ్ వల్ల కండరాలు బలం పెంచేదాన్ని ఫీజియోథెరపీ అంటాం. దీంట్లో ఎక్సర్సైజ్ తెరపి అదే విధంగా టేపింగ్, ప్రత్యేకమయిన విధానాల ద్వారా చేస్తూ ఉంటాం.

నవతెలంగాణ : ఆపరేషన్ల ముందు తర్వాత ఫిజియోథెరపీ అవసరమా?

డాక్టర్: కచ్చితంగా అవసరం పడుతుంది. ఎందుకంటే ఆపరేషన్లు జరిగిన తర్వాత రెస్ట్‌లో ఉండడం వల్ల కండరాలు వీక్ అయిపోతాయి. మళ్లీ నార్మల్ ఆక్టివిటీ రావాలంటే కండరాల బలం పెంచాల్సిన అవసరం ఉంటుంది. పేషెంట్ పరిస్థితిని బట్టి ఎక్సర్‌సైజ్ అడ్వైజ్ చేస్తాం. కాబట్టి మళ్లీ నార్మల్ స్టేజికి రావాలంటే ఎక్సర్‌సైజ్ అవసరం కంపల్సరీ ఉంటుంది. దాంట్లో పేషంట్ అవసరాన్ని బట్టి రకరకాల ఎక్సర్‌సైజ్ చేపిస్తాం. ఉదాహరణకు ఇన్గ్వినల్, అబ్డామినల్, హెర్నియా లాంటి ఆపరేషన్ తర్వాత కండరాల బలం పెంచాల్సిన అవసరం కంపల్సరీగా ఉంటుంది.

నవతెలంగాణ: మోకాలు, తొంటి మార్పిడి ఆపరేషన్ తర్వాత మిగతా కీళ్ల ఆపరేషన్లలో అవసరం ఏంటి?

డాక్టర్: ఒక వ్యక్తి కీళ్లు అరిగినప్పుడు కీళ్ల మార్పిడి చేస్తా ఉంటారు. అట్లాంటి సమయంలో కీలు అరగడం వల్ల దాని ఆకారం మారిపోతాయి. అటువంటి సమయంలో కండరాలు బలహీనం అవ్వడం జరుగుతుంది. అలాంటి పరిస్థితులలో కండరాలు బలం పెంచి మామూలు నడక రావాలి అంటే ఆపరేషన్ ముందు కూడా ఫిజియోథెరపీ అవసరం ఉంటుంది. కానీ మన దగ్గర ఆపరేషన్ తర్వాత మాత్రమే ఫిజియోథెరపీ చేయించుకోవడం జరుగుతుంది. అలా కాకుండా ప్రీ ఆపరేటివ్ ఫిజియోథెరపీ తీసుకోవడం వల్ల ఆపరేషన్ తర్వాత రికవరీ ఈజీ ఉంటుంది.

నవతెలంగాణ : మెడనొప్పి నడుం నొప్పి లాంటి వెన్ను సమస్యల్లో ఫిజియోథెరపీ ఎలా పని చేస్తుంది?

డాక్టర్: ఈ మధ్యకాలంలో మనం సాధారణంగా అన్ని వయసులో మెడ నొప్పి, నడుం నొప్పి లాంటివి సమస్యలను మనం చూస్తా ఉన్నాం. వీటిలో కొన్ని నొప్పుల్లో తాత్కాలికంగా ఉపశమనం కోసం మందులు వాడడం వల్ల నొప్పి తగ్గుతుంది. కానీ మళ్లీ వెన్ను సాధారణ స్థితికి రావాలంటే ఫిజియోథెరపీలో నొప్పి తగ్గించడం కోసం ఉపయోగించే ఎలక్ట్రోతెరపి అదే విధంగా ఎక్సర్‌సైజ్‌లు చాలా బాగా ఉపయోగపడతాయి. భవిష్యత్తులో నొప్పి వచ్చే అవకాశాన్ని తగ్గిస్తాయి. మందులు కెమికల్ పెయిన్ మాత్రమే తగ్గిస్తాయి. మెకానికల్ పెయిన్స్‌కు కంపల్సరీ ఫిజియోథెరపీ అవసరం ఉంటుంది.

నవతెలంగాణ: చెస్ట్ ఫిజియోథెరపీ అంటే ఏమిటి?

డాక్టర్: చెస్ట్ ఫీజు అయితే ఊపిరితిత్తుల సమస్య వచ్చినప్పుడు గానీ అదే విధంగా గుండె ఆపరేషన్లు గుండె సమస్యలు ఉన్నప్పుడు ఊపిరితిత్తుల్లో నీరు పేరుకొని ఊపిరి తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. అట్లాంటి పరిస్థితులలో ఊపిరితిత్తులలో ఉన్న నీరు బయటకు పోవడం కోసం పోస్చరల్ డ్రయినేజీ, చెస్ట్ ఫిజియోథెరపీని ఉపయోగించి ఊపిరితిత్తులను సాధారణ స్థితికి తీసుకొని రావడం జరుగుతుంది. ఈ చెస్ట్ ఫిజియోథెరపీ అనే చికిత్స కరోనా తర్వాత ఎక్కువగా అవగాహనలోకి వచ్చింది.

నవతెలంగాణ: స్పోర్ట్స్ ఫిజియోథెరపీ అంటే ఏమిటి?

డాక్టర్: క్రీడల్లో తగిలే గాయాల చికిత్సలో భాగంగా అదేవిధంగా కండరాల ధృఢత్వం పెంచడం కోసం ఆ క్రీడను బట్టి అవసరమైన కండరాల బలం పెంచడం కోసం ఫిజియోథెరపీ అవసరం పడుతుంది.

నవతెలంగాణ: ప్రెగ్నెన్సీలో ఫిజియోథెరపీ ఉపయోగం ఉంటుందా?

డాక్టర్: ఈ మధ్యకాలంలో డెలివరీలలో నార్మల్ డెలివరీ కంటే సిజేరియన్ డెలివరీ ఎక్కువగా అవుతున్నాయి. దీనికి కారణం ప్రజల్లో ఎక్సర్‌సైజ్ లేకపోవడం. పాతకాలంలో ఎవరి పనులు వాళ్లు చేసుకోవడం వల్ల కండరాలు బలంగా ఉండేటివి. కానీ ఇప్పుడున్న పనులు టెక్నాలజీ వల్ల శారీరక శ్రమ తగ్గి కండరాల బలం తగ్గింది. అట్లాంటి పరిస్థితుల్లో ప్రత్యేకమైన ఎక్సర్‌సైజ్ వల్ల నార్మల్ డెలివరీకి ఉపయోగపడుతుంది. అదేవిధంగా డెలివరీ తర్వాత రికవరీ కోసం కూడా పోస్ట్ నాటల్ ఫిజియోథెరపీ ఉపయోగపడుతుంది.

నవతెలంగాణ: జిమ్, ఫిట్నెస్ సెంటర్లలో ఫిజియోథెరపిస్ట్ అవసరం ఉంటుందా?

డాక్టర్: ఫిజియోథెరపిస్ట్ అంటేనే ఎక్సర్‌సైజ్ ట్రైనర్. కానీ మన దగ్గర ఉన్న జిమ్‌లో ఫిట్నెస్ సెంటర్లలో సర్టిఫైడ్ ట్రైనర్స్ మాత్రమే ఉంటున్నారు. అలా కాకుండా ఫిజియోథెరపిస్ట్ ఉండడం వల్ల ఎక్సర్‌సైజ్ వల్ల వచ్చే గాయాలు రాకుండా మనిషికి అవసరమైన ఫిజికల్ ఎగ్జామినేషన్ చేసి దానికి సంబంధించిన ఎక్సర్‌సైజ్ చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయి..

నవతెలంగాణ: ఫిజియోథెరపీలో ఏ ఏ నొప్పులకి సమస్యలకి పరిష్కారం ఉంటుంది?

డాక్టర్: ఫిజియోథెరపీలో కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, పక్షవాతం, ముఖం పక్షవాతం, కండరాల బలహీనత ఆపరేషన్ తర్వాత కోల్కోవడం కోసం ఫిజియోథెరపీ అవసరం పడుతుంది. ఈ మధ్యకాలంలో ప్రజల్లో అవగాహన పెరిగిన తర్వాత మందుల వల్ల ఏర్పడే దుష్ప్రభావాలు తెలిసిన తర్వాత ఆల్టర్నేటివ్ మెడిసిన్‌లో భాగంగా ఫిజియోథెరపీని ఆశ్రయిస్తు న్నారు. ప్రజల్లో అవగాహన పెరిగింది. ఇది మన జీవిన విధానం.



నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

• ప్రగ్మ హాస్పిటల్ ఏజీఎం మొరిశెట్టి సంతోష్ కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని ప్రగ్మ హాస్పిటల్ ఏజీఎం మొరిశెట్టి సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ..మా హాస్పిటల్ నందు డాక్టర్ డే సందర్భంగా జనరల్ ఫిజీషియన్ రూ.50కే కన్సల్టెన్సీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యవృత్తి చాలా పవిత్రమైనదని, వైద్యం చేసే అవకాశం కొందరికి లభిస్తుందన్నారు. జబ్బులు మొదలుకొని ప్రమాదం జరిగినప్పుడు వైద్యులే తిరిగి ప్రాణాలు పోస్తారని పేర్కొన్నారు. నిజానికి వైద్య వృత్తికి ఎంతో గుర్తింపు, గౌరవం ఉందని రోగి ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. వారి సేవలు వెలకట్టలేని అన్నారు. వారు ఉదయం మొదలు రాత్రి పడుకునే వరకు అవసరమైతే ఏ సమయంలోనైనా రోగికి సేవ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఇలాంటి పరిస్థితిలో కూడా వారు విధులు నిర్వహిస్తూ రోగిప్రాణాలను కాపాడుతుంటారని అన్నారు.



అయోధ్యలో నీట మునిగిన రోడ్లు

- వీధులు జలమయం
- ఆరుగురు అధికారులపై వేటు
- ఉన్నతస్థాయి విచారణకు ఫైజాబాద్ ఎంపీ డిమాండ్

లక్నో : వర్షాలకు యూపీలోని అయోధ్య అతలాకుతలమవుతున్నది. అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామపథ్‌లో నీళ్లు నిలిచాయి. అయోధ్యలో కొత్తగా 14 కిలోమీటర్ల పొడవైన రోడ్డుని నిర్మించారు. కాగా.. గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు రామ్ పథ్ లోని 15 బైలేన్‌లు, వీధులు జలమయమయ్యాయి. రోడ్డు పక్కనున్న ఇండ్లు నీటిలో మునిగిపోయాయి. పలు ప్రాంతాల్లో రోడ్డు ధ్వంసమైంది. దీంతో, ఆరుగురు ప్రభుత్వ అధికారులను యూపీ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారిపై వేటు వేసింది. ఈ వ్యహరంలో అహ్మదాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ భువన్ ఇన్‌ఫ్రాకామ్ ప్రయివేట్ లిమిటెడ్‌కు యూపీ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. రామ్‌పథ్ నిర్మించిన కొద్దిసేపటికే దెబ్బతిందని పీడబ్ల్యూడీ ఉత్తర్వుల్లో పేర్కొన్నది. పనిలో అలసత్వం ప్రదర్శించి సామాన్య ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీశారని ఆరోపించింది. దీనిపై తదుపరి విచారణ జరుగుతున్నదని పీడబ్ల్యూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అజయ్ చౌహాన్ తెలిపారు.

ఉన్నతస్థాయి కమిటీ వేయాలి : ఫైజాబాద్ ఎంపీ

ఈ విషయంపై ఫైజాబాద్ ఎంపీ అవధేష్ ప్రసాద్ స్పందించారు. సమాజ్ వాదీ పార్టీ(ఎస్పీ) నాయకులతో కలిసి రామ్ పథ్, ప్రభుత్వాస్పత్రి సహా అయోధ్యలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. రామ్ పథ్ నిర్మాణంలో అక్రమాలకు పాల్పడిన వారందరిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇది పెద్ద సమస్య అని.. రాముడి పేరుతో దోపిడీ జరుగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో దీనిపై విచారణ జరపాలన్నారు. ఇటు సోషల్ మీడియాలోనూ ఈ అంశం వైరల్‌గా మారుతున్నది. నిర్మించిన కొన్ని నెలలకే రోడ్డు జరలమయం కావటం పట్ల ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గుజరాత్‌లో పేపర్ లీకేజీల బాగోతం!

బీజేపీ మోడల్ రాష్ట్రంలో పలు ప్రశ్నాపత్రాలు లీక్

- లక్షలాది ఉద్యోగార్థుల ఆశలు ఆవిరి
- నిందితులకు బీజేపీతో సంబంధాలు

న్యూఢిల్లీ : పేపర్ లీకేజీల కారణంగా పరీక్షలు రద్దు కావడమే కాదు. లక్షలాది మంది అభ్యర్థుల ఆశలు కూడా ఆవిరవుతున్నాయి. గత ఐదు సంవత్సరాల కాలంలో పేపర్ లీకేజీలతో పదిహేను రాష్ట్రాలలో 41 నియామక పరీక్షలు రద్దయ్యాయి. ఫలితంగా సుమారు 1.4 కోట్ల మంది ఉద్యోగార్థులు తీవ్రమైన నిరాశానిస్పృహలకు గురయ్యారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ప్రధాని నరేంద్ర మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో, బీజేపీ ప్రభుత్వ ఏలుబడిలో అనేక ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి. పేపర్ లీకేజీ కుంభకోణం కారణంగా మోడీ సన్నిహితుడు, గుజరాత్ సెకండరీ సర్వీస్ సెలక్షన్ బోర్డు ఛైర్మన్ అశిత్ ఓరా తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ లీకేజీ బాగోతంలో ఓ ప్రింటింగ్ ప్రెస్ ప్రమేయం ఉన్నదని వార్తలు వచ్చాయి. ఈ ప్రెస్‌లోనే గతంలో మోడీ రాసిన ఓ పుస్తకాన్ని అచ్చు వేశారు.


ఉత్తరప్రదేశ్, బీహార్‌లోనే కాదు...బీజేపీ మోడల్ రాష్ట్రమైన గుజరాత్‌లోనూ పరిస్థితి దారుణంగా ఉంది. ఆ రాష్ట్రంలో జరిగిన ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో భారీ కుంభకోణాలే వెలుగు చూశాయి. నియామక పరీక్షల్లో పేపర్ లీకేజీలను అరికట్టేందుకు గత సంవత్సరం ఫిబ్రవరిలో గుజరాత్ ప్రభుత్వం శాసనసభలో ఓ బిల్లును ఆమోదించింది. రాష్ట్రంలో గడిచిన 11 సంవత్సరాల్లో 11 పేపర్ లీకేజీ కేసులు నమోదయ్యాయని, 201 మంది నిందితులపై కేసులు నమోదు చేశామని, 10 కేసుల్లో చార్జిషీట్లు కూడా దాఖలయ్యాయని బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా హోం మంత్రి చెప్పుకొచ్చారు. అయితే రాష్ట్రంలో పేపర్ లీకేజీ మూలాలు బాగా వేళ్లూనుకుపోయాయని, వాటికి బీజేపీ పాలనతో సంబంధం ఉన్నదని మాత్రం ఆయన చెప్పలేదు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన పరీక్షలన్నింటినీ గుజరాత్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (జీఎస్ఎస్ఎస్‌బీ) నిర్వహిస్తుంది. అనేక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను అహ్మదాబాద్‌లోని సూర్యా ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్‌లోనే ముద్రించారు. అక్కడి నుండే ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి.

ప్రశ్నాపత్రాన్ని అమ్ముకున్నారు

2021లో హెడ్ క్లర్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షకు సంబంధించిన పేపర్ లీక్ అయింది. ఈ ఉదంతం ప్రభుత్వాన్ని కుదిపేయడంతో ఓరా తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరీక్షకు 88 వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షకు ముందే ప్రశ్నాపత్రాన్ని లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారని ఆరోపణలు రావడంతో చివరికి పరీక్షను రద్దు చేశారు. ఈ కేసులో గుజరాత్ పోలీసులు 14 వేల పేజీల చార్జిషీటును దాఖలు చేశారు. ఈ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తూనే ఉంది. సూర్య ప్రెస్‌లోనే పేపర్ లీక్ అయిందని పోలీసులు గుర్తించారు.

అవినీతిపరుడికి అందలం

2004-05లోనే సూర్య ప్రింటింగ్ ప్రెస్‌ను గుజరాత్ యూనివర్సిటీ బ్లాక్‌లిస్టులో పెట్టింది. ఈ ప్రెస్ రాష్ట్రంలోని ఐదు యూనివర్సిటీలకు పరీక్షా పత్రాలు ముద్రించి ఇస్తుంది. ప్రెస్ యజమాని ముద్రేష్ పురోహిత్‌కు ఆర్ఎస్ఎస్, బీజేపీతో సంబంధాలు ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. అయితే ఈ ఆరోపణను ఆయన తోసిపుచ్చారు. కాగా అరెస్టు నుండి తప్పించుకునేందుకు ముద్రేష్ కోర్టు నుండి ముందస్తు బెయిల్ పొందారు. ఇక జీఎస్ఎస్ఎస్‌బీ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఓరా పదవీకాలంలో రెండు ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. ఆయన హయాంలో పరీక్షా ఫలితాల తారుమారు సహా 61 ఆరోపణలు వచ్చాయి.



అయినప్పటికీ ఆయనకు బీజేపీ ప్రభుత్వం రెండోసారి అదే పదవిని కట్టబెట్టింది. బీజేపీ పాలనలో ఓరా అనేక పదవులు నిర్వహించారు. అహ్మదాబాద్ మేయర్‌గా, మున్సిపాలిటీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు.

ప్రభుత్వ ప్రమేయంతోనే : కాంగ్రెస్

గత దశాబ్ద కాలంలో ప్రభుత్వోద్యోగాలలో నియామకాలకు సంబంధించి 14 పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని కాంగ్రెస్ ప్రతినిధి మనీష్ దోషీ చెప్పారు. 2020-21, 2022-23 మధ్యకాలంలో గుజరాత్‌లో విద్యార్థుల ఆత్మహత్యలు 21 శాతం పెరిగాయి. పరీక్షా పత్రాల లీకేజీలు కూడా ఆత్మహత్యలకు కారణమయ్యాయి. ప్రభుత్వ ప్రమేయం లేకుండా పేపర్ లీకేజీలు ఎలా జరుగుతాయని దోషీ ప్రశ్నించారు. రాష్ట్రంలో పేపర్ లీకేజీలు వ్యవస్థీకృత నేరంగా మారాయని మండిపడ్డారు. ఉద్యోగ ప్రకటన వెలువడిన వెంటనే రేటు నిర్ణయిస్తారని, లక్షలాది రూపాయలకు ప్రశ్నాపత్రాన్ని అమ్ముకుంటారని తెలిపారు.

నూతన ఆర్మీచీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ : లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (సిఒఎఎస్)గా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 1964 జులై 1న జన్మించిన లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది 1984 డిసెంబర్ 15న సైన్యం (జమ్ము కాశ్మీర్ రైఫిల్స్)లో చేరారు. కమాండ్ ఆఫ్ రెజిమెంట్ (18 జెకెరైఫిల్స్), బ్రిగేడ్ (26 సెక్టార్ అస్సాం రైఫిల్స్), డిఐజి, అస్సాం రైఫిల్స్ (తూర్పు), 9 కార్ప్స్ వంటి కీలక పదవుల్లో పనిచేశారు. నార్తర్న్ ఆర్మీ కమాండర్‌గా సుదీర్ఘ కాలం సేవలందించారు.

మధ్యప్రదేశ్‌లోని రేవా సైనిక్

బాధ్యతల స్వీకరణ

స్కూల్‌లో ద్వివేది చదువుకున్నారు. నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి ఆయన పూర్వ విద్యార్థి.

ఆర్మీ చీఫ్‌గా రెండేళ్లు సేవలందించిన జనరల్ మనోజ్ పాండే ఆదివారం పదవీ విరమణ చేశారు. 2022 ఏప్రిల్ 30న ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన మనోజ్ పాండే ఈ ఏడాది మే 30న పదవి విరమణ చేయాల్సి వుంది. కొత్త చీఫ్ నియామకంలో జాప్యం కారణంగా కేంద్రం ఆయన సర్వీసును నెలరోజుల పాటు పొడిగించింది. జూన్ 11న వైస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ద్వివేదిని నూతన చీఫ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నూతన నియామకాలు

వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, సెంట్రల్ ఆర్మీ కమాండర్‌గా లెఫ్టినెంట్ జనరల్ అనింద్యసేన్‌గుప్తా, సౌత్ ఆర్మీ కమాండర్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేత్, సౌత్‌వెస్ట్ ఆర్మీ కమాండర్‌గా లెఫ్టినెంట్ జనరల్ మంజీందర్‌సింగ్ నియమితులయ్యారు.



మనోజ్‌పాండే నుంచి నూతన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉపేంద్ర ద్వివేది

విపక్ష సభ్యుల విశ్వాసం పొందుతారా?

- గత లోక్‌సభలో ఆయన తీరుపై ప్రతిపక్షాల అసంతృప్తి
- ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు
- బిల్లులను పార్లమెంటరీ కమిటీలకు పంపకుండానే ఆమోదించారన్న అపవాదు
- ఈసారి అప్రమత్తత అవసరమంటున్న ప్రతిపక్షాలు

వరుసగా రెండోసారి స్పీకర్‌గా ఓం బిర్లా



న్యూఢిల్లీ : లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా రెండోసారి పదవిని చేపట్టారు. స్పీకర్ ఎంపిక విషయంలో అధికార ఎన్డీఏ, ప్రతిపక్షాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవటంతో దేశ చరిత్రలో ఎన్నిక అనివార్యమైంది. అధికార బలంతో చివరకు ఎన్డీఏ అభ్యర్థి ఓం బిర్లానే లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అయితే, ఓం బిర్లా మరో మారు ఎన్నికైనందును ప్రతిపక్షాలు ఆయన హయాంలో లోక్‌సభలో జరిగిన కొన్ని సంఘటనలను గుర్తు చేస్తున్నాయి. ఈ సభలో కూడా అలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉండాలని అంటున్నాయి. అయితే, ఆయన ఈ సారి విపక్ష సభ్యుల విశ్వాసాన్ని పొందుతారా? సభను సక్రమంగా నడుపుతారా? పాలక, ప్రతిపక్షాలకు సమానావకాశాలు కల్పించి, సభను ప్రశాంతంగా ఉంచ గలరా? అనే అనుమానాలను రాజకీయ పరిశీలకులు, విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

మణిపూర్ ఎంపీలకు నో ఛాన్స్

లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా తన మొదటి పదవీకాలంలో 17వ లోక్‌సభలో వ్యవహరించిన విధానాన్ని అప్పటి ప్రతిపక్ష ఎంపీలు తప్పుబట్టారు. అనేక మంది ప్రతిపక్ష ఎంపీలు సమర్థవంతమైన సభ్యులుగా పనిచేయటం కష్టంగా ఉండటమే కాకుండా మొత్తం దేశాన్ని ఆందోళనకు గురిచేసే అంశాలపై మాట్లాడేందుకు అధికార పార్టీ సభ్యులను కూడా అనుమతించ లేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఉదాహరణకు.. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పుడు, మణిపూర్ హింసపై కష్టాలను చర్చించినప్పుడు, ఇద్దరు ఎంపీలు మోడీ క్యాబినెట్‌లో విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన బీజేపీకి చెందిన ఆర్.కె రంజన్ సింగ్, మోడీ ప్రభుత్వానికి మద్దతిచ్చిన నాగా పీపుల్స్ ఫ్రంట్ లోర్హో ఎస్. ఫోజ్‌లకు బీజేపీ అగ్ర నాయకత్వం కొన్ని ఆదేశాలిచ్చింది. ప్రభుత్వం తరఫున కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మాట్లాడుతున్నందున.. సంబంధిత అంశంపై చర్చించొద్దని ఆ ఇద్దరు ఎంపీలకు చెప్పటం గమనార్హం. హింసను ఎదుర్కొంటున్న మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఎంపీలకు ఆ అవకాశం నిరాకరించటంతో వారు లోక్‌సభలో తమ బాధలను ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రాతినిధ్యం వహించలేకపోయారు. ప్రజలు ఎదుర్కొంటున్న బాధలను వారు సభలో పూర్తిగా వివరించలేకపోయారు.

స్పీకర్‌గా ఓం బిర్లా తన విధులను సక్రమంగా నిర్వహించటంలో విఫలమయ్యారని ప్రతిపక్ష నాయకులు చెప్పారు. సభలో సభ్యుల హక్కులను పరిరక్షించి, అందరికీ అవకాశమిస్తూ నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఆయన.. అధికార పక్షం కనుసన్నల్లో నడిచారని ఆరోపించారు. ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేస్తూ కొత్త క్రిమినల్ చట్టాలను ఆమోదించుకున్న సందర్భమూ గర్హనీయమని ప్రతిపక్షాలు గుర్తు చేస్తున్నాయి. ఇలాంటి ట్రాక్ రికార్డున్న ఓం బిర్లా.. కొత్తగా ఎన్నికైన లోక్‌సభకు రెండోసారి స్పీకర్ కావటం ప్రతిపక్ష ఎంపీలకు నిరాశను కలిగిస్తున్నదని అంటున్నాయి.

సంప్రదింపులు లేకుండానే వ్యవసాయ చట్టాలు ఆమోదం

ఓం బిర్లా హయాంలో లోక్‌సభలో ఆమోదించిన వివాదాస్ప వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఏడాదిపాటు చేసిన ఉద్యమాన్ని దేశం మరచిపోలేదు. అయితే, సాగు చట్టాల విషయంలో ఎలాంటి ఫలవంతమైన చర్చలు, వాటాదారులతో సంప్రదింపులు లేకుండా ఆమోదించారని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. కాగా, చివరకు రైతుల ఉద్యమాల కారణంగా ఆ వివాదాస్పద వ్యవసాయ చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిన విషయం విదితమే.

బిల్లులను పార్లమెంటరీ కమిటీలకు పంపలేదు

కొన్ని వివాదాస్పద బిల్లుల విషయంలోనూ ఓం బిర్లా స్పీకర్‌గా తన విధులను సక్రమంగా నిర్వర్తించలేదని విమర్శకులు చెప్తున్నారు. బిల్లులను పార్లమెంటరీ కమిటీలకు పంపని సందర్భాలు అనేకం ఉన్నాయని వారు గుర్తు చేస్తున్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ లోక్‌సభ నియమాలను పాటించకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఆయన విధానం కనిపించిందని చెప్తున్నారు. 17వ లోక్‌సభలో బిల్లులపై ఎటువంటి చర్చ జరగలేదనీ, శాసనపరమైన ఉద్దేశం లేకుండానే వాటికి తుది రూపం ఇవ్వకుండా ఆమోదం పొందాయని రాజకీయ విమర్శకులు చెప్తున్నారు. 2014కి ముందు, అనేక ప్రభుత్వ శాఖలు రూపొందించిన బిల్లులను స్పీకర్ పరిశీలనల కోసం అనేక శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు పంపేవారు. అయితే, ఓం బిర్లా పదవీకాలంలో సాధారణంగా ద్వైపాక్షిక ప్రాతిపదికన పనిచేసే కమిటీలకు చాలా తక్కువ బిల్లులు సూచించబడటం గమనార్హం.


పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ డేటా ప్రకారం.. స్పీకర్ ఓం బిర్లా 17వ లోక్‌సభను కవర్ చేసిన తన మొదటి పదవీ కాలంలో కేవలం 16 శాతం బిల్లులనే సంబంధిత కమిటీలకు పంపారు. ద్వైపాక్షిక ప్రాతిపదికన బిల్లుల పరిశీలన ఆధారంగా పటిష్టమైన చట్టాన్ని రూపొందించే ప్రక్రియకు ఇది మంచిది కాదని నిపుణులు చెప్తున్నారు. బిల్లులను కమిటీలు పరిశీలించిన తర్వాత కూడా లోక్‌సభలో వాటిపై చర్చ జరగలేదని అంటున్నారు. పాలక, ప్రతిపక్ష సభ్యులతో కూడిన బిల్లులపై చర్చ జరిగినప్పుడు బిల్లులను చక్కదిద్దే శాసనపరమైన ఉద్దేశం సాధ్యమవుతుందని చెప్తున్నారు.

విపక్ష సభ్యులే టార్గెట్‌గా పార్లమెంట్‌లో చర్యలు

అదానీ అంశంపై విపక్ష నేతల పలు వ్యాఖ్యలను రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలగించటంతో చర్చా వేదికగా పార్లమెంటు పాత్ర క్షీణించిందని ప్రతిపక్షాలు అంటున్నాయి. అటువంటి ట్రాక్ రికార్డ్‌తో.. ఓం బిర్లా తన రెండో టర్మ్‌లో, కొత్తగా ఎన్నికైన 18వ లోక్‌సభకు చెందిన ఎంపీలలో విశ్వాసం కలిగించగలరా? నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ సభా నియమాలను నిక్కచ్చిగా పాటిస్తారా? అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. లోక్‌సభ, రాజ్యసభ నుంచి 140 మందికి పైగా విపక్ష సభ్యులను సస్పెండ్ చేయటంతో స్పీకర్, ఛైర్మెన్లు ప్రతిపక్షాలను శిక్షించాలనే ఉద్దేశం బయటపడిందని అంటున్నాయి.

నవచిత్రం

ఎవడి కోసం తగ్గాలి?



హీరో అల్లరి నరేష్ తాజాగా నటిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. ఆదివారం ఆయన బర్త్‌డే సందర్భంగా మేకర్స్ హీరో ఇంటెన్స్ క్యారెక్టర్‌ని పరిచయం చేస్తూ ఒక స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్నారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి బ్లాక్‌బస్టర్‌లను అందించిన హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు.

హీరో ఇంటి దగ్గర లౌడ్‌స్పీకర్‌లో భగవద్గీత ప్లే చేయడంతో గ్లింప్స్ ఓపెన్ అవుతుంది. అది హీరో నిద్రకు భంగం కలిగిస్తుందని దానిని ఫెరోషియస్‌గా రిమూవ్ చేస్తాడు. తర్వాత లోకల్ బార్‌లో స్టైల్‌గా ఆల్కహాల్ సేవించి, అక్కడ ఉన్న గూండాలతో ఫైట్ చేసిన ఎపిసోడ్ అదిరిపోయింది. 'ఏయ్ ఎవడి కోసం తగ్గాలి... ఎందుకు తగ్గాలి' అంటూ అల్లరి నరేష్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ క్యారెక్టర్ మొండి వైఖరిని డిఫైన్ చేసింది. అల్లరి నరేష్ సరసన అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కథ, సంభాషణలు సుబ్బు స్వయంగా అందించగా, విప్పర్తి మధు స్క్రీన్‌ప్లే, ఎడిషనల్ స్క్రీన్‌ప్లే విశ్వనేత్ర సమకూరుస్తున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్‌లో విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం- విశాల్ చంద్రశేఖర్, డీవోపీ- రిచర్డ్ ఎం.నాథన్, ఎడిటింగ్- ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్- బ్రహ్మ కడలి.

వినూత్న కాన్సెప్ట్‌తో అల్లరి నరేష్ నయా చిత్రం

హీరో అల్లరి నరేష్ మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది.

అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా 'మీరు అతని కంటి నుండి తప్పించుకోలేరు' అంటూ విలక్షణమైన కాన్సెప్ట్ పోస్టర్‌తో నిర్మాణ సంస్థ ఈ చిత్ర ప్రకటన చేసింది. సంకేత భాషతో రూపొందించిన ఈ పోస్టర్ ఎంతో సృజనాత్మకంగా ఉంది. 'ఫ్యామిలీ డ్రామా' చిత్రంతో ప్రశంసలు పొందిన రచయిత-దర్శకుడు మెహర్ తేజ్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. నూతన కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించి, ఘన విజయం సాధిస్తుందని నిర్మాతలు నమ్మకం వ్యక్తం చేశారు. అల్లరి నరేష్ నటించబోయే 63వ చిత్రంగా రానున్న ఈ సినిమా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.29గా రూపొందనుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

వైభవంగా ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక




విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు పేరిట సినిమా రంగంలో అన్ని విభాగాలలో విశేష ప్రతిభ కనబర్చిన నటీ నటులకు, సాంకేతిక నిపుణులకు 'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ - 2023' పేరుతో ఇచ్చే నంది అవార్డుల ప్రదానోత్సవ వేడుక హైదరాబాద్‌లోని హెూటల్ దసపల్లాలో అతిరథ మహారథుల సమక్షంలో జరిగింది. కళావేదిక (ఆర్.వి.రమణ మూర్తి), రాఘవి మీడియా ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు.

నందమూరి మోహన్ కృష్ణ, నందమూరి మోహన రూప, మురళి మోహన్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షులు కే.ఎల్.దామోదర్ ప్రసాద్, కార్యదర్శి టి. ప్రసన్నకుమార్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవితోపాటు పలువురు సినీ ప్రముఖులు ఈ వేడుకలో అతిథులుగా పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఫిలిం లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డును మురళీమోహన్, నందమూరి మోహన్ కృష్ణ, ఉత్తమ కథానాయకుడిగా బేబీ చిత్రానికి ఆనంద్ దేవరకొండ, ఉత్తమ దర్శకుడిగా బేబీ చిత్రానికి సాయి రాజేష్, ఉత్తమ నిర్మాతగా 'భగవంత్ కేసరి' చిత్రానికి సాహు గారపాటి, ఉత్తమ విలన్‌గా 'యక్షిని' వెబ్ సిరీస్ నుంచి అజయ్, ఉత్తమ నూతన దర్శకుడిగా 'దసరా' చిత్రానికి శ్రీకాంత్ ఓదెల, ఉత్తమ నూతన నటుడిగా తిరువీర్ ఎన్టీఆర్ ఫిలిం పురస్కారాలను గెలుచుకున్నారు. ఈ అవార్డులను మురళీమోహన్, నందమూరి మోహన్ కృష్ణ చేతుల మీదగా విజేతలకు అందజేశారు. బెస్ట్ లిరిక్ రైటర్‌గా కాసర్ల శ్యామ్, బెస్ట్ రైటర్‌గా కళ్యాణ్ చక్రవర్తి, బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా రఘుకుంచె, బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ ఫిమేల్‌గా శరణ్య ప్రదీప్, బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా హర్షవర్ధన్, బెస్ట్ మేల్ సింగర్‌గా రాహుల్ సిప్లిగంజ్. బెస్ట్ సినిమాటోగ్రాఫర్‌గా దాశరధి శివేంద్ర, బెస్ట్ ఆర్ట్ డైరెక్టర్‌గా నాగేంద్ర, బెస్ట్ ఎడిటర్‌గా చోటా కే ప్రసాద్, బెస్ట్ ఫిమేల్ సింగర్‌గా మంగ్లీ ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డులను సొంతం చేసుకున్నారు.

డయాబెటిక్ అరికట్టడం ఎలా..



డాక్టర్ ఎస్ఎం. కుతుబుద్దీన్ అలీ, రెటీనా కన్సల్టెంట్, ఆన్ న్యూ ఐ కేర్

నవతెలంగాణ ప్రశ్న:- అసలు డయాబెటిక్ రెటినోపతి అంటే ఏమిటి?

డాక్టర్ కుతుబుద్దీన్ అలీ :- మధుమేహ రోగుల్లో కంటి నరానికి చెందిన పొర రెటీనాలో జరిగే మార్పులు, తద్వారా వాటి రక్తనాళాల్లో జరిగే తిరుగులేని నష్టాన్ని, కంటి చూపుకు ఏర్పడే ప్రమాదాన్ని డ, రే అంటారు.

నవతెలంగాణ ప్రశ్న: దయాబెటిక్ రోగుల్లో అందరికీ డ,రే సంభవించే ప్రమాదం ఉందా!

డాక్టర్ :- మధుమేహ రోగుల్లో దాదాపు వన్ 1/3(35%) మందిలో డ, రే గమనిస్తుంటాం. వారిలో కూడా దాదాపు 20% మందిలో అతి తీవ్ర మార్పులు, కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుంది.ఎవరికైతే చక్కెర లెవెల్స్ సరైన మోతాదులో ఉండి, షుగర్ వ్యాధి పూర్తిస్థాయిలో కంట్రోల్లో ఉంటుందో, వారిలో డ, రే ఉండదు. కానీ ఇది తిరుగులేని (ఇన్‌వేర్‌సిబీల్)దోమపిల్ కాబట్టి, క్రమం తప్పకుండా కంటి స్పెషలిస్ట్ డాక్టర్ వద్ద పరీక్ష చేయించుకోవాలి.

నవతెలంగాణ ప్రశ్న: ఒకవేళ అప్పటికే డ,రే వచ్చి ఉంటే ఎలా?

డాక్టర్ :- కంటి డాక్టర్ పరీక్షించే సమయానికి డ, రే మార్పులు వచ్చి ఉంటే దాని తీవ్రత, అవసరానికి తగ్గట్టుగా లేసర్ చికిత్స, మందులు, లేదా ఆపరేషన్ చేయవలసి ఉంటుంది. అతి ముఖ్యమైనది షుగర్ వ్యాధి కంట్రోల్‌లో ఉంచుకోవడం అవసరం.



సూచనలు

- షుగర్ వ్యాధిగ్రస్తులు అందరూ క్రమం తప్పకుండా, కచ్చితంగా కంటి పరీక్ష చేయించుకోవాలి.
- షుగర్ వ్యాధిని పూర్తిస్థాయిలో కంట్రోల్ చేసుకోవాలి.
- డాక్టర్ సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడాలి.
- ఆహార నియమాలు,సరైన వ్యాయామం, ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవర్చుకోవటం, మనస్సుని ప్రశాంతంగా ఉంచుకుంటూ ఇష్టమైన వ్యాపకాన్ని పాటించాలి.

థైరాయిడ్ సమస్యను ఎదుర్కోవడం ఎలా

డాక్టర్ భవానీ వడ్డే, ఫ్యామిలీ ఫీజీషియన్ యూఎస్ఏ



నవతెలంగాణ-పెద్దఅంబర్ పేట్

నవతెలంగాణ ప్రశ్న : డాక్టర్ గారు, ఈ మధ్య అన్ని వయసుల వారిలో ఎక్కువగా వినపడే థైరాయిడ్ సమస్య గురించి వివరించండి

డాక్టర్ భవానీ : మన శరీరంలో గొంతు క్రింద భాగంలో ఒక చిన్న సీతాకోకచిలుక (బట్టర్ ఫ్లై) ఆకారంలో ఉండి మనకు అవసరమయ్యే టీ 4 (థైరాక్సిన్), టీ3(ట్రై అడో థైరాసిన్) అనే హార్మోన్స్ ను తయారు చేసే గ్రంధి థైరాయిడ్.

ఈ హార్మోన్ సరైన మోతాదులో కాకుండా తక్కువ కానీ(హైపోథైరాయిడ్) లేదా ఎక్కువ గానీ ఉత్పత్తి అవ్వడాన్ని థైరాయిడ్ సమస్య అంటారు.

నవతెలంగాణ ప్రశ్న: ఇది ఏ వయసు వారిలో కనిపిస్తుంది మరి దీని లక్షణాలు ఏమిటి?

డాక్టర్ : థైరాయిడ్ సమస్య గర్భస్థ మహిళల్లోని లోపాల వల్ల పుట్టిన శిశువుల్లో నుంచి, యుక్త వయసులో మధ్య వయసు దాదాపు అన్ని వయసుల వారిలో ఉండవచ్చు.

గర్భంతో ఉన్న స్త్రీలలో థైరాయిడ్ లోపం వల్ల శిశువుల అతి తీవ్రమైన మానసిక ఎదుగుదల లోపం (రెటీన్సిమ్) ఉంటుంది. యుక్త వయసులో సరైన సమయంలో ఆడపిల్లలు రజస్వల ఆలస్యం అవ్వడం, బరువులో మార్పులు, జుట్టు రాలటం, నిరసంగా ఉండడం చూడవచ్చు. మధ్య వయసులో పై వాటితో పాటు, విపత్తు తద్వారా వచ్చే జీవనశైలి మార్పుల వల్ల బీపీ, మధుమేహం, హృద్రోగ సమస్యలు రావచ్చు.



నవతెలంగాణ ప్రశ్న: ఏ పరీక్షలు చేయించుకోవాలి

డాక్టర్ : ఇతర సాధన పరీక్షలతో పాటు థైరాయిడ్ ఫంక్షన్ టెస్టు క్రమం తప్పకుండా చేయించుకోవాలి. కొందరిలో ఈ టెస్టులు నార్మల్ గా ఉన్న థైరాయిడ్ సూచనలు ఉండొచ్చు. కాబట్టి మీ ఫిజీషియన్ సంప్రదించి, తగిన జాగ్రత్తలు అవసరమైన మందులు వాడాలి.

చివరగా వీటితోపాటు సరైన వ్యాయామం పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించాలి.

సేవకు ప్రతిరూపం డాక్టర్లు

డా. ఎం. రామ క్రిష్ణా రెడ్డి, ఎంబీబీఎస్, డీటీసీడీ, డీఎన్‌బీ, ఎఫ్‌సీసీపీ (యుఎస్ఏ)
పల్మనాలజిస్ట్, ఛాతి వ్యాధి వైద్య నిపుణులు ఆస్తమా, అలర్జీ, స్లీప్, ఊపిరితిత్తుల వ్యాధి ప్రత్యేక వైద్య నిపుణులు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

న్యుమోనియా అనేది ఊపిరితిత్తులలోని గాలి సంచుల (అల్వీఎఒలీ) ఇన్‌ఫెక్షన్. ఊపిరితిత్తులలో ద్రవం లేదా చీము నిండిపోవడానికి ఇది దారితీస్తుంది. దీని వలన శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు బ్యాక్టీరియా, వైరస్‌లు లేదా ఫంగస్ కారణం కావచ్చు. న్యుమోనియా ఎక్కువగా చిన్న పిల్లలు, వృద్ధులలో తీవ్రంగా ఉంటుంది. ధూమపానం, ఊపిరితిత్తుల సమస్యలు బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్న వ్యక్తులు న్యుమోనియా బారిన పడే అవకాశం ఎక్కువ. జ్వరం, దగ్గు, శ్లేమ, శ్వాస ఆడకపోవుటం న్యుమోనియా యొక్క సాధారణ లక్షణాలు. ఊపిరితిత్తుల ఎక్స్ రే లేదా సీటీ స్కాన్ ద్వారా న్యుమోనియాను గుర్తించవచ్చు. చాలా సందర్భాలలో యాంటీబయాటిక్‌లు న్యుమోనియాకు చికిత్స చేయడానికి ఉపయోగిస్తారు. ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ధూమపానం మానేయడం, తరచుగా చేతులు శుభ్రపరచుకోవడం న్యుమోకోకల్ న్యుమోనియా టీకా వేయించుకోవడం, ఇన్‌ఫ్లూయెన్సా న్యుమోనియా వ్యాక్సిన్ తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలి. తీవ్రమైన న్యుమోనియా ఉన్న రోగులకు ఆసుపత్రిలో చికిత్స అవసరం కావచ్చు.



ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ చక్కని పరిష్కారం


మారుతున్న జీవనశైలి మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా మానసికంగా మనల్ని కుంగదీస్తుంది. పరిస్థితులకు అనుగుణంగా మనం సరైన వైద్యం చేయించుకుంటే, డాక్టర్లు సరైన వైద్యం అందిస్తే నిండు నూరేళ్లు అరోగ్యంగా ఉండొచ్చంటున్నారు ప్రముఖ హోలిస్టిక్ హెల్త్ ఫిజీషియన్ డా.ప్రత్యుష నేరెళ్ల తన తల్లి ఎదుర్కొన్న ఆరోగ్య సమస్యలే ఆమెను ఇలా ఆలోచింపజేశాయి. ఈ రోజు డాక్టర్స్ డే సందర్భంగా ఆమె ఇస్తున్న సలహాలు, సూచనలు మానవి పాఠకులకు ప్రత్యేకం...







మా సొంతూరు నెల్లూరు. స్కూలింగ్, ఇంటర్ అక్కడే చదివాను. చిన్నప్పటి నుండి డాక్టర్ కావాలని కలలు కన్నాను. కర్నూల్ గవర్నమెంట్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. నారాయణ మెడికల్ కాలేజీలో ఎం.డి చేశాను. సాధారణంగా ఎం.డి తర్వాత అందరూ సూపర్ స్పెషలిటీ వైపు వెళతారు. కాని నేను మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించాను. ఎందుకంటే మా అమ్మకు మానసిక సమస్య ఉండేది. వాటి కోసం వాడిన మందుల వల్ల షుగర్ కూడా వచ్చింది. షుగర్ కోసం డైట్ కంట్రోల్ చేయాలన్నప్పుడు అదంతా భరించలేక అమ్మలో ఇంకాస్త చిరాకు, కోపం, ఆందోళన పెరిగేది. దాంతో సైకాలజీకి సంబంధించిన మందుల డోస్ పెంచాల్సి వచ్చేది. దీని వల్ల సమస్య మరింత పెరిగిపోయింది. సమస్యకు అసలు కారణం తెలుసుకోకుంటే పరిష్కారం దొరకు. అందుకు నేను ఎం.డి తర్వాత న్యూట్రీషియన్, లైఫ్‌స్టైల్, డయాబెటిస్, సైకాలజీ, ప్రానిక్ హీలింగ్ ఇలా వీటన్నింటిపై అవగాహన పెంచుకోవాలని నిర్ణయించుకున్నాను. అప్పుడు అన్ని రకాల సమస్యలకు చక్కని మార్గాన్ని చూపింగలనని అనిపించింది.



మల్టిబుల్ సమస్యలైతే...

వాస్తవానికి గతంలో మన దగ్గర వైద్యం చేయించుకునే పద్ధతి ఒకటుండేది. ఏదైనా సమస్య వస్తే ముందు జనరల్ ఫిజీషియన్ దగ్గరకు వెళ్లేవాళ్లు. తర్వాత అవసరాన్ని బట్టి వాళ్లే స్పెషలిస్ట్ దగ్గరకు ట్రీట్‌మెంట్ కోసం పంపేవారు. కానీ ఇప్పుడు ఈ పద్ధతిలో మార్పు వచ్చింది. శరీంలో ఏ భాగానికి సమస్య వస్తే ఆ స్పెషలిస్ట్ దగ్గరకు పరిగెడుతున్నాం. ఒకే సమస్య వస్తే అలా వెళ్ళినా ఇబ్బంది ఏమీ ఉండదు. కానీ మనలో మల్టిబుల్ సమస్యలు వచ్చినప్పుడు మాత్రం కచ్చితంగా ముందు జనరల్ ఫిజీషియన్ దగ్గరకు వెళ్ళడమే మంచిది. వాళ్లు అన్ని విధాలుగా ఆలోచించి చక్కని సూచనలిస్తారు. దీనివల్ల సమస్యకు సరైన పరిష్కారం దొరుకుతుంది.

మెదడు కూడా ఉంటుంది

శరీరంలో చాలా సమస్యలకు ముఖ్య కారణం మానసిక ఆందోళన. దీన్ని ముందు కంట్రోల్ చేయగలిగే శరీరంలోని సమస్యను కచ్చితంగా పరిష్కరించుకోవచ్చు. ఎందుకంటే మానవ శరీరంలో కేవలం శరీర భాగాలు మాత్రమే ఉండవు. అన్నింటికీ స్పందించే మెదడు కూడా ఉంటుంది. దీన్ని చాలా మంది మర్చిపోతున్నారు. మా అమ్మ విషయంలో నేను ఈ సమస్యను చూశాను. వాస్తవానికి ఓ జనరల్ ఫిజీషియన్, ఓ సైకాలజిస్ట్, ఓ న్యూట్రీషియన్ కలిసి వర్క్ చేసినప్పుడు పేషంట్ సమస్యను త్వరగా పరిష్కరించవచ్చు. ఇందంతా దృష్టిలో పెట్టుకొనే నేను మల్టిబుల్ ఇంటిగ్రేటెడ్ ప్రాక్టీస్ చేస్తున్నాను.

సమస్య మూలల్లోకి వెళ్లి

మల్టిబుల్ ఇంటిగ్రేటెడ్ పద్ధతిలో మేము పేషంట్ వచ్చినప్పుడు సమస్య మూలాల్లోకి వెళతాం. ముందుగా క్లీనికల్ ఎగ్జామినేషన్, హిస్టరీ, బ్లడ్ వర్క్ అప్ చేయడం, సస్యలను గుర్తించడం, డైట్ చెప్పడం, సైకాలజిస్ట్ సమస్య ఏదైనా ఉంది అనిపిస్తే కౌన్సెలింగ్ చేస్తాము. మా దగ్గరకు వచ్చే వారిలో ఎక్కువగా చాలా రోజుల నుండి మందులు వాడుతున్నా సమస్య పరిష్కారం కాని వారు, రిపోర్ట్స్ అన్నీ నార్మల్‌గా ఉన్నా శరీరంలో ఏదో ఒక బాధ ఉన్న వారు ఉంటారు. అలాంటి వారికి అవసరమైన ట్రీట్‌మెంట్ చేస్తాం. ఇంటిగ్రేటెడ్ అప్రోచ్‌లో అన్ని రకాల సమస్యలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తుంటాం. తర్వాత కాలంలో వాళ్లు మందులు ఆపేసి ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారు. మెడిసన్ వాడినా పరిష్కారం రాని వారికి అదే మెడిసెన్‌తో పరిష్కారం వచ్చేలా చేస్తాం. అంటే ఈ అప్రోచ్‌లో మేము వాళ్లలో పాజిటివ్ ధోరణిని అభివృద్ధి చేస్తాం. అందుకే మంచి ఫలితాలు వస్తున్నాయి.

ప్రభుత్వం బాధ్యత తీసుకుంటే...

ఇంటి గ్రేటెడ్ అప్రోచ్ మన దేశంలో ఇప్పుడిప్పుడే మొదలయ్యింది. భవిష్యత్‌లో ఇది మరింత విస్తృతం కావాలి. ఈ పద్ధతి విదేశాల్లో ఎప్పటి నుండో కొనసాగుతుంది. అక్కడ ఏదైనా సమస్య వస్తే ముందు కచ్చితంగా జనరల్ ఫిజీషియన్‌ను కలవాలి. లేదంటే స్పెషలిస్ట్ ట్రీట్‌మెంట్ చేయరు. మన దగ్గరకు కూడా ఇలా చేస్తే ప్రజలకు చాలా ఉపయోగం. ఇది ప్రభుత్వం మాత్రమే చేయగలుగుతుంది. ఎంబీబీఎస్ చదివేటప్పుడే స్టూడెంట్‌కి ఇవన్నీ నేర్పించాలి. వైద్యం అంటే కేవలం శరీరభాగాలకు మాత్రమే కాదు రోగి మానసిక పరిస్థితిని కూడా అర్థం చేసుకొని చికిత్స చేయాలి. అవసరమైన కౌన్సెలింగ్ ఇవ్వాలి. దీని గురించి ప్రభుత్వం మరింత బాధ్యత తీసుకుంటే ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ఇవన్నీ స్కూల్ పిల్లల పాఠ్యాంశాల్లో కూడా భాగమైతే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది.

కమ్యూనికేషన్ చాలా ముఖ్యం

ఒక పేషంట్ మా దగ్గరకు వచ్చినప్పుడు వాళ్ళకు ఏం అవసరమో అది చెప్పడం మా ముఖ్య ఉద్దేశం. మారుతున్న జీవనశైలి వల్ల ప్రతి ఒక్కరికీ ఆందోళన, నిద్రలేమి ఉంటుంది. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వీటికి ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ వల్ల సరైన పరిష్కారం దొరుకుతుంది. లైఫ్‌స్టైల్ డిసీసెస్‌కి డైట్ ఫాలో అవ్వాలి అని అందరికీ తెలుసు. ఎందుకు కచ్చితంగా ఫాలో అవ్వాలి అనేది ఈ కౌన్సెలింగ్‌లో ఇస్తాం. అప్పుడే వాళ్లు పాటిస్తారు. సమస్య పరిష్కారమవుతుంది.

మహిళలకు సూచన...

మహిళల ఆరోగ్యానికి ముఖ్యమైన సూచన ఏమిటంటే సాధారణంగా మహిళలకు బాధ, జాలి, దయ, సంతోషంగా ఇలా అన్నీ ఎక్కువే. ఇలా ఉంటేనే పిల్లల్ని ఆరోగ్యంగా పెంచగలుగుతారు. ఈ లక్షణాలే ఆమెలోని బలాలు. అయితే ఈ ఫీలింగ్స్ వల్ల మహిళలు ప్రతి విషయంలో చాలా త్వరగా స్పందిస్తుంటారు. దీని వల్ల చాలా మంది ఆమె ఊరికే ఏడుస్తుంది, చిరాకు పడుతుంది, బాధపడుతుంది అంటుంటారు. ఆమెకు ఆ ఫీలింగ్స్ ఉన్నాయి కాబట్టే కుటుంబాన్ని చక్కగా చూసుకోగలుగుతుంది అనేది అందరూ అర్థం చేసుకోవాలి. ఆమెను ఆమెగా స్వీకరించాలి. అప్పుడు మహిళలు ఆరోగ్యంగా, ధైర్యంగా ఉండగలుగుతారు. ఆమె ఏదైనా విషయం చెప్తుంటే ప్రశాంతంగా కూర్చొని వినాలి. అప్పుడు సగం సమస్య పరిష్కారమవుతుంది. మహిళలు కూడా వారి భావోద్వేగాలను అర్థం చేసుకొని, నియంత్రించుకునే ప్రయత్నం చేయాలి. అవసరమైనప్పుడు ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకోవాలి. ఎమోషనల్‌గా, ఎకనామికల్‌గా ఇండిపెండెంట్ అయినపుడు మహిళలు పూర్తిగా వారి కాళ్ళపై వాళ్లు నిలబడగలుగుతారు.

కారణం మానసిక సమస్యలే

చిన్నప్పటి నుండి అందరూ నాలో సైకాలజిస్ట్ అయ్యే లక్షణాలు బాగా ఉన్నాయి అనేవారు. ఆ మాటలు కూడా నాలో ఆసక్తిని పెంచాయి. నా అధ్యయనంలో తేలిన విషయం ఏమిటంటే నేటి బిజీ జీవితంలో మనకు వచ్చే ఎన్నో జబ్బులకు ముఖ్య కారణం మానసిక సమస్యలే. ఏదైనా ఒక దానిపైనే స్పెషలైజేషన్ చేస్తే శరీరంలో ఒక్క భాగం గురించి మాత్రమే అవగాహన ఉంటుంది. అదే జనరల్ ఫిజీషియన్ అయితే శరీరం మొత్తంపై పూర్తి స్థాయి అవగాహన ఉంటుంది. దాని వల్ల సమస్యకు కారణం ఏంటీ అనేది రకరకాల యాంగిల్స్‌లో ఆలోచించవచ్చు. ఇలా కేవలం జనరల్ ఫిజీషియన్ మాత్రమే ఆలోచించగలరు. అసలు కారణం తెలుసుకొని సంబంధింత స్పెషలిస్ట్ వద్దకు రిఫర్ చేస్తారు.

- సలీమ

డీఎస్‌కు అశ్రు నివాళి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంతో జన హృదయ నేతగా పేరొందిన మాజీ మంత్రి డి.శ్రీనివాస్‌కు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్డులో డి.శ్రీనివాస్ కుటుంబీకులకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రగతినగర్‌లోని డి.శ్రీనివాస్ నివాసం నుంచి బైపాస్ రోడ్డులోని వ్యవసాయ క్షేత్రం వరకు నిర్వహించిన అంతిమయాత్రలో అశేష జనవాహిని పాల్గొని డీఎస్‌కు అశ్రు నివాళులర్పించారు. దాంతో రహదారంతా జనసంద్రంగా మారింది. అంత్యక్రియల్లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వేల సంఖ్యలో అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు. హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్‌కు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి.. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్‌లో రోడ్డు మార్గం గుండా ప్రగతినగర్‌లోని డీఎస్ నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, రాకేష్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, నగర మేయర్ నీతూ కిరణ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్ బిన్ హమ్దాన్, అధికారులు, అనధికార ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు డీఎస్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డీఐజీ సుధీర్ బాబు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఇతర ఉన్నతాధికారులు అంత్యక్రియల్లో పాల్గొని డీఎస్ భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. డీఎస్ కుమారులైన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, మాజీ మేయర్ డి.సంజయ్ తదితరులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పరామర్శించి సంతాపం తెలియజేశారు.

డీఎస్ మరణం తీరని లోటు :సీఎం రేవంత్ రెడ్డి

మాజీ మంత్రి డీఎస్ మరణం తీరని లోటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీఎస్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన అనంతరం సీఎం మాట్లాడారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన డీఎస్.. ఉమ్మడి రాష్ట్రంలో కీలక నేతగా కొనసాగారని గుర్తు చేశారు. విద్యార్థి నాయకుని స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి డీఎస్ అని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటులోనూ ఆయన కీలకపాత్ర పోషించారని, ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయన అందించిన సేవలను గుర్తించి ప్రభుత్వపరంగా అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించినట్టు తెలిపారు. డీఎస్ గౌరవం ఇనుమడించేలా, ఆయనను ప్రజలు, అభిమానులు ఎల్లవేళలా గుర్తుంచుకునేలా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డీఎస్ కుటుంబ సభ్యులను సచివాలయానికి పిలిపించుకుని, వారితో చర్చించిన మీదట డీఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. డీఎస్ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని అన్నారు.

నైజీరియాలో ఆత్మాహుతి దాడులు..

అబూజ : ఈశాన్య నైజీరియాలో బోర్నో రాష్ట్రంలో ఆత్మాహుతి దాడులు చోటు చేసుకున్నాయి. మూడు చోట్ల జరిగిన ఈ దాడుల్లో 18 మంది మృతి చెందారు. మరో 48 మంది గాయపడ్డారు. ఈ ఘటనలు శనివారం మధ్యాహ్నం జరిగినట్టు అక్కడి మీడియా వెల్లడించింది. అయితే ఈ దాడులు వివాహ వేడుకల్లో, గ్వోజా పట్టణంలోని ఓ ఆస్పత్రిలో , పెండ్లిలో మరణించిన వారి అంత్యక్రియల్లో జరిగినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను చికిత్స కోసం వివిధ ఆస్పత్రులకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో మహిళలు, గర్భిణులు, చిన్నారులు ఉన్నారు. ఈ ఆత్మాహుతి దాడుల నేపథ్యంలో బోర్నో స్టేట్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ బార్కిండో ముహమ్మద్ సైదు గ్వోజా టౌన్‌లోని ఘటనా స్థలాన్ని సందర్శించారు. అయితే ఈ దాడులకు వెనుక ఎవరు ఉన్నారు. ఉగ్రవాదులే ఈ చర్యలకు పాల్పడ్డారా లేదా ఎవరైనా స్థానికులే ఈ పనిచేశారా అనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనల నేపథ్యంలో అప్రమత్తమైన అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మ పేరుతో ఓ మొక్క

మన్ కీ బాత్‌లో మోడీ

నాలుగు నెలల తర్వాత పున: ప్రారంభం

న్యూఢిల్లీ : దాదాపు నాలుగు నెలల తర్వాత... మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ మరలా తొలిసారిగా ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతిని ఉద్దేశించి ఆయన ఇందులో పలు కీలకాంశాలను ప్రస్తావించారు. " మన్ కీ బాత్ స్ఫూర్తి దేశంలో వికసిస్తూనే ఉంది. మా ప్రభుత్వంపై ప్రజలు పూర్తి విశ్వాసం చూపించారు. అందుకే మీ అందరి మధ్య ఉన్నాను. వికసిత్ భారత్ కోసం కషి చేస్తున్నాము" అని అన్నారు. అనంతరం లోక్‌సభ ఎన్నికలపై మాట్లాడారు. 2024 ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలని, ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత పెద్ద ఎన్నికలు జరగలేదని, అందులో 65 కోట్ల మంది ఓట్లు వేశారని మోడీ అన్నారు. దీని కోసం కషి చేసిన ఎన్నికల కమిషన్‌తోపాటు ఓటింగ్ ప్రక్రియతో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.' టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్‌లో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది. ఈ విజయంతో 17 ఏండ్ల తర్వాత టీ20 ప్రపంచ కప్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. ఈ చారిత్రాత్మక విజయంపై సంతోషాన్ని వ్యక్తం చేసిన ప్రధాని.. భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. తమదైన స్టైల్లో ట్రోఫీని మరోసారి ఇంటికి తీసుకొచ్చిన భారత జట్టును చూసిన నేను గర్వపడుతున్నాను అంటూ చెప్పుకొచ్చారు. అలాగే టోక్యో ఒలింపిక్స్ గురించి ప్రధాని ప్రస్థావిస్తూ టోక్యో ఒలింపిక్స్‌లో మన ఆటగాళ్ల ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుందన్నారు. ఈ ఒలింపిక్స్ నుంచి మన ఆటగాళ్లు పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్నారన్నారు. ఆటగాళ్లందరినీ కలుపుకుంటే, దాదాపు 900 మంది అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటున్నారన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రత్యేక రకమైన గొడుగుల గురించి ప్రస్తావించారు. కేరళ సంస్కృతిలో గొడుగులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అక్కడ అనేక సంప్రదాయాలు, ఆచారాలలో గొడుగులు ఒక ముఖ్య భాగమని తెలిపారు. కేరళలోని అట్టప్పాడిలో తయారయ్యే 'కర్తుంబి గొడుగులు' గురించి, ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతా రామరాజు జిల్లాలో అరకు కాఫీ రుచి, సువాసనకు ప్రసిద్ధి చెందిందని కొనియాడారు. స్థానిక ఉత్పత్తులు ప్రజాదరణ పొందాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు చెందిన ఎన్నో ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. జూన్ 30 చాలా ముఖ్యమైన రోజని మోడీ అన్నారు. మన గిరిజన సోదరులు, సోదరీమణులు ఈ రోజును 'హల్ డే'గా జరుపుకుంటారు.

ఈ రోజు విదేశీ పాలకుల దురాగతాలను తీవ్రంగా వ్యతిరేకించిన వీరుడు సిద్ధో-కన్హు అద్భుతమైన ధైర్యానికి ముడిపడి ఉందన్నారు. వేలాది మంది సంతాలీ సహచరులను ఏకం చేశారని, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. 1857లో భారతదేశ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి రెండేండ్ల ముందు అంటే 1855లో జరిగింది. జార్ఖండ్‌లోని సంతాల్ పరగణాలో మన గిరిజనులు విదేశీ పాలకులకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టినట్లు మోడీ గుర్తు చేశారు.'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో పర్యావరణం, మొక్కలు నాటడంపై ప్రధాని నరేంద్ర మోడీ చర్చించారు. ప్రపంచంలో అత్యంత విలువైన సంబంధం ఏదంటే పర్యావరణమేనని అన్నారు . పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ తల్లి కోసం మొక్కలు నాటుతున్నారని తెలిపారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రచారం జరిగిందన్న మోడీ, ఈ ప్రచారం పేరు 'ఏక్ పీడ్ మా కే నామ్' అని అన్నారు. నా తల్లి పేరుతో నేను మొక్క నాటాను అంటూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మే నెలలో తుర్క్‌మెనిస్థాన్‌లో జాతీయ కవి 300వ జయంతి వేడుకలు నిర్వహించామని మోడీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచంలోని 24 మంది ప్రముఖ కవుల విగ్రహాలను తుర్క్ మెనిస్థాన్ అధ్యక్షుడు ఆవిష్కరించారు. ఈ విగ్రహాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం ఉందని గుర్తు చేశారు. ఇది ఠాగూర్ పట్ల , భారతదేశం పట్ల మనకు ఉన్న గౌరవం అని తెలిపారు. 10వ యోగా దినోత్సవాన్ని ప్రపంచమంతా ఎంతో ఉత్సాహంగా, జరుపుకున్నామని అన్నారు.

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణకు కాంగ్రెస్ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

లీకులు ఇస్తున్నారనీ, ఆ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దీనిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. పాతబస్తీలో కరెంటు బిల్లు వసూళ్లను అదానీకి అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయివేటు వ్యక్తులు విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు పైలెట్ ప్రాజెక్టుగా పాతబస్తీని ఎంచుకున్నారనీ, అది అక్కడికే పరిమితం కాదనీ, క్రమేణా రాష్ట్రం మొత్తం విద్యుత్ బిల్లుల వసూళ్లు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోడీ చెప్పినట్టు చేస్తున్నారనీ, విద్యుత్ సంస్కరణల అమలుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేంద్రం ఎన్ని వత్తిళ్లు తెచ్చినా, విద్యుత్ సంస్కరణలు అమలు చేసేది లేదని మాజీ సీఎం కే చంద్రశేఖరరావు అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఈ సంస్కరణలు అమలైతే విద్యుత్ సబ్సిడీలు, రైతులకు ఉచిత కరెంటు వంటివి ఉండబోవనీ, మోటార్లకు మీటర్లు పెడతారని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ, అదానీ విధానాలను రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ సంస్థ ప్రజల ఆస్తి. దీన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్తున్నారు. హైదరాబాద్ పాతబస్తీలో 45 శాతమే కరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయనీ, అందుకే ప్రయివేటు వ్యక్తులకు ఇస్తున్నామని సీఎం చెప్తున్నారనీ, రాష్ట్రం మొత్తంలో 95 నుంచి 97 శాతంకరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం పాతబస్తీ ప్రజల్ని అవమానించడమేనని అన్నారు. సింగరేణి బొగ్గు గనులను వేలం వేస్తుంటే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ కార్యక్రమంలో పాల్గొన్నారనీ, శ్రావణపల్లి బొగ్గు గనిని వేలం నుంచి ఎందుకు తీసివేయించలేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదని గుర్తు చేశారు. విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలన్నారు. తెలిపాలని డిమాండ్ చేశారు.

విస్తారంగా వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

నమోదైంది. ప్రస్తుత వర్షాకాలంలో ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 38,606 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. జొన్నలు 19,870 ఎకరాలు, సజ్జలు 124 ఎకరాలు, మొక్కజొన్న 35,808 ఎకరాల్లో వేశారు. ఈ వారంలో కురిసే వర్షాలపైనే ఆయా పంటల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని వ్యవసాయరంగ నిపుణులు చెప్తున్నారు. వర్షాలు సాధారణంగా కురిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది.

సీఎం ఇంటికి కేంద్రమంత్రి పీయూష్‌గోయల్

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి నేరుగా సీఎం ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా వారిరువురూ కేంద్ర, రాష్ట్ర రాజకీయాలతో పాటు రాష్ట్రాభివృద్ధిపైనా చర్చించారు. ఈ చర్చల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం రాజకీయ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

అసెంబ్లీలో నిరుద్యోగుల తరుపున ప్రభుత్వాన్ని నిలదీస్తాం

రాహుల్ గాంధీ హామీ ఏమైంది..?

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-బేగంపేట్

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అసెంబ్లిని స్తంభింపచేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులతో చర్చలు జరపాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో నిరుద్యోగ సమస్యలపై దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌ను ఆయన పరామర్శించారు. దీక్ష విరమించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి మోతీలాల్ నాయక్‌తో మాట్లాడాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే దాకా నిరుద్యోగులు తరపున బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు. మోతీలాల్‌ను దీక్ష విరమించాలని కోరగా.. ఇది తన ఒక్కడి పోరాటం కాదని, రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్నానని, ప్రభుత్వం దిగివచ్చేదాకా దీక్ష విరమించబోనని చెప్పారని తెలిపారు. మోతీలాల్‌కు ఏం జరగకముందే ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. పిల్లల హక్కుల పట్ల ప్రొ॥కోదండరాం పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. మోతీలాల్ నాయక్ ఏడు రోజుల నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ చూపెట్టి నిరుద్యోగులను వాడుకొని వదిలిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ది ఓడదాటే దాకా ఓడ మల్లన్న ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్నలా వ్యవహారం ఉందన్నారు. ఆనాడు నిరుద్యోగుల కోసం ప్రొఫెసర్ కోదండరాం, రియాజ్, బాల్మూరి వెంకట్, మురళి, రేవంత్ రెడ్డి అశోక్ నగర్‌లో కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగారని, రాహుల్ గాంధీని అశోక్ నగర్‌కు తీసుకువచ్చి ప్రమాణాలు చేయించారన్నారు. అయితే మీకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయి కానీ నిరుద్యోగులకు రాలేదన్నారు. ఇప్పుడు ఎందుకు మీ గొంతులు మూగబోయాయని ప్రశ్నించారు.

రాహుల్ గాంధీ రెండు లక్షల ఉద్యోగాలు ఏడాదిలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని.. ఏడు నెలలైనా ఎందుకు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వలేదని నిలదీశారు. జాబ్ క్యాలెండర్ ఏమైందని, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు ఆంధ్రప్రదేశ్‌లో 1:100 పిలుస్తున్నప్పుడు ఇక్కడ ఎందుకు సాధ్యంకాదని ప్రశ్నించారు. నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే పోరాటాలు చేస్తుంటే ఎందుకు రాహుల్ గాంధీ పట్టించుకోరో చెప్పాలన్నారు. గ్రూప్-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. జీవో 46 రద్దు చేస్తామని ఎందుకు చేయడం లేదని, మెగా డీఎస్సీ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. ప్రొఫెసర్ కోదండరాం ఇదే నిరుద్యోగులను రెచ్చగొట్టారని.. ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. నిరుద్యోగులు యువకులు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఇదేనా ప్రజాపాలన అని నిలదీశారు. నిరుద్యోగుల డిమాండ్‌లను పరిష్కరించకుంటే నిరుద్యోగుల తరఫున మరో పోరాటానికి బీఆర్‌ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరించారు.

అంగన్‌వాడీలను ఇంటికి పంపొద్దు

సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి జులైలో ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ లేఖ రాశారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలు చెల్లించి వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ ఉద్యోగుల స్థితిగతులు, 24 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు, ఉద్యోగ విమరణ ప్రయోజనాల విషయాలపై మంత్రి, ఐసీడీఎస్ అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లామని తెలిపారు.

వాటిని పట్టించుకోకపోగా అంగన్‌వాడీలు వ్యతిరేకించిన జీవో నెంబర్ 10ని అమలు చేయాలని చూడటం దారుణమని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా జూన్ 7 న ఐసీడీఎస్ డైరెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించామని గుర్తుచేశారు. మంత్రి సీతక్క, ఐసీడీఎస్ డైరెక్టర్ న్యాయం చేస్తామని హామీనిచ్చారని తెలిపారు. ఇప్పుడు అతి తక్కువ డబ్బులు చెల్లించి ఇంటికి పంపించాలని నిర్ణయించడం మోసం చేయటమేనని పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు న్యాయం చేకూరేలా కొత్త జీవోలను విడుదల చేయాలని కోరారు.

సాధారణ ఫీజుతో దంత వైద్య సేవలే ధ్యేయం





డాక్టర్ సిద్ధంరెడ్డి బిందుప్రియ

- 'డాలర్ స్మైల్స్' దంత వైద్యశాల దంత వైద్య నిపుణులు డాక్టర్ సిద్ధంరెడ్డి బిందుప్రియ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తమ ఆస్పత్రికి వచ్చే అన్ని వర్గాల ప్రజలకు సాధారణ ఫీజులతో మెరుగైన దంత వైద్య సేవలు అందించడమే తమ ధ్యేయమని "డాలర్ స్మైల్స్" దంత వైద్యశాల ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్.సిద్ధంరెడ్డి బిందుప్రియ అన్నారు.సోమవారం "డాక్టర్స్ డే" పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ (హెచ్ఎంటీ మెయిన్ రోడ్)బస్ స్టాప్ సమీపంలో గల "డాలర్ స్మైల్స్ దంత వైద్యశాల" ఆస్పత్రి కార్యాలయంలో ఆదివారం ఆమె నవ తెలంగాణతో మాట్లాడారు. సామాన్యులకు సైతం కార్పొరేట్ స్థాయి దంత వైద్యం, అత్యాధునిక టెక్నాలజీ గల మిషనరీతో వైద్యసేవలు అందుబాటు లో ఉండే విధంగా చూస్తున్నామన్నారు. మానవ సేవయే మాధవసేవ... అన్న నానుడిని సార్ధకత చేస్తూ ఈ దంత వైద్యశాల నెలకొల్పడం జరిగిందని పేర్కొన్నారు. తమ డాలర్ స్మైల్స్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో గత కొన్నేండ్లుగా పరిసర ప్రాంతాల లోని పాఠశాలల్లో ఉచిత దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమందికి దంత చికిత్సలు చేయడం జరిగిందన్నారు. తమ దంత వైద్యశాలకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా నగర్ శివారు ప్రాంతాల నుండి అత్యధికంగా వస్తు వైద్యం చేయించుకుంటారన్నారు.పేద మధ్యతరగతి ప్రజ లకు తనవంతుగా సామాజిక సేవే లక్ష్యంగా ముం దుకు వెళు తున్నామన్నారు.వైద్యరంగంలో పెరుగు తున్న సాంకేతికత పరిజ్ఞానానికి అనుగుణంగా ఆధునిక పరికరాలతో విశిష్ట దంత సేవలు అంది స్తున్నామని డాక్టర్ బిందుప్రియ స్పష్టం చేశారు.

నోటి శుభ్రత ఆరోగ్యానికి భద్రత

పళ్ళ నిర్లక్ష్యంతో చాలా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు ఆమె మాట్లాడుతూ "నోటి సమస్య కారణంగా ప్రతి మనిషి రెండు విధాలుగా ఇబ్బంది పడతాడు.మొదటిది సాధారణ ఇన్ఫెక్షన్ అయితే రెండోది ఆహారం తీసుకోక పోవడం.ఈ రెండింటి వల్ల హార్ట్ ఎటాక్, డయాబె టిస్, థైరాయిడ్,వంటి పలు ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు (పరిశోధకులు) వెల్లడించారు" అని తెలిపారు.

నవతెలంగాణ :దంత సమస్యలు తలెత్తితే ఎంత తొందరగా వైద్యులను సంప్రదించాలి?

డాక్టర్ : ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యులను సంప్రదించడం వల్ల వ్యాధి (సమస్య) నిర్ధారణ ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన సమయానికి సరైన వైద్యం చేసుకోగలమన్నారు.

నవతెలంగాణ : పిల్లలకు కూడా దంత సమస్యలు వస్తాయా ? పాల పళ్లకి వైద్యం అవసరమా?

డాక్టర్ : ఇండ్లల్లో ఈసీసీ విరిగిన పళ్లకి వైద్యం తప్పనిసరి. వాటిని నిర్లక్ష్యం చేసి వదిలేస్తే ఇన్ఫె క్షన్ ఎక్కువైపోయి తీవ్రమైన నొప్పి , వాపుతో పిల్లలు ఇబ్బంది పడడమే కాకుండా శాశ్వత పళ్లకి సరైన పద్ధతిలో అమర్చబడలేవు.

మౌత్ వాష్ చేయడం వల్ల నోట్లో టూత్ బ్రష్ వెళ్లలేని ప్రాంతాల్లో దంతాలను శుభ్రం చేయడానికి ఉపయోగపడుతుంది. ఆహారం తిన్న ప్రతిసారి నోట్లో నీళ్లు వేసుకుని రెండు నిమి షాల పాటు పుక్కి లించడం తప్పనిసరి. మౌత్ వాష్ చేసుకో వడం వల్ల బ్యాక్టీరి యా,వైరల్, ఫంగల్, ఇన్ఫెక్షన్ కూడా నివారించవచ్చు ఇవి మాత్రమే కాకుండా కొన్ని ఆహార నియ మా లు పాటిస్తూ ప్రతి 6 నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయిం చుకుంటే దంతాలకు నో టెన్షన్.

నవతెలంగాణ : నొప్పి లేకపోయినా పళ్ళ సమస్యలు ఉంటా యా?

డాక్టర్: మనిషి పళ్లన్ని ఒకేలా ఉండక పోయినా అన్నింటిలో మూడు పొరలు ఉంటాయి.పై పొరని ఎనామిల్, మధ్యలో పొరని డెంటిన్,మూడో పొరని పల్ప్ అని అంటారు. ఎనామిల్ పొరలో ఇన్ఫెక్షన్ లేదా పుచ్చు ఉన్నప్పటికీ మనిషికి ఎలాంటి సమస్యలు ఉండకపోవచ్చు. కానీ ఆ ప్రభావం మధ్యలోని డెంటిన్కు చేరిన తర్వాత 'సెన్సిటివిటీ', ఆహారం ఇరుక్కుపోవడం తెలుస్తుంది.దీని ప్రభావం పల్ప్ లోకి చేరిన తర్వాతే నొప్పి ప్రభావం తెలుస్తుంది.

నవతెలంగాణ : పుచ్చు ఒక పన్ను నుండి పక్క పన్నుకి పాకే అవకాశం ఉంటుందా?

డాక్టర్: పుచ్చు పళ్ల వ్యాధి ఒక పంటి నుండి ఇంకొక పంటికి సోకడం అనేది అపోహ మాత్రమే సరైన పద్ధతిలో పళ్లను శుభ్రం చేయకపోవడం వలన మాత్రమే పుచ్చు పళ్లు మరియు చిగుళ్ల సమస్యలు మొదలవుతాయి.

నవతెలంగాణ:నోటి ఆరోగ్యం పెంపొందించడం ఎలా లేదా నోటి ఆరోగ్యం సూత్రాలు. ఏమిటి?


డాక్టర్: అత్యంత ప్రాముఖ్యమైనది మౌత్ వాష్ చేయడం. ప్రతిరోజూ ఉదయం రాత్రి వేళల్లో రెండు నిమిషాల పాటు సరైన పద్ధతిలో తప్పక మౌత్ వాష్ చేయాలి.బ్రష్ చేసేటప్పుడు మన పళ్లనే కాదు నాలుకను కూడా శుభ్రం చేసుకోవాలని తెలిపారు.

పళ్ల మధ్యలో ఇరుక్కున్న ఆహారాన్ని ఎస్ , ఇంటర్ డెంటల్ బ్రష్ లతో తొలగిం చాలి. పిన్నులు,పుల్లలు, టూత్ పిక్స్ లాంటివి వాడితే ప్రమాదం. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు.

మెరుగైన వైద్య సేవలే పల్స్ ఆస్పత్రి లక్ష్యం

- ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ (జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్) ఎం.రవికుమార్





డాక్టర్ ఎం.రవికుమార్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తమ ఆస్పత్రికి వచ్చే అన్ని వర్గాల ప్రజలకు తక్కువ ఫీజులతో మెరుగైన వైద్య సేవలు అందిం చడమే తమ లక్ష్యమని "పల్స్ ఆస్పత్రి "మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రవికుమార్ అన్నారు. సోమవారం"డాక్టర్స్ డే" పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ పరిధి పట్వారి నగర్ కాలనీలోని ఆస్పత్రిలో డాక్టర్. ఎం.రవికుమార్ నవతెలంగాణతో ఆదివారం మాట్లాడారు. మానవసేవయే మాధవసేవ....అన్న లక్ష్యంతో తాను డాక్టర్ వృత్తిని చేపట్టానని తెలిపారు. గత మూడు దశాబ్దాల క్రితం చింతల్ ప్రధాన రహదారితో పాటు ఇక్కడ ఈ ప్రాంతంలో ఆస్పత్రిని ఏర్పాటు చేసిన నాటి నుండి నేటి వరకు నగరంలోని వివిధ ప్రాంతాల, రాష్ట్రాల నుండి వచ్చే రోగులకు,పేదలకు ఎన్నో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందుతున్నా మన్నారు. కార్పొరేట్ స్థాయి ఆస్పత్రి వలే కాకుండా అతి తక్కువ ఖర్చులతో రోగులకు అవసరమయ్యే వైద్య పరీక్షలు (టెస్టులు)నిర్వహిస్తూ ఫ్రెండ్లీ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కృషితో నాస్తి దుర్భిక్షం అనే నానుడిని సార్ధకత చేయాలని తపన తో పేదప్రజల నివాసిత ప్రాంతాల్లో ఆస్పత్రి నెలకొల్పడం జరిగిందన్నారు.కంటికి రెప్పలా కాపా డుతూ వారి దీవెనలతో దినదినాభివృద్ధి చెందుతు న్నామన్నారు.

ఆస్పత్రిలో మెరుగైన పరీక్షల విధానం

తమ ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్,జనరల్ లాప్రోస్కోపిక్ సర్జరీ, డయా బెటిక్స్,జాయింట్స్ రీప్లెస్మెంట్,పెడియాట్రిక్స్ న్యూనాటా లజీ,గైనకాలజీ ,ఇన్ఫెర్టిలిటీ ఈఎన్టి,ఆర్థోపెడిక్ డెర్మటాలజీ, కాస్మటాలజీ, పోడియా ట్రిక్స్,ఫుడ్ కేర్, రేడియాలజీ, పల్మనాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, రుమటాలజీ,న్యూరో సర్జరీ, స్పైన్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, లతోపాటు అధునాతన సిటి స్కాన్,టూ డి ఈకో,డిజిటల్ ఎక్స్ రే,ఈసీజీ, సోనోగ్రఫీ ఐసీయూలతో,పాటు అనుభవజ్ఞులైన వైద్యులు స్టాఫ్ నర్స్ లు,24/7 గంటల పాటు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. విశాలమైన ఆపరేషన్ గది తో పాటు 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుచేసి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో వైద్యం అందిస్తున్నామన్నారు.

మధుమేహ వ్యాధిగ్రస్తులు పాటించాల్సిన జాగ్రత్తలు

మధుమేహం (షుగర్) ఉన్న వారు గుడ్డు తెల్లని సొన మాత్రమే తినాలని, లోపలి పచ్చ నీలం తినకూడదని తెలిపారు. చికెన్ వారానికి 75 గ్రాములు మాత్రమే తీసుకోవాలని,చేపలు వారానికి రెండు,మూడు ముక్కలే తినాలన్నారు. మేక మాం సం తినకూడదని, మద్యం తీసుకోకూడదని, మంచి నూనె రిఫండ్ ఆయిల్ వారానికి నాలుగైదు స్పూన్లు వాడాలని, జొన్న రొట్టెలు, రాగి జావా, రాగి మాల్ట్, షుగర్ లేకుండా టీ తప్పక తీసుకోవాలి అన్నారు.

తిన కూడని పదార్థాలు - వాటి వల్ల వచ్చే అనర్థాలు.

చక్కెర, బెల్లం,స్వీట్లు,తేనె,ఐస్ క్రీమ్స్,కూల్ డ్రింక్స్, చాక్లెట్స్ ,పిజ్జా, బర్గర్స్, కేక్స్, సమోసా, కాజు, పిస్తా, ఖర్జూర, బేకరీ ఐటమ్స్, అతినూనె పదార్థాలతో పాటు సీతాఫలం,సపోటా,అరటి పండ్లు, ఆపిల్స్, కొబ్బరి, తినకపోవడం చాలా ఉత్తమం అని డాక్టర్ ఎం.రవికుమార్ తెలిపారు.

తినాల్సిన పండ్లు - వాటి వల్ల జరిగే మేలు

ఏదైనా ఒక పండు జామ, బొప్పాయి, దానిమ్మ, పుచ్చపండు, కమలపండ్లు, బత్తాయి ,కీర, క్యారెట్ ,బీట్ రూట్, పండ్లు మాత్రమే తినాలని, వీటితోపాటు మెంతి పొడి రెండు స్పూన్లు, కాకరకాయ రసం మూడు స్పూన్లు తీసుకోవాలని సూచించారు. దీంతోపాటు 45 నిమిషాలు వాకింగ్ నడవాలన్నారు. (ఉదయం లేక సాయంత్రం) ఫిజికల్ వ్యాయామం చేయాలని, కావలసినంత నిద్రపోవాలని, ఇవి పాటిస్తే ఆరోగ్యమే మహాభాగ్యంగా జీవిస్తామని ఆయన స్పష్టం చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.